# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 30 అక్టోబర్ 2025 | సంపుటి: 9 | సంచిక: 300 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## జూబ్లీ ఉప పోరు వార్తలు

పొలిటికల్ స్లెడ్జింగ్ | ర్యాండమైజేషన్

మైక్రో అబ్జర్వర్స్ కీలకం

న్యాయపరమైన చర్యలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

12



## రఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి

ముర్మును ఫైటర్ జెట్‌లో తిప్పిన రఫేల్ రాణి

మరోసారి వార్తల్లోకి స్క్వాడ్రన్ లీడర్ శివాంగీ సింగ్

2



# బీ అలర్ట్.. ప్రజలకు అందుబాటులో ఉండాలె





### ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలె

### ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలె

### మొంథా తుపాన్‌పై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 29, (మనం బ్యూరో): మొంథా తుపాను నేపథ్యంలో రాష్ట్రంలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి నష్టం జరుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు రాష్ట్రంలో తుపాను ప్రభావంపై అధికారులతో ఆరా తీశారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో తుపాను ప్రభావం అధికంగా ఉండటంతో ఆ జిల్లాల్లో అధికారులు ప్రజలకు అన్ని సమయాల్లోనూ అందుబాటులోఉండాలని సూచించారు. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండటంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే దారి మళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే, మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలనీ, జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగి పొర్లే ప్రమాదం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ.. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. తుపాను నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఆస్తి, ప్రాణ, పశు నష్టం చోటు చేసుకోకండా జాగ్రత్తలు తీసుకోవాలనీ, హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసి, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్లు

### స్కాన్ చేస్తే సమస్త వివరాలు కన్పిస్తాయి



పబ్లిక్ వర్క్సలో ట్రాన్స్‌పరెన్సీ, అకౌంటబిలిటీ కోసమేనన్న గడ్కరీ

స్మార్ట్ రోడ్ల భద్రతపై ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రసంగించిన నితిన్

ఢిల్లీ, అక్టోబర్ 29: దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్లను ప్రవేశపెట్టాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. పౌరులు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ ప్రాజెక్టు కోసం పని చేసిన కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు, నిర్మాణానికి మంజూరుచేసిన బడ్జెట్, గడువు, నిర్వహణ ...మిగతా 2లో

## బంగ్లా ఎన్నికల్లో పోటీ చేస్త

ఢిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా

2



## అజహరుద్దీన్‌కు మంత్రి పదవి?

- రేపు క్యాబినెట్ విస్తరణ
- ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్!

హైదరాబాద్, అక్టోబర్ 29, (మనం బ్యూరో): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మహమ్మద్ అజహరుద్దీన్‌కు మంత్రి పదవి లభించనుందా? శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగనుందా? రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇదే అంశంపై బుధవారం రోజంతా కాంగ్రెస్ పార్టీతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృతంగా ...మిగతా 2లో

## రానున్న 2 రోజులు భారీ వర్షాలు

### రెడ్ అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ • నిండు కుండల్లా రిజర్వాయర్లు..

హైదరాబాద్, మనం ప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొంథా ప్రభావంతో తెలంగాణలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. తీవ్ర తుపాను మొంథా మంగళవారం అర్ధరాత్రి సమయంలో తీరం దాటిందని.. కాకినాడకు సమీపంలోని నరసాపురానికి దగ్గరలో తీరం దాటినట్లుగా వాతావరణశాఖ పేర్కొంది. తీవ్ర తుపాను ప్రస్తుతం బలహీనపడిందని.. రాబోయే రోజు గంటల్లో తీవ్ర ...మిగతా 2లో

## కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఎంఐఎంకు వేసినట్టే

ప్రజల్లో తిరిగే వ్యక్తి కావాల్నా...బైండోవర్ నేత కావాల్నా ?

జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

ఉప ఎన్నికపై పదాధికారుల సమావేశం



హైదరాబాద్, అక్టోబర్ 29 (మనం బ్యూరో): పోలీస్ స్టేషన్లలో బైండోవర్ అయ్యే కాంగ్రెస్ అభ్యర్థి కావాల్నా? అభివృద్ధి కోసం ప్రజల మధ్య తిరిగే బీజేపీ అభ్యర్థి కావాల్నా? జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి తగిన అభ్యర్థులు లేరని గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేసిన అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపిందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అధ్యక్షతన బుధవారం జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ ప్రధాని మోడీ నేతృత్వంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడపగడపకు చేరేలా ప్రచారం చేయాలని సూచించారు. గత బీఆర్ఎస్ పాలనలో చోటు చేసుకున్న అవినీతి, అరాచకాలను, అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ...మిగతా 2లో

## మొబైల్ స్క్రీన్‌పై కాలర్ పేరు

### మార్చి నాటికి అందుబాటులోకి రానున్న ఫీచర్

ఢిల్లీ, అక్టోబర్ 29: మొబైల్లోని మన కాంటాక్ట్ లిస్ట్ లో లేని వ్యక్తి కాల్ చేస్తే ఆ వ్యక్తి నంబర్ మాత్రమే కనిపిస్తుంది. ఒకవేళ ఆ వ్యక్తి ఎవరో తెలియాలంటే ట్రూకాలర్ వంటి థర్డ్ పార్టీ యాప్స్ పై ఆధారపడుతున్నాం కదా! దీని వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న విషయం మనందరికీ అనుభవమే. ఈ ఇబ్బందులు మార్చి నెల నుంచి తొలగిపోనున్నాయి. ఫోన్ కనెక్షన్ కోసం ఇచ్చిన గుర్తింపు కార్డులోని పేరే ఇన్‌కమింగ్ కాల్స్ సమయంలో మొబైల్ స్క్రీన్ పై కనిపించేలా టెలికాం కంపెనీలు సన్నాహాలు





చేస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో సర్కిల్లో ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నాయి. దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి రానున్నట్లు సంబంధిత ...మిగతా 2లో

## చంద్రన్న ఒక ద్రోహి

దేవ్‌జీని జనరల్ సెక్రెటరీగా ఎన్నుకోలేదు

మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి గణేష్ పేరిట లేఖ

హైదరాబాద్, అక్టోబరు 29, మనం (ప్రత్యేకప్రతినిధి): మావోయిస్టు నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న పార్టీ ద్రోహి అంటూ ఒడిశాకు చెందిన మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి గణేష్ పేరిట బుధవారం లేఖ విడుదలైంది. చంద్రన్న భవిష్యత్తులో తన విప్లవాన్ని ప్రజల మధ్య ఉంది చేస్తానని అనడం, తన దిగజారుడుతనానికి నిదర్శనమని తెలిపారు. రాజ్యం ఎదుట లొంగిపోయిన తాను విప్లవకారుడిని అని చెప్పుకునే హక్కు అతనికి లేదని లేఖలో మండిపడ్డారు. బసవరాజ్ మరణం తర్వాత దేవ్ జీ జనరల్ సెక్రెటరీగా ఎన్నుకోబడ్డానని చెప్పడం కూడా అబద్ధమని, బసవరాజ్ మరణం తర్వాత తాము ఎలాంటి సమావేశాలు ...మిగతా 2లో

## రక్తదానం ఓ ప్రాణ దానం

- డీజీపీ కార్యాలయంలో తొలిసారి రక్తదాన శిబిరం
- రక్తదానం చేసిన డీజీపీ, ఏడీజీపీ, ఐజీలు

2



## నేను ఇండిపెండెంట్

నా వెనుక ఎవరూ లేరు

నా ముందు ప్రజలు మాత్రమే ఉన్నారు

దగాపడ్డ ఉద్యకారుల్లాగా..నేనూ బాధితురాలినే

మహబూబ్‌నగర్ పర్యటనలో కవిత కీలక వ్యాఖ్యలు

2



## సైబర్ క్రైంలో 'చిరు' ఫిర్యాదు

తనపై సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నారని ఆవేదన



2



## ఉమ్మడి.. టార్గెట్ భారత్

### పాక్, బంగ్లా రక్షణ బంధం మరింత గాఢతరం

ఢాకా, అక్టోబర్ 29: రక్షణ రంగంలో మరింతగా సహకరించుకోవాలని పాకిస్థాన్, బంగ్లాదేశ్ నిర్ణయించుకున్నాయి. రెండు దేశాల మధ్య తరచూ సైనికాధికారుల పర్యటనలు కొనసాగాలని నిర్ణయం తీసుకున్నాయి. బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న పాకిస్థాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ జనరల్ సాహిర్ షంషద్ మీర్జా.. మంగళవారం బంగ్లా సైన్యాధిపతి జనరల్ వకీర్-ఉజ్-జమాన్తో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య రక్షణ సహకారం విస్తరించడంపట్ల ...మిగతా 2లో

## భారత్ వస్తోన్న రష్యా చమురు ట్యాంకర్ యూటర్న్



### బాల్టిక్ సముద్రంలో ఆగిపోయిన హెచ్ఎంఈఎల్ చమురు నౌక

### అమెరికా ఆంక్షలవల్లేనని మీడియా కథనాలు



మాస్కో, అక్టోబర్ 29: ఉక్రెయిన్ తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో రష్యా నుంచి భారత్ కు జరుగుతోన్న చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు కనిపిస్తోంది. ఆ దేశ ముడిచమురుతో భారత్ వైపు వస్తోన్న ట్యాంకర్ మార్గమధ్యలో యూటర్న్ తీసుకుంది. బాల్టిక్ సముద్రంలో నిలిచిపోయింది. డెన్మార్క్, జర్మనీ మధ్య ఉన్న జలసంధిలో పశ్చిమం వైపుగా వెళ్తున్న ఒక ఆయిల్ ట్యాంకర్ మంగళవారం వెనక్కి మళ్లింది. కొంతదూరం వెళ్లిన తర్వాత నెమ్మదించిందని షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడించింది.

ఇదిలాఉంటే.. ఈ ఆంక్షల నేపథ్యంలో హెచ్ఎంఈఎల్ సంస్థ అధికారులు రష్యా చమురును కొనుగోలు చేశారు. ఈ రిఫైనరీ.. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మిత్తల్ గ్రూప్ (హెచ్ఎంఈఎల్) భాగస్వామ్యంలో నడుస్తోంది. ఆర్సెలార్ మిత్తల్‌కు చెందిన ఎనర్జీ విభాగం ఆంక్షల పరిధిలో ఉన్న నౌకల ద్వారా ముడి చమురును గుజరాత్ లోని ముంద్రా నౌకాశ్రయానికి దిగుమతి చేసుకొని అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పంజాబ్లోని గురుగోవింద్ సింగ్ రిఫైనరీకి సరఫరా చేసినట్లు ఆంగ్ల పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. ఇది దేశంలోనే పదో అతిపెద్ద రిఫైనరీ. ఒక ఏడాదికి 11.3 మిలియన్ టన్నుల ముడిచమురును ...మిగతా 2లో

## దేశాధినేతపై అమెరికా గూఢచర్యం

### వెనెజువెలా అధ్యక్షుడు మదురోపై ట్రంపు కుట్రలేకుట్రలు



న్యూయార్క్, అక్టోబర్ 29: వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోకు వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడటం అమెరికా ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారింది. ఇందులో భాగంగానే అమెరికా గూఢచార ఏజెంట్ ఎడ్విన్ లోపెజ్ ఏకంగా మదురో చీఫ్ పైలట్ కు గాలంవేసే ప్రయత్నం చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. మదురో విమానాన్ని మళ్లించి ఆయనను అమెరికా అరెస్టు చేయడానికి వీలు కల్పిస్తే చీఫ్ పైలట్ ను అత్యంత ధనికునిగా మార్చేస్తామంటూ డీల్ కుదుర్చుకునే ...మిగతా 2లో

## దేశాధినేతపై అమెరికా గూఢచర్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నమూ జరిగింది. అయితే ఈ విషయంలో పైలట్ ఎలాంటి హామీ ఇవ్వకుండా కేవలం తన ఫోన్ నెంబర్ను మాత్రమే గూఢచారికి ఇచ్చి వెళ్లాడు. గూఢచారి లోపెజ్ మరో 16 నెలలపాటు మదురో పైలట్ ను ఒప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగించాడు. వెనెజువెలాలో బలమైన నాయకునిగా పేరుగన్న మదురోను, ఆయన ప్రభుత్వాన్ని కూల్చడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కాదనడానికి ఈ ఉదంతం ఒక ఉదాహరణ మాత్రమే. ట్రంప్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టాక మదురోపై చర్యలకు మరింత గట్టిగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ట్రంప్ వెనెజువెలా అధినేతను మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారుగా అభివర్ణిస్తారు. ఆయనను పట్టుకునేందుకు కొవర్ట్ ఆపరేషన్ నిర్వహించేందుకు ట్రంప్ ఈనెల అనుమతి ప్రదానం చేశారు కూడా.

# రఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి



ఢిల్లీ, అక్టోబర్ 29: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధ విమాన పైలట్ శివాంగీ సింగ్‌తో దిగిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో శివాంగీని బంధించినట్లు పాక్ ప్రచారం చేయడంతో సింగ్ పేరు అప్పట్లో మార్మోగింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్ మీడియాలో విపరీతంగా అసత్య ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే భారత్ కు చెందిన రఫేల్ సహా పలు యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఓ మహిళా పైలట్ ను బంధించామని పాక్ అబద్ధాల కథనాలు వండి వార్చింది. ఈ ప్రచారాన్ని భారత్ అప్పట్లోనే ఖండించింది. దీంతో నాడు శివాంగీ సింగ్ పేరు నెట్టింట తెగ వైరల్గా మారింది.

**వాయుసేన 'గోల్డెన్' గర్ల్..**

సింగ్ స్వస్థలం వారణాసి. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్సీసీలో చేరారామె. ఆపై 2016లో ఎయిర్ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. చిన్నతనం నుంచీ పక్షిలా ఆకాశంలో ఎగరాలని కలలు కన్న ఆమె.. ఎప్పటికైనా పైలట్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశ యుద్ధ విమాన పైలట్లుగా నియమితులైన మోహనా సింగ్, భావనా కాంత్, అవనీ చతుర్వేది స్ఫూర్తితో పైలట్గా శిక్షణ తీసుకున్నారు. 2017లో రెండో దశ యుద్ధ విమాన పైలట్లలో ఒకరిగా ఎంపికైన శివాంగీ.. మిగ్-21 బైసన్ యుద్ధ విమానాలు నడపడంలో ప్రావీణ్యం సాధించారు. మిగ్ ఫైటర్ జెట్లు నడిపిన అనుభవంతోనే 2020లో దేశంలోనే అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం దక్కించుకున్నారు. అప్పటి నుంచి అంబాలా ఎయిర్ బేస్ లోని 'గోల్డెన్ యారోస్' స్క్వాడ్రన్ బృందంలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

**రఫేల్ రాణి..**

2022లో జరిగిన గణతంత్ర వేడుకల్లో 'భవిష్యత్తు కోసం భారత వైమానిక దళం రూపాంతరం చెందుతోంది' అనే థీమ్ తో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ శకటాన్ని ప్రదర్శించింది. ఈ శకటంలో రఫేల్ ఫైటర్ జెట్ యుద్ధ విమానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శకటంపై శివాంగి సింగ్ సెల్యూట్ చేస్తూ కనిపించారు. గణతంత్ర వేడుకల పరేడ్లో పాల్గొన్న రెండో పైలట్ గా ఘనత సాధించారు. ఆ సమయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా 'రఫేల్ రాణి' అంటూ చేసిన పోస్ట్ బాగా వైరల్ అయిన విషయం పాఠకులకు తెలిసిందే.

## ఉమ్మడి.. టార్గెట్ భారత్

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో సంతోషం వ్యక్తమైంది. 'ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రత పరిస్థితులపై ఇరువురు సైనిక ప్రముఖులు చర్చించారు. రెండు దేశాల బంధాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకున్నారు. శిక్షణ, సంయుక్త విన్యాసాలు, ఉగ్రవాదాన్ని వ్యతిరేక పోరాటంలోని అనుభవాలను పంచుకోవడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి' అని మంగళవారం పాకిస్థాన్ సైన్యం అధికార ప్రతినిధి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# నేను ఇండిపెండెంట్



హైదరాబాద్, అక్టోబరు 29, మనం(ప్రత్యేక ప్రతినిధి): తాను ఇండిపెండెంట్‌నని తన వెనుక ఎవరూ లేరని, కేవలం తన ముందు ప్రజలు మాత్రమే ఉన్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. జనం బాట యాత్రలో భాగంగా బుధవారం ఆమె మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రజల్లోకి కొత్తగా వచ్చిన వారిపై ఆరోపణలు, అనుమానాలు, అవమానాలు సహజమేనన్నారు. కాంగ్రెస్ వాళ్లు నేను బీజేపీ బీ టీమ్ అని, బీజేపీ వాళ్లు కాంగ్రెస్ బీ టీమ్ అని అనడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. అలాగే బీఆర్ఎస్ వాళ్లు సైతం వారికి తోచిన విధంగా ఏదేదో ఆరోపణలు చేస్తూనే ఉన్నారని ఎద్దేవ చేశారు. బీఆర్ఎస్ తో తనకు ఏలాంటి సంబంధం లేదని ఆ పార్టీ గురించి తన ముందు ప్రస్తావించవద్దన్నారు. మొదటి నుంచి తాను పని పెట్టుకుంటే ఆ కమిట్ మెంట్ ఎలా ఉంటుందో త్వరలోనే తెలుస్తుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో పాలకులు అన్యాయం చేస్తున్నారని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేస్తే మంచి పేరు వస్తుందని రేవంత్ కు సూచిస్తున్నానన్నారు. జాగృతి ఒక సివిల్ సొసైటీ అని ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రాధాన్యమన్నారు. అందరికీ అవకాశం, అభివృద్ధి, ఆత్మగౌరవ ఉండాలన్నదే మా విధానమని వివరించారు. ఇందుకోసం సామాజిక తెలంగాణ ద్వారానే అది సాధ్యమని భావించి పోరాటం చేస్తున్నామన్నారు.

**కృష్ణా కాలువలో క్రికెట్:**

మహబూబ్ నగర్ జిల్లాకు ఆనుకుని ఉన్న కర్నాటకలో ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచుతున్నారని, దానిని ఆపాలని కవిత డిమాండ్ చేశారు. కర్నాటకలో ఉన్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అని రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టు ఎత్తు పెంచకుండా ఆపాలని సూచించారు. ప్రాజెక్టు ఎత్తు పెరిగితే కృష్ణా కాలువలో క్రికెట్ మ్యాచ్ ఆడుకోవాలే తప్ప చుక్క నీరు కూడా రాదని చెప్పారు. రైతులు ఇబ్బంది పడతారని, వానలు పడకపోతే నీళ్లు వచ్చే పరిస్థితే లేదని స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ దానిని ఆపాలని చెప్పారు. సామాన్యులకు కనీస వైద్యం అందించ లేని స్దితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు మంజూరు చేయకపోవడం వల్ల పేద విద్యార్థులు చదువులు వదిలి ఇంటి వద్దే ఉంటున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జాగృతి సంస్థ కీలక పాత్ర పోషించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**అందరికీ అధికారం:**

తెలంగాణలో అధికారంలో అందరికీ వాటా దక్కాలని కవిత డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ స్థానిక సంస్థ ఎన్నికల్లో వర్తిస్తుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల పరిస్థితి తేలడం లేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముస్లిం, లంబాడిలు లేని మొట్టమొదటి కేబినెట్ ఇదేనంటూ ఎద్దేవ చేశారు. ఆత్మగౌరవం కలిగిన అధికారం కావాలని కవిత ఆకాంక్షించారు. అధికారం.. ఆత్మగౌరవం, సామాజిక తెలంగాణ నినాదంతో తెలంగాణ జాగృతి పోరాడుతుందని స్పష్టం చేశారు. విప్లవాత్మత చర్యల వల్ల సామాజిక తెలంగాణ సాధ్యమని స్పష్టం చేశారు. వివక్ష లేని సమాజం కోసం సామాజిక తెలంగాణ రావాలన్నారు.రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. తేమ ఎంత ఉన్నా.. పత్తి, వడ్లు, ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. అందుకోసం అన్ని రాజకీయ పార్టీల బృందాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లాలని కవిత డిమాండ్ చేశారు.

# మరో 2 రోజులు భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)



వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని పేర్కొంది. భద్రాచలానికి ఆగ్నేయంగా 50 కిలోమీటర్లు, ఖమ్మానికి 110 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని చెప్పింది. ఏపీ, తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా ఆరు గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో రాగల రెండురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ మేరకు మూడు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, నిజామాబాద్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాల్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని.. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాలతో పాటు పలుచోట్ల మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ మేరకు వాతావరణశాఖ పలు జిల్లాలకు ఎల్లో అలెర్టును జారీ చేసింది.

## సైబర్ క్రైంలో 'చిరు' ఫిర్యాదు



హైదరాబాద్,అక్టోబరు 29,మనం(ప్రత్యేక ప్రతినిధి): సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారని టాలీవుడ్ స్టార్ హీరో మెగాస్టార్ చిరంజీవి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవలే డీప్ ఫేక్, తన అనుమతి లేకుండా పేరు, వాయిస్, ఫొటోలను వాణిజ్య ప్రకటనలకు వాడుకోవడంపై చిరంజీవి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా తనపై సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నారని పేర్కొంటూ ఒక ఎక్స్ హ్యాండిల్ డీటెయిల్స్ తో కంప్లైంట్ చేశారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఇటీవలే తీర్పు ఇచ్చినా.. ఇంకా ఇలాంటి పోస్టులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు.. కేసు నమోదు చేశారు. టీఆర్‌పీ, లాభాల కోసం చిరంజీవి అనుమతి లేకుండా ఆయన పేరు, వాయిస్, ఫొటోలను వాడి దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశిస్తూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఇటీవలే ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే.

# అజహరుద్దీన్‌కు మంత్రి పదవి

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారం జరిగింది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై గత కొద్ది రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర క్యాబినెట్‌లో 15 మంది ఉండగా, మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు క్యాబినెట్ ఏర్పడినా ముసిం మైనార్టీకి మంత్రి పదవి ఉండేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీ నేతలు పోటీ చేసినప్పటికీ ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి క్యాబినెట్‌లో చోటు లభించలేదు. ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్టానం ఉంది. అజహరుద్దీన్ సైతం జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం మంత్రి పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజహరుద్దీన్, కోదండరాం పేర్లను ప్రకటించినప్పటికీ వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోద ముద్ర వేయలేదు. ఏమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తి కానప్పటికీ అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఒకవేళ గవర్నర్ కోటాలో అజహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో త్వరలో కొన్ని ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత 6 నెలల్లో ఆజహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గాలకు ఇవ్వాలనే అంశంపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## చంద్రన్న ఒక ద్రోహి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించలేదన్నారు. అలాగే దేశంలో సుదీర్ఘ విప్లవ ఉద్యమం ఎన్నో కఠిన పరిస్థితులను దాటుకొని వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం దేశం ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగం, సామాజిక అసమానతలు వంటి సమస్యలను కప్పిపుచ్చుకోడానికి రాజ్యాంగ వ్యవస్థను ప్రజల మీద దోపిడీ చేసే సాధనంగా ఉపయోగిస్తోందని అన్నారు.అందుకే ప్రజలు మరోసారి మిలిటెంట్ మార్గాన్ని, తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకోవాల్సిన చరిత్రాత్మక సమయం వచ్చిందన్నారు. గత రెండేళ్లుగా పార్టీకి ఎదురైన నష్టాల నుంచి బయటపడటానికి, ఉద్యమాన్ని బలంగా కొనసాగించడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. కామ్రేడ్స్, ప్రజలు, మిత్రులు, విప్లవ మద్దతుదారులు ప్రభుత్వ అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడాలని, ఈ కఠినమైన ఈ పరిస్థితిని తట్టుకొని పార్టీ నిలబడుతుందని తమకు నమ్మకం ఉన్నట్టు లేఖలో పేర్కొన్నారు.

# భారత్ వస్తోన్న రష్యా చమురు ట్యాంకర్ యూటర్న్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాసెస్ చేస్తుంది. 'జులై-సెప్టెంబర్ మధ్యలో ముర్మాన్స్ లోని ఆర్కిటిక్ పోర్ట్ నుంచి గల్ఫ్ ఆఫ్ ఒమన్ వరకు అమెరికా ఆంక్షల జాబితాలో ఉన్న నౌకల్లో చమురు రవాణా అయింది. అలాగే ఈ రవాణాను కప్పిపుచ్చుకునేందుకు మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయి'' అని మీడియా కథనం పేర్కొంది. షిప్పింగ్ డేటా, కస్టమ్స్ రికార్డ్స్, శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఈ విషయం వెల్లడైంది. ఈ నౌకల్లో రవాణాను ఎవరు ఏర్పాటుచేశారనేది మాత్రం తెలియదని వెల్లడించింది. రష్యా సంస్థలైన రాస్నెఫ్ట్, లుకాయిల్ తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అగ్రరాజ్యం నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేసినా, పెనాల్టీ ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత ముడి చమురు దిగుమతుల్లో మూడో వంతు రష్యా నుంచే వస్తోంది. ఈయూ కూడా ఆర్థిక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. గతంలోనూ రష్యాపై అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ.. ఈసారి వాటి తీవ్రత ఎక్కువగా ఉంది.

# రక్తదానం ఓ ప్రాణ దానం: డీజీపీ శివధర్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 29, మనం (ప్రత్యేక ప్రతినిధి): ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం చేయాలని డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాల సందర్భంగా తొలిసారి డీజీపీ కార్యాలయంలో రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరంలో డీజీపీ రక్తదానం చేశారు. ఈక్రమంలో డీజీపీతో పాటు శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేష్ ఎం భగవత్, ఐజీపీలు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం.రమేష్ లతో సహా 164 మంది పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మనుషులను ప్రాణాపాయం నుండి కాపాడగలుగుతామన్నారు. రక్తదానం చేయడం వల్ల మూడు రకాలుగా మనుషులకు ఉపయోగపడుతుందని రక్త దానం చేయడం వల్ల రక్తంతో పాటు, ప్లాస్మా, ప్లేట్లెట్స్ వంటివి మరో ముగ్గురికి ప్రాణదానం చేసే ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు. బాధితులకు అవసరమైన రక్తాన్ని సేకరించేందుకు అవకాశమున్న ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. గత రెండు రోజుల క్రితం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నానని దాదాపు 4,500 యూనిట్ల రక్తాన్ని వారు సేకరించారని వెల్లడించారు. ఏటా ప్రతి ఒక్కరు నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెప్తున్నారని, కనీసం ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో దాదాపు 8,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తం అందుబాటు ఉన్నట్లయితే అందులో కొంతమంది ప్రాణాలైనా కాపాడగలిగే అవకాశం ఉంటుందని వివరించారు. ఐజీపీ ఎం రమేష్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా డీజీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించడం ఇదే తొలిసారి అని తెలిపారు. ఈ శిబిరానికి పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది హాజరు కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐజీలు రమణ కుమార్, నాగరాజు, డాక్టర్ పిచ్చిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీరాములు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లా ఎన్నికల్లో పోటీ చేస్త

- ఢిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తున్నా
- బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా

ఢిల్లీ, అక్టోబర్ 29: తాను స్వేచ్ఛగా నివసిస్తున్నానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పేర్కొన్నారు. అయితే, తన కుటుంబంపై జరిగిన హింసాత్మక దాడుల నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5 నుంచి బంగ్లాదేశ్ను వీడి భారత్కు వచ్చారు. నాటి నుంచి ఆమె ఢిల్లీలో నివసిస్తున్నారు. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే హసీనా బుధవారం తొలిసారి మీడియా ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా ఆవామీ లీగ్ పార్టీ నేతలపై ఆరోపణలు, స్వదేశానికి తిరిగి వెళ్లాలనే ఆలోచనలు మొదలైన విషయాల గురించి హసీనా మాట్లాడారు. వచ్చే ఏడాది బంగ్లాలో జరగనున్న జాతీయ ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయకపోతే.. తమకు ఉన్న లక్షలాది మంది మద్దతుదారులు ఎన్నికలను బహిష్కరిస్తారన్నారు. భవిష్యత్తులో తన స్వదేశంలో అధికారం చేపట్టడానికైనా.. ప్రతిపక్ష పాత్ర పోషించడానికైనా తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. బంగ్లాదేశ్లో రాజ్యాంగ పాలన, రాజకీయ స్థిరత్వం తీసుకురావాలంటే తిరిగి తమ ప్రభుత్వం అధికారం చేపట్టాలని అన్నారు. దేశ భవిష్యత్తును ఏ ఒక్క వ్యక్తిగానీ కుటుంబం కానీ నిర్వహించాలని తాను అనుకోవట్లేదని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఎంఐఎంకు వేసినట్టే

(మొదటి పేజీ తరువాయి)

తప్పుడు హామీలు, అమలు కాని 6 గ్యారెంటీలను ప్రజల ముందు బహిర్గతం చేయాలని పేర్కొన్నారు. పార్టీ జాతీయ నాయకత్వం సూచనల మేరకు ప్రతీ ఒక్కరూ సమన్వయంతో పార్టీని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ప్రజలు ఇప్పటికే మర్చిపోయారనీ, వచ్చే నెల 11న జరుగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ప్రజలను మరోసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మోసం చేయడానికి సిద్ధమవుతున్నాయన్నారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అని అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు చేతులెత్తేసిందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రజలే తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరు పార్టీని మరింత బలోపేతం, విస్తరణ చేసేలా సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా రామచందర్‌రావు సూచించారు.

# మోడీ మంచివాడే... కానీ, కఠినమైన వ్యక్తి: ట్రంప్



హైదరాబాద్, మనం ప్రతినిధి: భారత ప్రధాని నరేంద్ర మోడీ చూడటానికి ఎంతో మంచి వ్యక్తిలా కనిపిస్తారని, కానీ ఆయన చాలా కఠినమైన వ్యక్తి అని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ వ్యాఖ్యానించారు. బుధవారం తన ఆసియా పర్యటనలో భాగంగా దక్షిణ కొరియాలో మాట్లాడిన ఆయన, భారత్తో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై త్వరలోనే సంతకాలు చేస్తామని ప్రకటించారు. ఇదే సందర్భంలో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, అందుకు మోడీ కఠిన వైఖరే కారణమని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

'భారత్, పాకిస్థాన్‌ల విషయానికొస్తే... నేను భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నాను. నాకు ప్రధాని మోదీపై గొప్ప గౌరవం, ప్రేమ ఉన్నాయి. మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు తాను మోదీకి ఫోన్ చేసి, 'మీరు పాకిస్థాన్తో యుద్ధం ప్రారంభిస్తే మేం మీతో వాణిజ్య ఒప్పందం చేసుకోలేం' అని చెప్పినట్లు ట్రంప్ గుర్తుచేసుకున్నారు. 'మోదీ చూడటానికి మంచి వ్యక్తి అయినా, ఆయన చాలా కఠినమైనవారు. యుద్ధం చేసి తీరుతామన్నారు. అయితే నా మాటలు విన్న రెండు రోజులకే మోదీ, షెరీఫ్ నాతో మాట్లాడి యుద్ధాన్ని ఆపేశారు' అని ట్రంప్ వివరించారు. కొంతకాలంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. భారత్ రష్యా నుంచి చమురు కొనడం, అమెరికా భారత ఉత్పత్తులపై అధిక టారిఫ్లు విధించడం వంటి అంశాలు చర్చలకు అడ్డంకిగా మారాయి. అయితే ఇటీవల ట్రంప్, మోదీ ఫోన్లో మాట్లాడిన తర్వాత ఈ వివాదాలు పరిష్కారమైనట్లు తెలుస్తోంది. అమెరికా టారిఫ్లను 16 శాతానికి తగ్గించడానికీ, బదులుగా భారత్ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించుకోవడానికీ అంగీకరించినట్లు సమాచారం. ఈ ఒప్పందంలో భాగంగా, జన్యు మార్పిడి చేయని అమెరికా మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులకు కూడా భారత్ అంగీకరించే అవకాశం ఉంది. పెట్రోల్లో కలిపే ఇథనాల్ ఉత్పత్తి కోసం భారత్ మొక్కజొన్నను వినియోగిస్తోంది. అయితే, దిగుమతి చేసుకున్న ధాన్యంతో ఇథనాల్ తయారీని భారత నిబంధనలు అంగీకరించవు. అమెరికా మొక్కజొన్నను కేవలం ఇంధన అవసరాలకే వాడతారని, వ్యవసాయ మార్కెట్లోకి రాదని అమెరికా వాదిస్తోంది. అయితే, ఈ చర్చల్లో భారత రైతుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా చూస్తామని భారత ప్రభుత్వం మొదటి నుంచి స్పష్టమైన వైఖరితో ఉంది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా తమ 'రెడ్ ఫ్లాగ్స్'ను గౌరవిస్తేనే ఒప్పందం సాధ్యమని గతంలో స్పష్టం చేశారు. మే 10న జరిగిన భారత్-పాక్ కాల్పుల విరమణకు తానే కారణమని ట్రంప్ పదేపదే చెప్పడం గమనార్హం. అయితే ఈ వాదనలను భారత ప్రభుత్వం పలుమార్లు ఖండించింది.

## మొబైల్ స్క్రీన్‌పై కాలర్ పేరు

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు పేర్కొన్నాయి. డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాలను అరికట్టేందుకు, మోసపూరిత కాల్స్‌ను నిలువరించే ఉద్దేశంతో కాలింగ్ నేమ్ ప్రజంటేషన్ సదుపాయాన్ని టెలికాం విభాగం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు తాజాగా టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్‌ఏకీభవించింది. ఫోన్ కనెక్షన్ కోసం ఇచ్చిన గుర్తింపు కార్డులోని పేరే కనిపించేలా చేయడానికి ట్రాయ్ అంగీకరించింది. ఒకవేళ వినియోగదారుడు తన పేరు వద్దు అనుకుంటే ఆ పేరును డిస్ ప్లే చేయరు. 4జీ, అంతకుమించి సాంకేతికత ఉన్న ఫోన్లకే దీనిని వర్తింపజేయనున్నారు.

## రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్లు

(మొదటి పేజీ తరువాయి)

వంటి కీలక వివరాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. 'స్మార్ట్ రోడ్ల భద్రత' అనే అంశంపై ఢిల్లీలో నిర్వహించిన ఓ సమావేశంలో ప్రసంగించిన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు.

రోడ్లు బాగా లేకపోతే అందరూ తననే నిందిస్తారని.. మొత్తం వ్యవస్థ చేసిన తప్పునకు తాను మాత్రమే ఎందుకు తిట్లు తినాలని, సోషల్ మీడియాలో ఆరోపణలపై ఎందుకు స్పందించాలని నితిన్ గడ్కరీ చమత్కరించారు. అందుకే రోడ్లకు సంబంధించిన సమాచారమంతా ప్రజలకు బహిర్గతం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అప్పుడే రోడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడే అధికారులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రోడ్లపై క్యూఆర్ కోడ్లను ఏర్పాటుచేయడం వల్ల దానిని మంజూరు చేసిన మంత్రి ఎవరు, దాని నిర్మాణం కోసం పనిచేసిన కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు వారి ఫోన్ నంబర్లు, ఫొటోతో సహా అన్ని వివరాలు ప్రజలకు, విలేకరులకు అందుబాటులో ఉంటాయి. ఆయా రోడ్లపై ఏదైనా సమస్య వస్తే వారు నేరుగా ఆ అధికారులనే ప్రశ్నించే అవకాశం ఉంటుంది'' అని అన్నారు.

# పోరాడి సాధించుకోవాలి

42 శాతం బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ బీసీ జాగృతి రౌండ్‌టేబుల్‌లో వక్తలు



**అంబర్‌పేట, అక్టోబర్ 29 :** బీసీ రిజర్వేషన్ల సాధనకు తెగించి పోరాటం చేయాలని.. 42 శాతం తీసుకున్నాకే స్థానిక ఎన్నికలకు పోదామం'ని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో అంబర్‌పేటలో రిజర్వేషన్ సాధన అన్న అంశంపై ఆ సంస్థ అధ్యక్షుడు కేపీ మురళీ కృష్ణ అధ్యక్షతన జరిగిన బీసీ సంఘాలు, ప్రజాసంఘాలు, బీసీ బంధువులు, రాజకీయ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జీ కిషన్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టం తెచ్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాట్లాడిన వీజీఆర్ నారగోని రిజర్వేషన్ల సాధనకు చావో రేవో అనే స్థాయిలో పోరాటం చేయాలని.. అప్పుడే అగ్రకులాల వారి చేతిలో ఉన్న ప్రభుత్వాలు మన హక్కులను మనకు కల్పిస్తాయన్నారు. రిజర్వేషన్ల ద్వారానే బీసీలు రాజ్యాధికారం సాధించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా హాజరైన వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. జర్నలిస్టు, రాజకీయ పరిశీలకుడు నేలంటి మధు, తదితర బీసీ బంధువులు రిజర్వేషన్ల సాధ్న కోసం చేపట్టే కార్యాచరణకు మద్దతు ప్రకటించారు. రౌండ్ టేబుల్‌లో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యా శ్రీనివాస్, జోషీ గోలనాక, దళిత చైతన్య వేదిక నాయకులు మహేందర్, బీసీ జాగృతి ఉపాధ్యక్షులు లింగం, ధనుంజయ్, లక్ష్మణ్, ధనరాజ్, సురేష్ తదితర 32కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎన్ బి డబ్ల్యూ ఫ్రీ కమిషనరేట్‌గా రాచకొండ కమిషనరేట్

## ఆపరేషన్ స్మైలీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం: రాచకొండ సిపి సుధీర్ బాబు

**రంగారెడ్డి అక్టోబర్ 29 (మనం న్యూస్):** ఆపరేషన్ స్మైలీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యమని, దేశంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా బాల కార్మికులను గుర్తించి వారికి బంగారు భవిష్యత్తు అందించామని రాచకొండ సిపి సుధీర్ బాబు అన్నారు. బుధవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 2000 మందితో (విద్యార్థులు, కాలనీ వాసులు) నిర్వహించిన కార్యక్రమానికి సుద్దాల అశోక్ తేజ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల్లో, ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ సందర్భంగా సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రజల కోసం విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని, మెరుగైన సమాజం కోసం ప్రజలు కూడా యూనిఫామ్ లేని పోలీసులేనని అన్నారు. ప్రజలకు సేవలందించి అమరులైన పోలీసుల సేవలను గుర్తు చేసుకునేందుకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. రాచకొండ కమిషనరేట్ లో ప్రతి ఒక్క నిమిషానికి రెండు డయాల్ 100 ఫోన్ కాల్స్ అటెంప్ట్ చేస్తున్నామని, పోలీసులు అన్ని రకాల సేవలను ఏక కాలంలో పనిచేసి ప్రజలకు ఆరు విభాగాలుగా ఏర్పడి విజుబుల్ పోలిసింగ్ లో భాగంగా సేవలు అందిస్తు, ప్రజలకు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పిల్లలకు దూరంగా ఉండే సీనియర్ సిటిజెన్స్ కి వారి ఇంటింటికి వెళ్లి సహాయసహకారం అందిస్తున్నామని అన్నారు. దేశంలో ఎన్.బి.డబ్ల్యూ ఫ్రీ కమిషనరేట్ గా రాచకొండ కమిషనరేట్ నిలిచింది రాచకొండ సిపి సుధీర్ బాబు గుర్తు చేశారు.ప్రజలకు ఫ్రెండ్లీ పోలిసింగ్ తో పాటు చట్ట వ్యతిరేకమైన చర్యలు చేసే వాళ్ళను శిక్షించడంలో రాచకొండ పోలీసులు ఎపుడైనా ముందుంటుందని గుర్తు చేశారు.ఈ క్రమంలో మల్కాజిగిరి డిసిపి పద్మజా, ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, యాదాద్రి భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిరా, డీసీపీ విమెన్ సేఫ్టీ ఉషా రాణి, డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి, డీసీపీ ఎస్ఓటి రమణ రెడ్డి, డీసీపీ ట్రాఫిక్ -1 శ్రీనివాస్, డీసీపీ ట్రాఫిక్ -2 శ్రీనివాసులు, సైబర్ క్రైమ్స్ డీసీపీ నాగలక్ష్మి, రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్, డీసీపీ హెడ్ క్వార్టర్ శ్యామ్ సుందర్, అడిషనల్ డీసీపీలు, ఏసిపిలు తదితరులు పాల్గొన్నారు.




# కల్వకుంట్ల కవిత జనం బాట ఘన విజయం సాధించింది

రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి

**రంగారెడ్డి, అక్టోబర్ 29 (మనం న్యూస్):** కల్వకుంట్ల కవిత జనం బాట ఘన విజయం సాధించింది అని రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి అన్నారు. బుధవారం ఒక ప్రకటనలో పాండురంగారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోని ప్రాజెక్టు పనులపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తెలంగాణ జాగృతి జనం బాటలో కవితక్క, ముంపు గ్రామాల్లో ప్రజల పరిస్థితిని తెలుసుకుంటూ, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని, ముంపు గ్రామాల్లో పునరావాస పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. గత రెండు సంవత్సరాలుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ప్రెస్ మీట్లు, సోషల్ మీడియా విమర్శలతోనే సరిపెట్టుకున్నాయి తప్ప, ప్రజల మధ్యకు వెళ్లి వారి బాధలను తెలుసుకున్న సందర్భాలు చాలా తక్కువ. కానీ, కవితక్క నీళ్లు, నియామకాలు, నిధులు, అమరవీరులు, సామాజిక తెలంగాణ అంశాలపై ప్రజల్లోకి వెళ్లి మాట్లాడడంతో ప్రతిపక్ష పార్టీలు కలవరపడుతున్నాయి అని పాండురంగా రెడ్డి అన్నారు.



## పార్కులో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన జిహెచ్ఎంసి



**రంగారెడ్డి అక్టోబర్ 29 (మనం న్యూస్)** నాగోల్ డివిజన్ శ్రీ సాయి నారాయణ కాలనీలో పార్కులో ఇటీవల రేకుల షెడ్డు వేసి అక్రమంగా నిర్మాణం చేపట్టారు. కాలనీవాసులు ఈ అక్రమ నిర్మాణంపై ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం కూడా ఇదే స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారని, అధికారులకు ఫిర్యాదు చేయడంతో వాటి నిర్మాణాన్ని తొలగించడం జరిగిందన్నారు. అదే స్థలంలో ఇటీవల మరోసారి నిర్మాణాన్ని చేపట్టడంతో హయత్ నగర్ సర్కిల్ 3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ విజయలక్ష్మి, టిపిఎస్ సోమశేఖర్ ఆధ్వర్యంలో నాగోల్ పోలీసుల సహకారంతో బందోబస్తు చేపట్టి ఆ నిర్మాణాన్ని కూల కొట్టారు.

# వీఎం హోమ్‌లో వాకీటాకీ సర్వీసులు

- సెక్యూరిటీ సిబ్బంది, వార్డెన్స్‌కు అందజేత



**రంగారెడ్డి అక్టోబర్ 29 (మనం న్యూస్)** విక్టోరియా మెమోరియల్ స్కూల్( వీఎం హోమ్)లో వాకీటాకీ సేవలు అందుబాటు లోకి వచ్చాయి. సెక్యూరిటీ స్టాఫ్ సహా వసతి గృహంలోని వార్డెన్లు, వంట మనుషులు, పరిపాలన విభాగంలోని సిబ్బంది చేతికి వీటిని అందజేశారు.పిల్లలపై నిరంతర పర్యవేక్షణలో భాగంగా వీటిని సమకూర్చారు. ఈ వీఎం హోమ్లో టీచింగ్ విభాగంలో 23 మంది పని చేస్తుండగా, నాన్ టీచింగ్ విభాగంలో మరో 20 మంది పని చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో సెల్ ఫోన్లు నిషేధం ఉండటంతో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఏదైనా సమాచారం.

ఉన్నతాధికారులకు చేరవేయాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. అంతేకాదు వీఎం హోమ్ లోని ఒక్కో భవనం మధ్య చాలా దూరం ఉంది. దీనికి నాలుగు వైపులా దారులు ఉన్నాయి. సరైన రక్షణ వ్యవస్థ లేకపోవడంతో తరచూ విద్యార్థులు బయటకు వెళ్లి రావడం జరుగుతుంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ విద్యార్థులు, వారి బంధువులు, గుర్తు తెలియని వ్యక్తులు వస్తుపోతుంటారు. ఆయా అనుమానిత వ్యక్తుల రాకపోకలను గుర్తించి ఆ సమాచారాన్ని వెంటనే సంబంధిత ఇన్చార్జి దృష్టికి తీసుకువెళ్లేందుకు వీటిని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# మున్సిపల్ ప్రజలకు మెరుగైన వసతులు



- మాజీ చైర్మెన్ తుమ్మల పాండురంగా రెడ్డి

**రామచంద్రపురం, అక్టోబర్ 29 (మనం న్యూస్) :** అమీన్ పూర్ మున్సిపల్ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి అన్నారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని పిఎన్ఆర్ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. పదవి ఉన్న లేకున్నా ప్రజలలో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహకారంతో ప్రజల అవసరాలను తీర్చేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్ కో సీనియర్ నాయకులు తల్లారి రాములు, కొల్లూరు యాదగిరి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా అదితా స్వప్న

- నియామక పత్రాలు అందజేసిన అల్కా లాంబా

**హైదరాబాద్, అక్టోబర్ 29 (మనం బ్యూరో) :** అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ఏపీ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా బి.అదితా స్వప్నను నియమించారు. అదితా స్వప్న గతంలో బీహార్, పుదుచ్చేరి, అండమాన్, నికోబార్ దీవులకు జాతీయ పరిశీలకురాలిగా విజయవంతంగా పని చేశారు. ఆమె అంకిత భావం, సామర్థ్యం, నాయకత్వాన్ని గుర్తించి ఏపీ బాధ్యతను ఆమెకు అదనంగా అప్పగించారు. ఈ సందర్భంగా అదితా స్వప్న మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి నూతన బాధ్యతను అప్పగించినందుకు అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నాయకత్వంలో ఏపీలో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి, రాహుల్ గాంధీ దార్శనికతను, నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలోని ప్రతి మండలం బూత్ స్థాయిలో మహిళా కాంగ్రెస్ ఉనికి విస్తరించడంపై దృష్టి పెడతాననీ, మహిళా నాయకులకు సాధికారత కల్పించ డం, సంస్థాగత చట్రాన్ని బలోపేతం చేయడం, రాజకీయాల్లో మహిళల సమాన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం దిశగా అఖిల భారత మహిళా కాంగ్రెస్ తన ప్రయత్నాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతుందని స్పష్టం చేశారు.



# ప్రయాణీకులకు పోలీసు సాయం

- పోలీసులకు డీజీపీ అభినందనలు



**హైదరాబాద్,అక్టోబరు 29,మనం(ప్రత్యేక ప్రతినిధి):** భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు సహాయం చేసిన మహబూబాద్ జిల్లా పోలీసులను డీజీపీ శివధర్ రెడ్డి అభినందించారు. ఆపదలో వారిని ఆదుకున్న పోలీస్ సిబ్బంది కృషిని డీజీపీ ప్రశంసించారు. భారీ వర్షాల కారణంగా డోర్నకల్లో గోల్కొండ ఎక్స్ ప్రెస్, మహబూబాబాద్ రైల్వే స్టేషన్ లో కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్ళను నిలిపివేయడంతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు పోలీసు సిబ్బంది మానవతా సహాయం అందించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ స్పందించి సంబంధిత పోలీసు అధికారులను సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైలులోని ప్రయాణికులకు వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు, పులిహోర పొట్లాలు అందజేశారు.ఈ సమాచారం తెలుసుకున్న డీజీపీ ఆపదలో ఉన్న వారికి సాయం అందించిన పోలీసుల సేవను ప్రశంసించారు.




## శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల దారి మళ్లింపు

అచ్చంపేట న్యూటౌన్: నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లతిపూర్ సమీపంలో డిండి జలాశయం మత్తడి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో జాతీయ రహదారి కోతకు గురి కావడంతో బుధవారం సాయంత్రం నుంచి అధికారులు రాకపోకలను నిలిపేశారు. శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన వాహనాలను అచ్చంపేట మండలంలోని హాజీపూర్ నుంచి వంగూరు మండలం చింతపల్లి కొండారెడ్డిపల్లి మీదుగా మళ్లించారు. కోతకు గురైన జాతీయ రహదారిని నాగర్ కర్నూల్ ఎస్పీ పరిశీలించారు. దీనిపై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు అధికారులు సమాచారం అందించారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండ పోత వర్షాలు కురుస్తున్నాయి.

# కార్పొరేట్ ఆసుపత్రుల్లో గని కార్మికుల మృత్యువాత

- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి నారాయణ.

**మందమర్రి, అక్టోబర్ 29: (మనం న్యూస్):** అనారోగ్యం బారిన పడ్డ సింగరేణి గని కార్మికులను హైదరాబాదులోని కార్పొరేట్ హాస్పటల్కు రిఫర్ చేస్తే ఆయా హాస్పిటల్ లో మెరుగైన వైద్యం అందించక మృత్యువాత పడుతున్నారని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సురేంద్ర సత్యనారాయణ ఆరోపించారు. నిపుణులైన డాక్టర్లు ఉన్న హాస్పటల్ కు కాకుండా జూనియర్ డాక్టర్స్ ఉన్న హాస్పటల్ కు సింగరేణి వైద్య విభాగం రిఫర్ చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. దీని వెనుక మతలబు ఏమిటో చెప్పమని యజమాన్యాన్ని ఆయన ప్రశ్నించారు. తాళ్ల రమేష్ అనే కార్మికుడు హైదరాబాద్ పేస్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించాడు బుధవారం ఉదయం అతని అంత్యక్రియలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో పై విధంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాళ్ల రమేష్ కు పేస్ హాస్పిటల్ లో మెరుగైన చికిత్స అందలేదని జూనియర్ డాక్టర్స్ వైద్యం చేశారని రమేష్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. మంగళవారం సాయంత్రం వరకు 9 లక్షల రూపాయలు మంజూరైతే తప్ప వైద్యం చేయమని బిస్మించారాని తెలిపారు. 9 లక్షల రూపాయలు సింగరేణి యజమాన్యం విడుదల చేసిన తర్వాత రమేష్ మరణించినట్లు ప్రకటించడం వెనుక గల ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలని కార్మికులను కోరారు. ఆ తొమ్మిది లక్ష రూపాయలు ఎవరి జేబులోకి వెళ్లాయని సింగరేణి యజమాన్యం స్పష్టం చేయాలని వారు కోరారు. రిఫరల్ విషయాల్లో కూడా కార్మికులను సింగరేణి వైద్య విభాగం ఇబ్బంది పెడుతుందని అన్నారు విధానాలపై సమగ్ర విచారణ జరపాలని మందమర్రి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ తో పాటు భీమనాదులు సుదర్శన్ ఫిట్ కార్యాలయం సిహెచ్ శర్మ ఏరియా నాయకులు ఎగ్గడి రాజేశ్వర్ వివిధ యువ నా.యకులు పాల్గొన్నారు.



## వరంగల్ రైల్వేస్టేషన్‌ను ముంచెత్తిన వరద..



భారీ వర్షానికి వరంగల్ రైల్వే స్టేషన్‌ను వరద నీరు ముంచెత్తింది. రైలు పట్టాలపై వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మోటార్ల సహాయంతో వరద నీటిని బయటకు పంపించారు. పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీటితో రోడ్లు చెరువులను తలపించాయి.

# పశువుల సంరక్షణకు పాడి రైతులు ఉచిత టీకాలు

- జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్. ప్రకాష్ సందర్శించారు.

**కొడిమ్యాల. అక్టోబర్ 29(మనం న్యూస్):** కొడిమ్యాల మండలంలో కోనాపూర్ గ్రామంలో పశువైద్య,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధి, నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ ప్రకాష్ సందర్శించారు. అనంతరం డాక్టర్ ప్రకాష్ పాడి రైతులతో మాట్లాడుతూ గాలికుంటు, టీకాల ద్వారా, పశువులకు,వ్యాధుల, నుంచి రక్షణ లభించడమే కాకుండా వాటి ఉత్పత్తిలో కూడా మెరుగుదల కలుగుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి అపోహలు నమ్మకుండా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత గాలికుంటు నివారణ కార్యక్రమాన్ని వినియోగించుకుని ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్మూలనకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ సైండ్ల రాకేష్, డాక్టర్ గోపతి కమలాకర్, సహాయక సిబ్బంది రాజేషం , రవీందర్ బాబు, రాజు, ఉదయ్, పాడి రైతులు పాల్గొన్నారు.




# నేరం జరిగిన 24 గంటలలో నిందితుల అరెస్ట్

**తంగళ్ళపల్లి అక్టోబర్ 29(మనం న్యూస్):** తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రామచంద్రపురం గ్రామంలో తేదీ 27/10/25 నా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అంకుసాపూర్ గ్రామానికి చెందిన చిన్నవేణి వంశీ తండ్రి. కనకయ్య మరియు అంకుసాపూర్ గ్రామానికి చెందిన కంది రాహుల్ తండ్రి. మనోహర్ వయసు 20 సంవత్సరాలు మరియు జిల్లెల గ్రామానికి చెందిన మహమ్మద్ అంజాద్ తండ్రి సర్దార్ వయసు 20 సంవత్సరాలు ముగ్గురు స్నేహితులు జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడి ఊరు చివరలో ఇంటికి తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసి దొంగతనం చేసి డబ్బు సంపాదించాలని ఉద్దేశంతో తేదీ 27- 10-2025న సిద్దిపేట సిరిసిల్ల మెయిన్ రోడ్డు ను ఆనుకొని ఉన్న ఇట్ రెడ్డి రాజి రెడ్డి ఇంటికి తాళం వేసి ఉన్నది గమనించి ముగ్గురు ఇంట్లో చొరబడి బీరువాలో దాచుకున్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు 28 తులాల వెండి పట్టగొలుసులు దొంగిలించినారు అంతకుముందు తేదీ 01/ 10 /25 రోజున జిల్లెల్ల చెక్ పోస్ట్ వద్ద ఒంటరిగా తలం వేయబడిన ఇంటిని ముగ్గురు కలిసి ఇంట్లోకి చొరబడి తులం బంగారు ఆభరణాలు పదివేల రూపాయల నగదు దొంగిలించినారు. పై వ్యక్తి ఫిర్యాదు మేరకు తంగళ్ళపల్లి ఎస్సై ఉపేంద్ర చారి కేసు నమోదు చేసుకొని క్లూస్ టీం ఎస్సై క్రాంతి వారి సిబ్బంది సహాయంతో 24 గంటల లోపల పై ముగ్గురు నిందితులను పట్టుకొని వారి వద్ద నుండి పై రెండు కేసులలో దొంగిలించబడిన బంగారు వెండి ఆభరణాలు మరియు నేరం చేయడానికి ఉపయోగించినటువంటి స్ప్లెండర్ బైక్ నేరం చేసిన డబ్బును తనకా పెట్టి వచ్చిన డబ్బుతో కొనుగోలు చేసినటువంటి మొబైల్ ఫోన్లు పంచనామా అనంతరం స్వాధీనం చేసుకోవడం అయినది. చెన్నమనేని వంశీ ఇంతకుముందు కూడా పలు కేసులలో నిందితుడుగా ఉన్నాడు పై ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించనైనది. కేసు చేతనలో చురుకుగా వ్యవహరించినటువంటి ఎస్సై ఉపేంద్ర చారి మరియు వారి సిబ్బంది నరేందర్,శ్రీకాంత్,అబ్బాస్,శ్రీనివాస్ లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించినారు మరియు సిరిసిల్ల పోలీస్ సిరిసిల్ల పోలీస్ క్లూస్ టీం ఇంచార్జ్ ఎస్ఐ క్రాంతి మరియు వారి సిబ్బందిని కూడా కేసు ఇన్వెస్టిగేషన్లు సహకరించినందుకు డిఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.



## మొంథా తుపాను ప్రభావం..!!

రాకాసి అలలు ఎగిసిపడుతున్నాయి
ఎడతెరిపి లేని వానలు ముసురుకున్నాయి
సముద్రం కల్లోలమై కబలిస్తుంది

వాగు వంకలు పొంగిపొర్లుతున్నాయి..
సముద్ర కెరటాలు విశ్వరూపం దాల్చే
ప్రశాంత సముద్రం గర్జనలు వినిపించే

నేలను మింగేసేందుకు కోరలు చాస్తూ
సముద్రం నింగికి ఎగసి విరుచక పడుతుంది..
గోదావరి జిల్లాలు గగ్గోలు పెట్టే

విశాఖ కాకినాడ శ్రీకాకుళం విలపించే
కృష్ణా జిల్లాలు వర్షపు నీటిలో తడిసే

ప్రకాశం నెల్లూరు సంద్రం తలపించే..
సీమ జిల్లాలు చిగురుటాకులా వణికె

కర్నూలు కడప గడప దాటుటలేదు
చిత్తూరు అనంతపురం చిత్తై కూర్చున్నాయి

రాష్ట్రమంతా నీటి కుండలా పొంగి పొర్లుతుంది.
ఓడలన్నీ ఒడ్డుకు చేరుతున్నాయి

వాహనాలన్నీ రోడ్లపై పరుగులు ఆపాయి
నింగిలో విమానం నేల మీద కూర్చుంది

రాకపోకలు లేక రైళ్లు రద్దై నిలుచున్నాయి..
మహా వృక్షాలు వేర్లతో కూలిపోయే

భయంకరమైన గాలికి బ్రతకలేక
అత్యంత భారీ వర్షాలు భరించలేక
గాలి తీవ్రతకు తనువులను చాలించాయి..

రైతన్న బంగారు పంట వర్షార్పణం
పచ్చని పొలం చెరువులై నీలార్పణం

చేతికొచ్చిన ఫలం తుఫాను మింగేసే
భూమి పుత్రుడు కన్నీళ్లు దిగమింగి కూర్చునే..

ప్రజల పాట్లు వర్షపు నీటిలో తడిసే
బడుగు జీవి కళ్ళల్లో నీళ్లు తిరిగే

పని దొరకక కూలోడు తిండికి అలమటించే
ఉన్నోడు వెచ్చగా విందు భోజనం ఆరగించే..

**- కొప్పుల ప్రసాద్**
9885066235

# క్రైసిస్ మేనేజ్ మెంట్‌లో దిట్ట చంద్రబాబు





ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంటే సంక్షోభాల నుంచి ఒడ్డున పడేసే సాధకుడు. తుపాన్‌లు, వరదలు ఇలాంటివి ఏవి వచ్చినా అద్భుతమైన క్రైసెస్ మేనేజ్ మెంట్ చేయడంలో దిట్ట.

గతంలో విశాఖ హుదూద్ తుపాన్ నుంచి మొదలు భయంకరమైన తిత్లీ, బుడమేరు వరదల దాకా చెప్పుకుంటూ పోతే ఇవన్నీ చంద్రబాబు హయాంలోనే వచ్చినా ఆయన దీటుగా ఎదుర్కొన్నారు. ఆయన మామూలుగానే పద్దెనిమిది గంటలు పని చేస్తారని చెప్పడం ఉంది. ఇక విపత్తు సమయంలో ఆయన నిరంతరం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రజల ప్రాణాలను కాపాడడం, విపత్తులను ఎలా ఎదుర్కోవాలో ఆయన అనుభవం ఆయనకు నేర్పింది.

తాజాగా కోస్తా ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తున్న మొంథా తుపాన్ సమయంలో కూడా చంద్రబాబు నాయుడు అదే క్రైసిస్ మేనేజ్ మెంట్ స్కిల్స్‌ని చూపిస్తున్నారు.

ప్రకృతి విపత్తులు అన్నవి సర్వసాధారణం. అయినా చంద్ర బాబు ఏలుబడిలోనే అవి ఆయనకు కఠిన పరీక్షలు పెడుతున్నా గాని వెరవని మనస్తత్వం ఆయనది.

ప్రస్తుతం మొంథా తుఫాను సమయంలో కూడ చంద్రబాబు నాయుడు సమర్ధత మరోసారి బయట పడింది. 'ప్రకృతి విపత్తులను అడ్డుకోలేం కాని వాటి నష్టాన్ని నియంత్రించగలం, నష్ట తీవ్రతను తగ్గించగలం, మరీ ముఖ్యంగా మనుషుల ప్రాణాలను కాపాడగలం' అన్న ధీమా ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో అపార అనుభవం ఉన్న చంద్రబాబుకే ఉంది.

చంద్రబాబు అనుభవం,విజన్ ఆపత్కాల పరిస్థితుల్లో రాష్ట్రానికి ఎంతో ఉపయోగ పడుతోంది. అందుకే ఆయన ఆంధ్రుల పాలిట అభిమాన నాయకుడయ్యారు.

సమస్య వచ్చినప్పుడే అసలైన లీడరు ఎవరో తెలుస్తుంది. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్ని ఉపద్రవాలు ముంచు కొంచినా చాకచక్యంగా ఎదురొడ్డి నిలిచారు. సమస్యలు, ఇబ్బందులు ఉన్నచోట తాను ఉన్నానంటూ ధైర్యానిచ్చారు. ఎన్ని ఆటు పోట్లు వచ్చినా ధైర్యంగా 'పవర్ హౌస్'లా నిలబడ్డారు.

విపత్కర పరిస్థితుల గురించి వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలతో అధికార యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టిస్తారు.

ముందస్తు జాగ్రత్తలతోనే ఎలాంటి ప్రాణ నష్టం జరగ కుండా చూస్తూ ఆపత్కాల సమయంలో చంద్రబాబు నాయుడు బాధ్యతాయుతంగా చేస్తున్న కార్యక్రమాలను చూసి దేశం వ్యాప్తంగా నివ్వెరపోతున్నారు. ఏడు పదుల వయస్సులో ఆయన పని తనాన్ని చూసి జాతీయ మీడియా తెగ మెచ్చుకుంటుంది.

**ప్రకృతి సవాళ్ళకు ఎదురెళ్ళి**

ప్రజలు కష్టాల్లో ఉన్నారంటే.. ప్రకృతి సవాళ్ళకు ఎదురెళ్ళడం చంద్రబాబుకు కొత్త కాదు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రయాణంలో అందుకు ఎన్నో ఉదంతాలు,ఘట్టాలు లేకపోలేదు. హుదూహుదూ, తిత్లీ, బుడమేరు వరదల సమయంలో కూడ ఆయనకు కష్టంలో ఉన్న ప్రజల ధ్యాస తప్ప మరొకటి లేదు. అందుకే రేయింబవళ్ళు వాటికి ఎదురెళ్ళారు. తాను కనిపిస్తే కష్టంలో ఉన్న ప్రజలకు కొండంత ధైర్యమని నమ్మారు.

ఏ విపత్కరపరిస్థితుల్లోనైనా క్షేత్రస్థాయి పర్యటనలలో ప్రజలను కలుస్తూ మరో వైపు పరిస్థితి తీవ్రతపై అధికారులతో సమీక్షలు చేస్తూ.. ఇంకొక పక్క కేంద్రానికి పరిస్థితిని వివరిస్తూ అన్నీ తానై నడిపించడం చంద్రబాబుకే సాధ్యమైంది.

ప్రస్తుతం మొంథా తుపాన్ విషయంలోను అదే పద్ధతిని అనుసరిస్తూ ఎక్కడ ప్రాణ, ఆస్తీ నష్టం జరగకుండా కాపాడ గలిగారంటే అది చంద్రబాబుకు ఉన్న ముందు చూపనే చెప్పాలి.

**మొంథా విపత్తు.. చంద్రబాబుకు కొత్తటాస్క్**

మొంథా తుపాన్ చంద్రబాబు నాయుడు సమర్ధతకు టాస్క్ అయినప్పటికీ అపార అనుభవంతో దీటుగా ఎదుర్కొంటు న్నారు. కోస్తాజిల్లాలో నష్ట నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వల్లే ఒక్క ప్రాణం నష్టం జరగలేదని చెప్పాలి.

వారం రోజులు ముందు నుంచే హెచ్చరికలు జారీ చేయడం, పాఠశాలలకు సెలవులు ఇవ్వడమే కాక తుఫాను ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. ఈ నిధులు అప్పటికప్పుడు ఖర్చు చేసేలా అధికారులకు స్వేచ్ఛ నిచ్చారు. ఎస్డీఆర్ఎఫ్ తో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసి తుపాన్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైన సన్నద్ధతను, సమర్థతను చంద్రబాబు నాయుడు చాటి చెప్పారు.

తుపాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జీరో రిస్క్ ను ఏవిధంగా తీసుకోవాలో అధికారులకు దిశా నిర్దేశం చేసి సక్సెస్ అయ్యారు.

తీర లోతట్టుప్రాంతాల నుంచి ప్రజలను ప్రత్యేక శిబిరాలకు తరలించారు. ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. 2707 తుఫాను ప్రభావిత గ్రామాలను ముందుగానే గుర్తించి ఎలాంటి నష్టం జరగకుండా తీసుకున్న చర్యలతో మొంథా తోక ముడిచిందనే చెప్పవచ్చు. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27 వేల సెల్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం చేశారు. విద్యుత్ ,టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. జాతీయ రహదార్లపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 851జెసీబీలు,757 క్రేన్లు అందుబాటులో ఉంచారు. ఈ రకంగా ముందస్తు కార్యాచరణ అమలు చేయడమనేది ఒక్క చంద్రబాబు కే సొంతం...సాధ్యం కూడానూ.

**హుద్ హుద్ సమయంలో**

1996 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో కోనసీమ ప్రాంతంలో పెద్ద విపత్తు సంభవించింది. ఆ పరిస్థితుల్లో కూడ ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత 2014 అక్టోబర్ 12వతేదీన హుద్ హుద్ తుఫాను వచ్చింది. ఈ సారి హుద్ హుద్ విశాఖ పట్నాన్ని ఒక ఊపు ఊపింది. దీంతో చంద్రబాబు కొన్నిరోజులు విశాఖలోనే బస చేసి సహాయక చర్యలను దగ్గర ఉండి పర్యవేక్షించి నేను మీకు అండగా ఉన్నాననే నమ్మకాన్ని ప్రజలకు కలిగించారు.

**తిత్లీ సమయంలోనూ**

2018 అక్టోబర్ లో వచ్చిన తిత్లీ తుపాన్ ప్రభావంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఎక్కువగా నష్టపోయింది. పంటలతో పాటు ఆస్తి నష్టం కూడ ఎక్కువగానే జరిగింది. ఆ సమయంలో చంద్ర బాబు శ్రీకాకుళానికి హుటాహుటిన వెళ్ళారు. సాధారణ పరిస్థితులు వచ్చేవరకు అక్కడే ఉండి బస్‌లోనే బస చేశారు. తుపాన్‌ను ఆపే శక్తి ఎవరికి ఉండదు. కానీప్రాణ నష్టం జరగ కుండా చంద్రబాబు తీసుకున్న చర్యలతో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా సమర్ధవంతంగా ఎదుర్కొంటారనే పేరు వచ్చింది.

**విజయవాడ వరదలు...**

గత ఏడాది సెప్టెంబర్ లో వచ్చిన బుడమేరు వరద వల్ల విజయవాడ నగరం జలమయమైంది. అయితే తన జీవితంలో ఇలాంటి ఘోర విపత్తును చూడలేదని బాధితులు మాటలు వింటుంటే చాలా బాధేసిందని చెప్పిన చంద్రబాబు రోజుల తరబడి విజయవాడ కలెక్టరేట్ లోనే ఉండి ప్రజలను ఆదుకున్న సంగతిని ఇప్పటికీ ప్రతి ఒక్కరు గుర్తు చేసుకుంటున్నారు. డబై అయిదేళ్ళ వయస్సులో ఆయన అధికారులు, మంత్రులతో సమానంగా వరద ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు మనో ధైర్యం ఇచ్చిన సంఘటనలు కళ్ళ ముందు కనిపిస్తూనే ఉన్నాయి. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్ధవంతంగా ఎదుర్కొనే లీడరు చంద్రబాబు తప్ప మరో నాయకుడు మచ్చుకైనా కనిపించరంటే అతిశయోక్తి కాదు. అదీ సీఎం చంద్రబాబు పాలనా దక్షతకు నిదర్శనం. అందుకే చంద్రబాబు ప్రజాహృదిలో చిరస్థాయిగా నిలిచే నాయకుడు.

**- అనంతాత్మకుల కొండబాబు**
9494408878

# పత్తి రైతుకు కపాస్ కష్టాలు



పత్తి అమ్మకాల కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన రైతులకు ఇబ్బందికరంగా తయారైంది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాలకుపైగా పత్తి సాగువుతుంది.

చేతికొచ్చిన పంటను మార్కెట్‌లో విక్రయించుకోవాలంటే ముందుగా రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసు కోవాలి. ఇందులో రైతు పేరు, ఊరు, సర్వే నంబరు, సాగుచేసిన పంటల విస్తీర్ణం తప్పనిసరి నమోదు చేయాల్సి ఉంటుంది. తేమ 12 శాతం దాటితే సీసీఐ అసలు కొనుగోలు చేయదు. తేమ శాతమే ప్రతిబంధకంగా మారుతుందనుకుంటే ఈ ఏడాది కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలనే నిబంధన రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ఇలాంటి నిబంధనలు విధించడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య ఉంది. ఫోన్‌లు పనిచేయవు. పింఛన్లు, రేషన్ బియ్యం పంపిణీ కోసం ప్రభుత్వ సిబ్బంది, డీలర్లు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పత్తిని ప్రధాన పంటగా రైతులు సాగు చేసుకుంటున్నారు. అనేక మారుమూల ఏజెన్సీ లాంటి మారుమూల ప్రాంతాల్లో కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవడమనేది రైతులకు పరీక్షలా ఉంది. వ్యవసాయ అధికారులు కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా యాప్‌పై సరైన అవగాహన కలగడంలేదని రైతులు పేర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో అనేక మంది నిరక్షరాస్యులైన రైతుల వద్ద స్మార్ట్ ఫోన్లు కూడా లేకపోవడంతో స్లాట్ బుకింగ్ మరింత ఇబ్బందికరంగా ఉందని రైతులు వాపోతున్నారు. రాష్ట్ర జిల్లాల వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై సరైన అవగాహనలేక అనేక మంది రైతులు స్లాట్ బుకింగ్ చేయలేక పత్తి విక్రయించలేని పరిస్థితి నెలకొందని కొత్తగా ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్కు వెళ్లే 24 గంటల ముందు రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అప్పటికప్పుడు విక్రయించే రోజున స్లాట్ బుకింగ్ చేసుకునే వీల్లేదని అధికారులు చెబుతున్నారు.



దీంతో స్లాట్ బుకింగ్‌పై అవగాహనలేని రైతులు పత్తి విక్రయాలపై ఆందోళనలకు గురవుతున్నారు. అనేక మంది రైతులకు సంబంధించిన ఫోన్ నంబర్లు మారిపోవడం, కొంతమంది రైతులకు ఫోన్ లేకపోవడంతో వ్యవసాయ కార్యాలయంలో రైతుల ఫోన్ నంబర్లు ఆన్‌లైన్‌లలో నమోదు కావడం లేదు.

ప్రస్తుతం పత్తి విక్రయించేందుకు స్లాట్ బుకింగ్ తప్పనిసరిగా చేయాల్సి ఉంది. సెల్‌ఫోన్‌లో నంబరు వ్యవసాయ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదై ఉంటేనే స్లాట్‌బుక్ అయినట్లు ఓటీపీ వస్తుంది. వ్యవసాయ కార్యాలయంలో ఫోన్ నంబరు నమోదు కాని రైతులు స్లాట్ బుకింగ్ చేయలేక అయోమయ స్థితిలో ఉన్నారు. నిబంధనలు సవరించాలి. రైతులను కాపాడండి

**- కామిడి సతీష్ రెడ్డి**
9848445134

# సరిహద్దులు లేని సామాజిక మాధ్యమాలు

సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతూ, నిత్య నూతన ఆవిష్కరణలు చోటు చేసుకుం టున్న తరుణంలో ప్రచార ప్రసార మాధ్యమాలలో విప్లవాత్మక మార్పులు క్షణక్షణం జరుగు తున్నాయి. వాటన్నిటి కన్నా ప్రస్తుతం నిరక్షర గ్రామీణుల నుండి నిరంతర పరిశోధకుల వరకు చేతిలో అందుబాటు లోకి వచ్చాయి. అధునాతన సెల్ ఫోన్లు, వాటి ద్వారా ప్రధాన స్రవంతి లోని మీడియాను మించి సోషల్ మీడియా పని చేయడం సర్వత్రా కనిపిస్తున్నది. చేతిలో ఫోన్‌లేకుండా, పొద్దున లేచింది లగాయతు, రాత్రి నిద్రించే వరకు, సోషల్ మీడియాలో నిమగ్నం కానివారు ఉంటారా అన్నది సందేహాత్మకమే. సోషల్ మీడియా అంతగా ప్రభావం చూపుతున్న ఈరోజుల లో ఎన్నికల సంబంధ అంశాలు, వేగవంత ప్రచారాలకు, సమాచార చేరవేతలకు సామాజిక మాధ్యమాల పాత్ర అద్వితీయం. అపూర్వం. అసమానమైంది. గతంలో ఎన్నికలు వస్తున్నాయనగానే గ్రామగ్రామాన గోడమీద రాతలు ప్రత్యక్ష మయ్యేవి. కాగితాలపైన, ఆపై ప్రింటింగ్ ప్రెస్ ద్వారా ముద్రితాలైన అభ్యర్థుల వివరాలు, వీలేతై ఫోటోలు, ఎన్నికల గుర్తులతో ఇంటింటికీ తలుపులపై, ఆపై జన సమ్మర్ధ అనుకూల ప్రదేశాలలో అతికించ బడేవి. తర్వాతి కాలంలో బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, కటౌట్లు, కర పత్రాలు, గోడ పత్రికలు, ఎన్నికల వాగ్దానాల, హామీలతో కూడినబ్రోచర్లు. అన్ని వనరుల వినియోగం ప్రచారానికి ఉపయోగించడం ఆచరణలోకి వచ్చింది. వీటికి తోడు రికార్డెడ్ వాయిస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రజలకు అభ్యర్థులు స్వయంగా తమ విజ్ఞప్తులను వినిపించడం జరిగింది. ప్రసార మాధ్యమాలలో స్క్రోలింగ్‌లు, యాడ్స్, జన ప్రవంతిలో గల వివిధ పత్రికల పెయిడ్ ఆర్టికల్స్ ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహింప బడేవి. రానురాను ఎన్నికల కమిషన్ దృష్టి అధికమవు తుండడం, శాసన సభలో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల వ్యయంకు సంబంధించి



ఖచ్చితమైన నిబంధనలుండడం, నిర్ణీత ఖర్చుకు సంబంధించి, లక్ష్మణ రేఖ దాటినట్లు రుజువైతే, గెలిచినా పదవి పోవడం ఖాయమని, ఖచ్చితమైన పాటింపులు ఉండడంతో అభ్యర్థులు, వారి అనుచరులు, అభిమానులు, ప్రత్యర్థులు, వారి అనుచర గణాలు, ప్రత్యామ్యాయాలపై దృష్టిపెడుతున్నారు. ఆ లోపునే ఖర్చు చేయడమే కాక నామినేషన్ వేసినప్పటి నుంచి ప్రతిపైసాకు తప్పని సరిగా లెక్క చూపాల్సిందే. అలాగని ఎక్కువ ఖర్చు చేసినా తక్కువ చూపితే సరిపోదు. అభ్యర్థులు వినియోగించే ప్రచార సామగ్రి, ప్రచారానికయ్యే ఖర్చును జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయిస్తారు. నేటి సమాజంలో ఎన్నికల్లో బాగా ఖర్చు పెట్టగల వ్యక్తులను మాత్రమే పార్టీ అభ్యర్థులుగా ఎంపిక అవుతున్నారు. అవినీతి కూడా కొలమానంలో లేకుండా పోతోంది. దీన్ని కప్పి పుచ్చేందుకు, ముఖ్యంగా సామాజికమాధ్యమాల ద్వారా క్షణాలలో వేలాది మందికి గ్రూపుల ద్వారా పోస్టులు శరవేగాన్ని సవాలు చేస్తూ వెళుతున్నాయి. ఎన్నికలకు 48 గంటలకు ముందుగా ప్రచారం చేయ కూడదు. ప్రచార రూపంలో ఎస్ఎంఎస్‌లు కూడా నిషేధమని నిబంధనలు కఠినంగా ఉన్నాయి. అయినా ప్రధానంగా సాంప్రదాయక ప్రసార, ప్రచార సాధనాలకు పరిమితులు ఉండి, ఉన్నదున్నట్లు ప్రచురించే, ప్రసారం చేసే అవకాశాలు లేని, రాయడానికి, మాట్లాడానికి వీల్లేని, నిఘంటువు లలో చోటు చేసుకోని, అసభ్య, అమానుష, అప్రజాస్వామిక భాష రాజ్య మేలుతున్న స్థితిలో సామాజిక మాధ్యమాలు అడ్డూ, అదుపూ లేని నేరుగా, వీడియో, ఆడియో రికార్డింగులు, మార్ఫింగులు, ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా, వెనువెంటనే సెల్ఫోన్ల ద్వారా గమ్యాలకు చేరుస్తున్నాయి. పొగడ్తలూ, తెగడ్తలూ, లేకుండా అస్మదీయుల, తస్మదీయులనే భేదాలు లేకుండా ఇష్టా రాజ్యంగా వైరల్ అవుతున్నాయి. పైగా ఎవరి స్వాధీనంలో లేని, పైసా ఖర్చుకాని, నియంత్రణ ఊసే కానరాని సదరు మాధ్యమాల ద్వారా జరుగుతున్న పోస్టింగుల ప్రచార పరంపరనే ప్రస్తుతం ఎన్నికలలో ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నాయి. తామే ఉద్యమాలను, ప్రభుత్వాలను నడిపిస్తున్నామని, ఎవరు గెలవాలో, ఎవరు ఓడలో తమ నిర్ణయానుసారమే జరుగుతుందని భావించే, భ్రమించే, ఆత్మ వంచన చేసుకునే పార్టీల మానస పుత్రికలైన పత్రికలకు, ఛానళ్ళకు సమాంతరాలుగా సామాజిక మాధ్యమాలు పని చేస్తున్నాయి.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## 12వ పీఆర్సీ ప్రకటించాలి

కేంద్ర ప్రభుత్వం ఒకటి జనవరి 2026వ సంవత్సరము నుంచి అమలు కాబోయే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మరియు పెన్షనర్ల 8వ పే రివిజన్ కమిషన్‌కు చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జి అయిన రంజనా ప్రకాష్ దేశాయ్‌ను నియమించారు. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకటి జూలై 2023 నుండి అమలు కావలసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మరియు పెన్షనర్ల 12వ పే రివిజన్ కమిషన్‌కు చైర్మన్‌ను ఇప్పటివరకు నియమించలేదు.

అయితే 12 జూలై 2023న గత ప్రభుత్వం డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను 12వ పేరివిజన్ కమిషన్‌కు చైర్మన్‌గా నియమించినారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు కొత్త చైర్మన్ ను నియమించలేదు.

కావున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, 12వ పీఆర్సీ అమలు చేసి రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు తగు న్యాయం చేయాలి.

**- వాసిలి సురేష్**
9494615360

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**– ఎడిటర్**

# ప్రకృతి వైపరీత్యాల పై అవగాహన అవసరం

1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకులం చేసిన తుపాను, ప్రకృతి ప్రతాపానికి నిదర్శనంగా మిగిలింది. ఈ తుపాను అత్యంత శక్తిమంతమైనదిగా పరిగణించ బడుతుంది. అధిక వేగంతో వీచిన గాలులు, భారీ వర్షాలు, తీరప్రాంతాల్లో భారీ అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వేల మంది మృతి చెందగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వ్యవసాయ భూములు, ఇళ్ళు, మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తీరప్రాంత వృక్షసంపద, జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, పునర్నిర్మాణానికి ఎంతో కాలం పట్టింది. ఆర్థిక నష్టం అంచనాకు అందనిది.

1971లో తుపాను ఒడిశా తీరంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది, 10,000 మందికి పైగా మరణించారు. 50,000 పశువులు చనిపోయాయి. వందల వేల చెట్లు నేలకూలాయి. తుపాను 800,000 కంటే ఎక్కువ ఇళ్లను ధ్వంసం చేసింది. రోజుల తరబడి కమ్యూనికేషన్లు, విద్యుత్ లైన్లు తెగిపోవడంతో విపత్తు వార్త బయటి ప్రపంచానికి అందకుండా చేశారు. ఈ తుపానుతో తీరప్రాంతాల్లో అతిపెద్ద అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ ఈ తుఫాను ప్రభావం నుంచి కోలుకోవడానికి సంవత్సరాల సమయం పట్టింది. ఈ సంఘటన అనంతరం, విపత్తుల నిర్వహణలో ముందస్తు చర్యలు, అవగాహన, పునర్నిర్మాణ ప్రణాళికలు ఎప్పటికప్పుడు మున్ముందుకు రావాల్సిన అవసరం స్పష్టమైంది.

ప్రకృతి వైపరీత్యాలు అంటే ప్రకృతి సృష్టించే భారీ సంఘటనలు, ఇవి పర్యావరణాన్ని, జీవసారాన్ని,ప్రజలఆస్తి, ప్రాణాల్ని ప్రభావితం చేస్తాయి. తుపానులు, వరదలు, భూకంపాలు, సునామీలు, కరువు, అగ్ని పర్వతాలు వంటి విపత్తులు మనకు పెద్ద ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు కాకుండా మానవ చర్యల వల్ల కూడా విపత్తులు సంభవిస్తాయి. ఉగ్రవాదం,యుద్ధాలు,అణు బాంబులు,పరిశ్రమల కాలుష్యం వంటి మానవ నిర్మిత విపత్తులు మన భద్రత, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇవి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారడంతో పాటు, పర్యావరణాన్ని కూడా నాశనం చేస్తాయి.

ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్ ప్రకారం గత మూడున్నర దశాబ్దాల్లో భారత్‌లో దాదాపు 431 రకాల ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఈ విపత్తుల వల్ల 1,43,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 15 కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావానికి గురయ్యారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఈ విపత్తుల కారణంగా భారతదేశ జాతీయ ఆదాయంలో ఏటా సుమారు2.25 శాతంనష్టం సంభవిస్తోంది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం, 20 సంవత్సరాల కాలంలో ప్రకృతి వైపరీత్యాలుదేశంలో సుమారు 7,950 కోట్ల డాలర్ల నష్టాన్ని కలిగించాయి.

ప్రకృతి విపత్తులను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు చర్యలవల్ల విపత్తు నిర్వహణ ద్వారా వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చు. సహాయ చర్యలను మరింత సమర్థంగా అమలు చేయడానికి ప్రజలలో అవగాహన పెంపొందించాలి. విపత్తుల నిర్వహణ కోసం స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు కలిసి ముందడుగు వేయాలి. విపత్తులకు ముందుగానే పునరుద్ధరణ ప్రణాళికలు తయారు చేయడం, ప్రజలకు శిక్షణ ఇచ్చి అప్రమత్తం చేయడం వంటి చర్యలు అవసరం.

ప్రపంచవ్యాప్తంగా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలు ప్రకృతి పరిరక్షణకు అనేక విభాగాలను అమలు చేస్తుంది. 1991లో భారత ప్రభుత్వం ఈ నిబంధనలు అమలులోకి తెచ్చింది. ఈ నిబంధనలు తీరప్రాంతాలలో నిర్మాణం, పరిశ్రమలు వంటి కార్యక్రమాలకు నిరోధం కల్పిస్తాయి. కానీ, అభివృద్ధి పనుల పేరుతో మడ అడవులు, హరిత వనాలు వంటి ప్రకృతి వనరులను విచ్ఛిన్నం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిర్దిష్ట బడ్జెట్ కేటాయించి, నష్టం అంచనాలలో పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రకృతి వనరులను కాపాడవచ్చు.

ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు విపత్తు నిర్వహణపై దృష్టి సారించాలి. తీరప్రాంతాలలోని మడ అడవులు, చిత్తడి నేలలు, హరిత వనాలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల నివారణకు తగిన నిధులను సమకూర్చడం, గ్రీన్ కవర్ ను పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం వంటి చర్యలు అత్యవసరం.

**- ఆర్‌కేఎస్**

# పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువలేనివి

- పోలీస్‌లు చేపట్టే కార్యక్రమాలాల్లో యువత భాగస్వాములు కావాలి
- రక్తదానం అనేది మహోన్నత సేవతో సమానం
- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా





భీమారం అక్టోబర్ 29(మనం న్యూస్ ): రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జోన్ ఇందారంలోని మహి ఫంక్షన్ హల్ లో బుధవారం పోలీస్ అమరవీరుల త్యాగాలకు నివాళిగా జైపూర్ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టిన మెగా రక్తదాన శిబిరం ఓపెన్ హౌస్ కార్యక్రమానికి రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ముఖ్య అతిథిగా హాజరై మంచిర్యాల డీసీపీ భాస్కర్ లతో కలిసి ఓపెన్ హౌస్,రక్తదాన శిబిరాన్ని ఘనంగా ప్రారంభించి, ముందుగా పోలీస్ అమర వీరులను స్మరించుకొని రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు ప్రజా రక్షణ,భద్రత సంబందించిన పోలీసు చట్టాలు,పోలీసు విధులపై, కమ్యూనికేషన్ సిస్టం ఫింగర్ ప్రింట్ డివైస్ ల వలన కలిగే ఉపయోగాలు బీడీ టీమ్ ఎక్విప్మెంట్, డాగ్ స్క్వాడ్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్,రోడ్డు ప్రమాదాలు స్పీడ్ లేజర్ గన్, ట్రాఫిక్ రూల్స్,ట్రాఫిక్ రోడ్ నిబంధనలపై, సైబర్ నేరాలపై పోలీసులు ఉపయోగిస్తున్న సాంకేతికత షీటీమ్,భరోసా, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్, తదితర స్టాల్స్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు సిబ్బంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

**ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.**

విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువకూడదని,అమరుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందని, పోలీస్‌లు చేపట్టే సేవా కార్యక్రమాలకు ప్రజలు, యువత సహకరించినప్పుడు పోలీస్ ల ఉత్సాహం, విశ్వాసం మరింత రెట్టింపు అవుతుందని. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనీ మారుమూల ప్రాంతాలను,పోలీస్ లు సందర్శించడం,ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడం ఒక పోలీస్ శాఖతోనే సాధ్యం అవుతుందని ఎంతోమంది అమరవీరుల ప్రాణ త్యాగాలను స్మరిస్తూ ఆదర్శంగా తీసుకొని దేశ రాష్ట్ర అభివృద్ధిలో, సామాజిక సామరస్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సంఘవిద్రోక శక్తులు దేశంపై గాని రాష్ట్రంపై గాని దాడులకు పాల్పడినప్పుడు ఐక్యమత్యంగా ఉంటేనే రక్షించుకోగలమని అన్నారు.యువకులు రాష్ట్ర,దేశ రక్షణ కోసం పోలీస్, ఇతర సెంట్రల్ అర్మడ్ ఫోర్స్ లలో ఉద్యోగాలను సాధించి రాష్ట్ర దేశ రక్షణ కొరకు దోహదపడటం, సహకరించడం చేయాలనీ కోరారు. రక్తదానం ప్రాణధానంతో సమానమని ప్రాణాపాయ స్థితిలో ఉన్న జీవితాలను కాపాడడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడంతో పాటు ప్రజల అత్యవసర ప్రమాద, ప్రాణాపాయ స్థితిలోను,అలాగే తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్త దాన శిబిరంలు ఓపెన్ హౌస్ లు నిర్వహించడం.మనం చేసే రక్తదానం వలన అత్యవసర సమయంలో, ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. స్నిఫర్ డాగ్స్ ప్రతిభతో ఆకట్టుకోగా,విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు.అలాగే విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పోలీస్ వ్యవస్థపై సానుకూల దృక్పథం కలిగించే లక్ష్యంతో కమీషనరేట్ పోలీస్ లు చేపట్టిన ఈ ఓపెన్ హౌస్ విద్యార్థులను ఎంతగానో ఉత్సాహపరిచింది. ఈ క్రమంలో పలు ప్రయివేట్,ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు,పలువురు నాయకులు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో, మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఐపిఎస్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్,చెన్నూర్ ఇన్స్పెక్టర్ దేవేందర్, చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్, మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె. నరేష్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, శ్రీరాంపూర్ ఎస్ ఐ సంతోష్, లక్ష్మి ప్రసన్న, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల కోసం అంబులెన్స్ సిబ్బంది పడిగాపులు



- ప్రభుత్వాలు మారిన సమయానికి అందని వేతనాలు
- సమ్మెకు సిద్ధం అంటున్న 1962 అంబులెన్స్ సిబ్బంది

**గోదావరిఖని, అక్టోబర్ 29 (మనం న్యూస్):** పశు సంచార వైద్య సేవల సిబ్బందికి వేతనాలు లేక పడిగాపులు కాస్తున్నారు. పశువులకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో 2017 లో పశు సంచార వైద్య సేవల కొరకు 1962 అంబులెన్స్ ప్రారంభించారు. ప్రతి జిల్లాలోని నియోజకవర్గానికి ఒక అంబులెన్స్ కేటాయించారు. ఇందులో ఒక డాక్టర్, సహాయకుడు పారామెడికల్, డ్రైవర్, హెల్పర్ విధులు నిర్వహిస్తున్నారు. రైతులు 1962 కు కాల్ చేసిన వెంటనే అంబులెన్స్ అక్కడికి చేరుకుని పశువులకు వైద్యం అందిస్తారు. మూగజీవాల పాలిట సంజీవనిలా పనిచేస్తున్న 1962 అంబులెన్స్ లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు రాక దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ఏడు నెలలుగా జీతాలు లేక సిబ్బంది కుటుంబ పోషణ కోసం భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా సరైన సమయానికి జీతాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో తాము జీవనం సాగిస్తున్నామని అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పశు సంచార సేవలకు కొన్ని నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో డీజిల్ ఖర్చులు కూడా భారం కాగా వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని యాజమాన్యం అంటున్నారు. వేతనాలు లేకున్నా సిబ్బంది మాత్రం మూగజీవాలపై ఉన్న ప్రేమతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 1962 అంబులెన్స్ ఆగక ముందే సిబ్బందికి వేతనాలు విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## పంట పరిహారం చెల్లింపుకు చర్యలు



- అటవీశాఖ అధికారులు

**కాసిపేట, అక్టోబర్ 29(మనంన్యూస్):** వన్యప్రాణుల దాడిలో పంట నష్ట పోయిన విషయాన్ని, పై అధికారుల దృష్టికి తీసుకుపోయి, రైతులకు నష్ట పరిహారం చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని, కాసిపేట మండలం ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. బుధవారం మల్కెపల్లి, తాటిగూడ గ్రామ రైతులు సాగుచేసిన పంటలను పరిశీంచారు. అడవి పందుల దాడిలో ధ్వంసం అయినా పంటలను, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్, రెవెన్యూ, పంచాయతి సిబ్బంది, రైతులతో కలిసి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ, వన్యప్రాణుల వలన పంటలు నష్టపోయిన, రైతులు, వ్యవసాయ కూ లీలపై దాడులు జరిగిన వేంటేనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అటవీ జంతువుల నుండి పంటలను కాపాడుకునే ందుకు సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం, పాత చీర లను కంచె చుట్టూ కట్టడం, సల్ఫార్ పూతతో సుతిల్ తాడు కట్టడం, టపాకాయలు పేల్చ డం లాంటివి చేయాలని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రజలకోసం పనిచేసే వారినే గెలిపించండి



- అర్బన్ బ్యాంకు డైరెక్టర్ అభ్యర్థుల ప్రచారం

**జగిత్యాల అక్టోబర్ 29(మనం న్యూస్):** అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో పనిచేసే నాయకులు, సమర్థులను ఎన్నుకోవాలని డైరెక్టర్ అభ్యర్థులు కూసరి అనిల్, మునిపల్లి ఫణిత, గాదే కార్తీక్, అక్కెనపల్లి కాశినాథొ లు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నల్లా గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కూసరి అనిల్ కుమార్, సిలిండర్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని మునిపల్లి ఫణిత, గ్లాస్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అక్కెనపెళ్ళి కాశినాథొలు ఓటర్లను కోరారు. బుధవారం అక్కినపెల్లి కాశీనాథం కూసరి అనిల్, ఫణిత, గాదె కార్తీక్ లు జగిత్యాలలో ప్రచారం నిర్వహించి, ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. నవంబర్ 1 న జరిగే పోలింగులో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని తమకు మద్దతు తెలిపి గెలిపించాలని వారు కోరారు.

## కార్మిక సంఘాలపై గుర్రు

- గెలిచి రెండేడ్ల కాలం ఎన్నికల హామీల్లో కానరాని కదలిక
- నాయకుల వైపల్యాలపై కార్మికుల అసహనం




**కాసిపేట, అక్టోబర్ 29(మనంన్యూస్):** సింగరేణి సంస్థ లో గుర్తింపు కార్మిక సంగానికి ఎన్నికలు జరిగి వచ్చే డిసెంబర్ నాటికి రెండు సంవత్సత్సరాలు కానుంది. ఈ సందర్భంలో ఎన్నికల ప్రచారాల్లో కార్మిక సంఘాల నాయకుల మాటలు, మేనిఫెస్టో లో పేర్కొన్న హామీల పై కదలిక కానరాక పోవడంతో మెజార్టీ కార్మిక వర్గం అట్టి సంఘాలపై గుర్రు గా వున్నారు. గెలుపు కోసం, కార్మికులను నమ్మపలికెందుకు అలివికాని వాగ్దానాలు చేసిన కార్మిక నాయకులు, వాటి సాధన కోసం నిర్దిష్టమైన కార్యాచరణ చేయకపోవడంపై కార్మికుల నుండి అసహనం వ్యక్తం వ్యక్తమవుతున్నది. కంపెనీలో రాజకీయ ప్రమేయం, ఆధిపత్యం కొనసాగు తున్నదని,యాజమాన్యం, ప్రభుత్వం కార్మిక సంఘాలను పట్టించుకోవడం లేదు, ప్రధాన్యత ఇవ్వడం లేదని ప్రతిపక్షం లో చేసిన విమర్శలే , అధికారంలో వున్నప్పటికీ అవే ఆరోపణలు వల్లవేయడం, సమస్యలను దాటవేసే మాటలు చెపుతూ మభ్యపెట్టే విధానాలు అవలంబిస్తున్నారనే ఆరోపణలు కార్మికుల నుండి వినవస్తున్నాయి. కనీసం జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో చర్చించిన అంశాలను పరిష్కరించే దిశగా నాయకుల చర్యలు లేక పోవడం విడ్డురంగా ఉందని అంటున్నారు. రాష్ట్రంలో కొలువుతీరిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, బాగస్వామ్య పార్టీ సీపీఐ లకు చెందిన అనుబంధ కార్మిక సంగాలైన, ఏఐటియూసి గుర్తింపు కార్మిక సంగంగా, ప్రాతినిధ్య సంగంగా ఐఎన్టీయూసి లు మనుగడలో వున్నాయి. స్వంత ఇంటి పతకం, అలవేన్స్ లపై ఆదాయపన్ను రద్దు, మారుపేర్ల సమస్య పరిష్కారం, అక్రమాలు, అవినీతి లేని కారుణ్య నియామకాలు, కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, ఉద్యోగ అవకాశాలు, విద్య, వైద్యం మెరుగు, కార్మిక కాలనీల యందు సౌకర్యాల కల్పనా, ఇలా అనేక హామీలు గుప్పించిన సంఘాలు, ఈ రెండేండ్ల సమయంలో హామీలపై అడుగు ముందుకు పడలేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంలో నే కనీసం ఏడు నెలలుగా నిలిచి పోయినా మెడికల్ బోర్డు పై గలమెత్తలేని నిస్సాహాయ స్థితిలో కార్మిక నాయకులు ఉండడంపై ఆగ్రహం తో సీనియర్ కార్మికులు వున్నారు. అయితే ఎన్నికల జరిగిన మాసం తో రెండేండ్ల కాలపరిమితి,అధికారికంగా గుర్తింపు హోదా పత్రం అందుకున్న మాసాన్ని పరిగణ లోకి తీసుకుంటే వచ్చే సెప్టెంబర్ వరకు పదవి లో ఉంటారని, ఇప్పటికైన్ కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీల అమలుకు కోల్ బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు, సింగరేణి అధికార కార్మిక సంఘాలు కృషి చేయాలనీ, వాటి సాధనకు కార్మికుల నుండిఅన్ని విధాల మద్దతు ఉంటుందని మెజార్టీ కార్మికులు అంటున్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేయాలి

- అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు
- నవంబర్ 3 నుంచి నవంబర్ 11 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, అక్టోబర్-29 (మనం ప్రతినిధి):** గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పంచాయతీ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గ్రామాల్లో అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేయరాదని. అక్రమ నిర్మాణాల చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని, నవంబర్ 3 నుంచి నవంబర్ 11 వరకు పెద్దపల్లి జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని , గ్రామాలలో ప్లాస్టిక్ ఎక్కడ ఉండడానికి వీలు లేదని, చిన్న కవర్ కూడా ఉండవద్దని, ఆ రితీలో పారిశుధ్య పనులు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ఖాళీ స్థలాలు ఎక్కడ చెత్త ఉండకుండా చూసుకోవాలని, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణకు నిర్దిష్ట షెడ్యూలు ఫాలో కావాలని, ప్రజలు ఎవరు బయట చెత్త వేయడానికి వీలు లేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలలో ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను పూర్తి స్థాయిలో తొలగించాలని , కాల్వల పక్కన ఉన్న చెత్త శుభ్రం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, పంచాయతీ భవనం, ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, గ్రామాలలో అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో స్పష్టమైన మార్పు కనిపించేలాగా పారిశుధ్య నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో పన్ను వసూలు చాలా తక్కువగా ఉందని , నవంబర్ 11 నాటికి కనీసం నిర్దేశించుకున్న లక్ష్యంలో 60% పన్ను వసూలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించడం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాలలో త్రాగునీటి సరఫరా వ్యవస్థను చెక్ చేసుకోవాలని ఎక్కడైనా చిన్న చిన్న ఇబ్బందులు ఏర్పడితే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య , ఎంపిఓ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

## విద్యను విచ్చిన్నం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర




- స్కాలరుషిప్‌లు విడుదల చేయాలని ఏబివిపి రాస్తారోకో

**పెద్దపల్లి అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** పెండింగులో ఉన్న రూ.7వేల 5వందలకోట్ల ఫీజు రీయింబర్సుమెంటు స్కాలరుషిప్పులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆద్వర్యంలో జిల్లాకేంద్రంలో బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ, ఏళ్ళ తరబడిగా ఫీజు రీయింబర్సుమెంట్, స్కాలరుషిప్పులు విడుదల చేయని కారణంగా విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రీయింబర్సుమెంట్,, స్కాలరు షిప్పులు విద్యార్థుల హక్కని, వాటిని ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తోందని ధ్వజమెత్తారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత కూడా సర్టిఫికెట్స్ రాక ఒకవైపు, ఉన్నత విద్యకు మరొకవైపు ఉద్యోగ అవకాశాలు వచ్చినా కూడా సర్టిఫికెట్స్ లేని కారణంగా విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టబడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు మారుతున్నా, విద్యావ్యవస్థ తీరు మారడంలేదని నిస్సహాయత వ్యక్త పరిచారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఒకవేలం ప్రభుత్వ, ఉద్దేశ్యం అదే అయితే గనక కాంగ్రెస్ భరతం పడతామని హెచ్చరించారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తిచేసిన వేలాదిమంది విద్యార్థులు స్కాలరుషిప్పుల కోసం వేచిచూస్తున్నారని, వారందరి ఉసురు కాంగ్రెస్ నేతలకు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. విద్యావ్యవస్థను పటిష్ట పర్చాల్సిన ప్రభుత్వమే విద్యను అంధకారంలోకి నెట్టి వేస్తూ, నూతనంగా ఇంటర్నేషనల్ పాఠశాలలంటూ, యూనివర్సిటీలంటూ కొత్త హామీలతో చేతులు దులుపుకు ంటోందని ఆక్షేపించారు. ప్రభుత్వం వెంటనే స్కాలరుషిప్పులు, ఫీజు రీయింబర్సుమెంటు విడుదల చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్డి రాష్ట్ర కోకన్వీనర్ మారం సందీప్, ఎస్ఎఫ్ఎస్ రాష్ట్ర కోకన్వీనర్ ఓమేష్, విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసురి ప్రవీణ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు అజయ్, నగర కార్యదర్శి జంగపల్లి అరవింద్, నాయకులు అరవింద్ గణేష్, దినేష్, జశ్వంత్ దేవా, విగ్నేష్ పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటికొక హిందూధర్మరక్ష వీరుడు తయారవ్వాలి

- విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సంఘటనమంత్రి సత్యంజీ



**పెద్దపల్లి, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** హైందవధర్మాన్ని రేపటి తరానికి అందించడం కొరకు భవిష్యత్తు ధర్మరక్షకులని ప్రతీ ఇంటినుండి మనమే తయారు చేసుకోవాలని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సంఘటనమంత్రి గుమ్మల్ల సత్యంజీ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కాకతీయ పాఠశాల ఆవరణలో విశ్వహిందూ పరిషత్ యొక్క సేవావిభాగమైన విశ్వహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సత్యంజీ మాట్లాడుతూ, తల్లిఒడినుంచే పిల్లలకు సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పెద్దలపట్ల మర్యాద నేర్పించాలన్నారు. రోజురోజుకి హిందు జనాభా తగ్గుతూ అన్యమతాల జనాభా పెరుగుతుందని, దీని కారణంగా దేశం ఆక్రమించబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందుపిల్లలు పెళ్ళికి దూరంగా ఉండకుండా కుటుంబ జీవన విధానంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కరినగర్ జిల్లా అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది ఇనగంటి మధుసుధన్ రావు, తెలంగాణ ప్రాంత సేవ ప్రముఖ్ కోమళ్ళ రాజేందర్ రెడ్డి, విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, ప్రఖండ కార్యదర్శి కొట్టే మహేందర్, కుట్టు శిక్షకురాలు విజయలక్ష్మీ, అసరి రమేష్, రావికంటి మురళి మోహన్, బొమ్మకంటి రవి, మహిళ విభాగం మూల కవిత, శ్రీవాణి, వేదశ్రీ, శ్రీవాణిరెడ్డి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, అక్టోబర్ 29 ( మనం ప్రతినిధి ):** తుఫాన్ నేపథ్యంల జిల్లాలో 2 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం అన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అక్టోబర్ 29, 30 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని మరియు అందరు అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వనరులలో నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్ళవద్దని సూచించారు. కల్వర్టులు దాటువద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రక్త దాతలే రియల్ హీరోలు



- బెల్లంపల్లి ఏసీపి రవికుమార్.

**బెల్లంపల్లి, అక్టోబర్ 29, (మనం న్యూస్):** రక్తదాతలే రియల్ హీరోలని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ అన్నారు బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో బెల్లంపల్లి డివిజన్ పోలీసుల సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పిపి రవికుమార్ మాట్లాడుతూ నిజ జీవితంలో రియల్ హీరోలు రక్త దాతలని ఈరోజు శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు ఈ శిబిరంలో స్వచ్ఛందంగా 246 మంది రక్తదానం చేశారని రెడ్ క్రాస్ సోసైటీ సభ్యులు తెలిపారు ముందుగా ఎసిపి రవికుమార్ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఇండియన్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు సురభి శరత్ కుమార్ ,అభినవ సంతోష్ కుమార్ , కాసర్ల శ్రీనివాస్ , బెల్లంపల్లి డివిజన్ సభ్యులు లక్ష్మి నారాయణ బెల్లంపల్లి 1 టౌన్ ఎస్ హెచ్ ఓ శ్రీనివాస్ రావు , బెల్లంపల్లి రూరల్ సీఐ అనూక్ ,తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పోలీస్ సిబ్బంది రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది బెల్లంపల్లి ఆర్ఎంపి పిఎంపి వైద్యుల బృందం ప్రభుత్వ దావకాన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## హరీష్ రావును పరామర్శించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి



- తన్నీరు సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళి

**రామచంద్రపురం, అక్టోబర్ 29(మనం న్యూస్):** జమాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్లోని హరీశ్రావు నివాసానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి వెళ్ళి ఎమ్మెల్సీ డా.చిన్న మైల్ అంజిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు వేసి నివాళులర్పించారు. తండ్రి మృతితో తీవ్ర దుఃఖంలో ఉన్న హరీష్ రావు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యనారాయణరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఆయిల్ పామ్ సాగు కోసం ఐదేళ్లు కష్టపడితే జీవితాంతం లాభాలే

- జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య

**సంగారెడ్డి, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** ఆయిల్ పామ్ సాగు ఒక కల్పవృక్షం లాంటిదని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఐదేళ్లు శ్రద్ధగా ఆయిల్ ఫామ్ మొక్కలను పెంచితే జీవితాంతం రైతులకు నిరంతర ఆదాయం వచ్చే పంట ఆయిల్ ఫామ్ పంట అని అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియం లో గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ లు సంయుక్తంగా జిల్లాలోని సహకార సంఘాల సీఈవోలు, రైతులకు ఆయిల్ ఫామ్ పంట సాగు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నూనె గింజల పంటల సాగులో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాయ ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి అన్నారు. ఒకసారి ఆయిల్ ఫామ్ పంట దిగుబడి రావడం ప్రారంభమైతే 25-30 సంవత్సరాలపాటు వరుసగా ఆదాయం వస్తుంది అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి అన్నారు. తక్కువ





నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ ఫాం సాగును చేపట్టవచ్చు అన్నారు. జిల్లాలో ఈ ఏడాది 3750 ఎకరాలు ప్రభుత్వం టార్గెట్ గా నిర్ణయించగా ఇప్పటికి వరకు 1400 ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వరి పంట కోతలు ప్రారంభమయ్యాయని జిల్లాలోని అత్యధిక సంఖ్యలో రైతులు సహకార సంఘాల సిబ్బందితో అభి నవభావ సంబంధాన్ని ఏర్పరచుకున్నారని ఎరువులు విత్తనాల కొనుగోలు నుండి పంట పండిన పంటలు అమ్ముకునే వరకు ప్రతి విషయంలో ప్రతిరోజు రైతులు సహకార సంఘానికి వస్తుంటారని అలాంటి రైతులకు సహకార సంఘాల సీఈవోలు ఆయిల్ ఫామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి అత్యధిక విస్తీర్ణంలో తమ పరిధిలో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సందర్భంగా కలెక్టర్ సహకార సంఘాల సీఈఓలకు సూచించారు. జిల్లాలోని రైతులు ఉన్నత లాభాలు ఇచ్చే నాణ్యమైన పంటలను సాగు చేసేలా సహకార సంఘాల సీఈవోలు ఉద్యానవన శాఖ వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ఇతర నూనె గింజల పంటలతో పోలిస్తే ఆయిల్ ఫామ్ 4-5 రెట్లు ఎక్కువ నూనె గింజలను ఉత్పత్తి చేస్తుంది అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు వల్ల మార్కెట్ భయం లేదు అని కంపెనీలే తోట వద్దకు వచ్చి ఆయిల్ ఫామ్ గెలలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తక్కువ నీటితో డ్రిప్ పద్ధతిలో ఆయిల్ ఫామ్ సాగు వల్ల సాగు నీటిని ఆదా చేయవచ్చు అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు దీర్ఘకాలంలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు మెట్టు భూముల్లో కూడా అనుకూలం అని జిల్లాలో మంజీరా పరివాహక ప్రాంతాల్లో ఆయిల్ పామ్ విస్తరణకు మంచి అవకాశాలున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగులో మూడు సంవత్సరాల వరకు చెట్ల మధ్యలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని, వ్యవసాయ అధికారులు తెలిపారు నాలుగో సంవత్సరం నుండి అంతర పంటగా కోకో ను సాగు చేసి రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చు అన్నారు. ప్రభుత్వం ద్వారా నాణ్యమైన మొక్కలను సబ్సిడీతో రైతులకు అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ అధికారి సిహెచ్ పండరి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ , డిసిఓ కిరణ్ కుమార్, ఉద్యానవన అధికారులు, గోద్రేజ్ ఆగ్రోవెట్ జనరల్ మేనేజర్ స్వీటీ వేగుంట, పి సి ఏ ఎస్ చైర్మన్లు, అధ్యక్షులు,సహకార సంఘాలసెక్రటరీలు, ,కార్యదర్శులు,రైతులు ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్లపై చర్యలు



- అనుమతులు తప్పనిసరి
- జిల్లా వైద్యాధికారి నాగ నిర్మల

**సంగారెడ్డి, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** జిల్లాలో కొనసాగుతున్న స్కానింగ్ సెంటర్ లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పిసి అండ్ పాండిక్ కమిటీ డిఎం హెచ్ ఓ కు ఒక నివేదిక ఇచ్చారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లకు సంబంధించిన కొత్త రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ కు సంబంధించిన దానిపై చర్చించారు రాష్ట్ర టాస్క్ ఫోర్స్ ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాల్సిందిగా కమిటీకి రిపేర్ చేయడం జరిగిందని అన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా పిసి అండ్ పాండమిక్ నియమ నిబంధనలు పాటించి తప్పనిసరిగా ఆన్లైన్ లో పొందుపరిచి. జిరాక్స్ పత్రాలను డి ఎం హెచ్ ఓ కార్యాలయంలో ఒక కాపీని ఇవ్వాలని లేనియెడల అట్టి వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సంధ్య డాక్టర్ రజిని కుమారి రాజు గౌడ్ డి ఈ ఎం ప్రసాద్ రవి పాల్గొన్నారు

## విశ్వకర్మ భగవాన్ దేవాలయానికి స్థలాన్ని కేటాయించండి



- విశ్వబ్రాహ్మణ కులస్తుల సంఘం వినతి
- విద్యుత్ నగర్ సొసైటీ అధ్యక్షుడికి వినతి పత్రం

**రామచంద్రపురం, అక్టోబర్ 29 (మనం న్యూస్):** జగద్గురు శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ దేవాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్ కాలనీ విశ్వబ్రాహ్మణ కులస్తుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ సొసైటీ అధ్యక్షుడు అజీమ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం అధ్యక్షులు రవి చారి మాట్లాడుతూ.. తమ విన్నపాన్ని సొసైటీ అధ్యక్షుడు అజీమ్ సానుకూలంగా స్పందించారని, కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్టు తెలిపారు. కాలనీలో విశ్వకర్మ దేవాలయం నిర్మాణానికి విద్యుత్ నగర్ ఎంఐజి కాలనీలోని విశ్వకర్మ కులస్తులు అందరి చేత సంతకాల సేకరణ చేపట్టి వినతి పత్రాన్ని కాలనీ సొసైటీ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ గోవిందంబ విశ్వకర్మ సంఘం, కాలనీ పెద్దలు కాలనీ సొసైటీ మాజీ అధ్యక్షులు రామ్మూర్తి చారి, మధుసూదన్ చారి, బ్రహ్మాచారి, బిక్షమ చారి, నరసింహ చారి, శ్రీనివాస్ చారి, దుర్గాప్రసాద్ చారి, బాలకృష్ణ చారి, మల్లేష్ చారి, రాజేష్ చారి, కిషోర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక పారిశ్రామిక ప్రాజెక్టులకు అనుగుణంగా భూసేకరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంగారెడ్డి, జహీరాబాద్ డివిజన్లలో పురోగమిస్తున్న టీజీఐఐసి, జాతీయ రహదారి-65 విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ, నిమ్జ్ కు సంబంధించిన భూమిని ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్ పి వి స్పెషల్ పర్పస్ వెహికల్)కు అందించే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.... నిమ్జ్ ప్రాజెక్ట్ కోసం భూములు ఇచ్చిన రైతులకు అందించే పరిహారం జాప్యం లేకుండా అందించాలని సూచించారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పరిధిలో భూములు ఇచ్చిన రైతులకు మంజూరైన నగదు వెంటనే చెల్లించాలి. నగదు విడుదలలో జాప్యం జరుగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పథకాల కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వడానికి నిధుల కొరత ఏదీ లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిమ్జ్ సంబంధించిన భూసేకరణ అనంతరం సొంత హక్కులు, బాధ్యతలు అధికారికంగా సంస్థకు బదిలీ అయ్యే ప్రక్రియ పూర్తి (ప్రభుత్వం భూమిని ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్పీ వి-స్పెషల్జూ పర్పస్ వెహికల్ )కు అందించడం ) చేయాలని సూచించారు. టీజీఐఐసి, నిమ్జ్ ప్రాజెక్టులకు ఇప్పటివరకు భూములు ఇచ్చిన రైతులకు ప్యాకేజీల ప్రకారం పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని తెలిపారు. జాతీయ రహదారి 65 విస్తరణలో భాగంగా చేపట్టిన సర్వీస్ రోడ్డు పనులు అడ్డంకులు లేకుండా కొనసాగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, టీజీఐఐసి, నిమ్జ్, ఆర్అండ్బి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఆర్థిక ప్రణాళిక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి విశాలాక్షి, సంగారెడ్డి-జహీరాబాద్ ఆర్డీవోలు, టీ జీ ఐ ఐ సి, నిమ్జ్, జాతీయ రహదారి అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

# వావ్.. మీ సేవలకు సలాం

**ఇద్దరి ప్రాణాలను కాపాడేందుకు.. విరిగిన చెట్లను నరికిన 108 అంబులెన్స్ సిబ్బంది**





**హైదరాబాద్, మనం ప్రతినిధి :** మొంథా తుపాను కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. భారీ ఈదురుగాలుల నేపథ్యంలో పలు చోట్ల రహదారులపై వృక్షాలు నేలకొరిగాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు - మహబూబాబాద్ రహదారిపై ఓ భారీ చెట్టు విరిగి పడింది. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అదే దారిలో ఓ రెండు అంబులెన్సులు అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంది. ఒక అంబులెన్స్లో శ్వాస సమస్యలతో బాధపడుతున్న రోగి, మరో అంబులెన్స్లో నిండు గర్భిణిని తరలిస్తున్నారు. చెట్టు విరిగి పడడంతో వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి. ఈ క్రమంలో అంబులెన్స్ సిబ్బందే రంగంలోకి దిగారు. అంబులెన్స్ సిబ్బంది మల్లేశ్ యాదవ్, వీరన్న, రాజు కలిసి గొడ్డలితో చెట్టు కొమ్మలను నరికేసి ట్రాఫిక్ను క్లియర్ చేశారు. అనంతరం వారిని సకాలంలో ఆస్పత్రులకు తరలించి వారి ప్రాణాలను రక్షించారు. దీంతో 108 అంబులెన్స్ సిబ్బందిని పలువురు అభినందించారు.

## సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీలకు 37 కోట్ల 40 లక్షల నిధులు

### సీఎం రేవంత్ రెడ్డి తో మంజూరు చేయించిన నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** సంగారెడ్డి సదాశివపేట రెండు మున్సిపాలిటీలలో పలు అభివృద్ధి కార్యక్రమాల పనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జగ్గారెడ్డి 37 కోట్ల 40 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు త్వరలోనే ఈ పనులు ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ కింద ఈ నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో వెల్లడించిందని అన్నారు సదాశివపేట మున్సిపాలిటీలలో పనుల సంబంధించి సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణం ఊబి చెరువు చెరువు సుందరీకరణ కోసం 1.5 కోట్లు గాంధీ చౌక్ సుందరీకరణ కోసం 50 లక్షలు అయ్యప్ప టెంపుల్ నుండి పీఎస్ఎంఎల్ వరకు సెంట్రల్ మీడియం సెంట్రల్ లైటింగ్ కోసం 1.6 కోట్లు డబల్ బెడ్ రూమ్ పరిసరలలో కనీస సౌకర్యాల కోసం 50 లక్షల మున్సిపాలిటీలో పరిధిలో



ఐమాస్ట్ లైటింగ్ ఏర్పాటు కోసం 30 లక్షలు గురు నగర్ కాలనీలో పార్క్ డెవలప్మెంట్ కోసం 50 లక్షలు కేటాయించడం జరిగిందని అన్నారు సంగారెడ్డి మున్సిపాలిటీలలో చేపట్టబోయే పనులు విలీన గ్రామాల్లో సిసి రోడ్ల కోసం రెండు కోట్ల రూపాయలు సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఇంటర్నల్ సిసి రోడ్లు 8 26 కోట్లు సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో వరద నీరు మళ్లింపు కోసం ప్రత్యేక డ్రైన్ నిర్మాణం కోసం 1.09 కోట్లు మున్సిపాలిటీ పరిధిలో పార్కుల అభివృద్ధి కోసం ఒక కోటి 35 లక్షలు సంగారెడ్డి పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రెండు కోట్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- మిషన్ భగీరథ మంచినీటి పంపిణీ వ్యవస్థలో ఆటంకాలు తొలగించండి
- సింగూర్ డ్యాం మరమ్మత్తు సమయంలో ప్రతి గ్రామానికి మంచినీరు అందించేలా ప్రత్యేక ప్రణాళిక
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



రామచంద్రపురం, అక్టోబర్ 29(మనం న్యూస్): పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు, బండ్లగూడ పరిధిలోని దోషం చెరువులలోకి మురుగనీరు చేరకుండా చేపడుతున్న ప్రత్యేక పైప్ లైన్ పనుల పురోగతిపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పైపులైన్ నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని.. త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలను ఆదేశించాలని జిహెచ్ఎంసి ఇరిగేషన్ విభాగం ఈఈ మల్లేష్ ను ఆదేశించారు. పటాన్ చెరు సాకి చెరువు, రామచంద్రాపురం రాయసముద్రం చెరువుల సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం రెవిన్యూ పరిధిలో పాలిటెక్నిక్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలకు త్వరలోనే భూమి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయబోతుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న మంచినీటి పంపిణీ అంశంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని..ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విభాగం అధికారులతో సమన్వయం చేసుకుంటూ మంచినీటి పంపిణీ అంశంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్ ను ఆదేశించారు. పరిశ్రమలకు మంచినీరు అందించడం ఎంత ముఖ్యమో.. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి అందించడం అంతకంటే ప్రాధాన్యత అంశమని తెలిపారు. మంచినీటి పంపిణీ అంశంలో అలసత్వం వహిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు.

డిసెంబర్ నెల నుండి సింగూర్ డ్యాం మరమ్మత్తులు చేపడుతున్న సందర్భంగా సంవత్సరం పాటు మంచినీటి పంపిణీ ఆపివేయడం జరుగుతుందని సంబంధిత అధికారులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సింగూరు ద్వారా పంపిణీ జరుగుతున్న గ్రామాలు, పట్టణాలు, డివిజన్ల పరిధిలో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పటాన్ చెరు మండల పరిధిలోని భానూరు, క్యాసారం, నందిగామ, గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం, కానుకుంట, కొత్తపల్లి, మంబాపూర్, నాగిరెడ్డిగూడెం, నల్లవల్లి, రామిరెడ్డి బావి, వీరారెడ్డిపల్లి, తదితర గ్రామాల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను సంబంధిత ఎంపీడీవోలు, కార్యదర్శులతో చర్చించారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిధులు కొరత మూలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంబంధిత కార్యదర్శులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని కోరారు. గుమ్మడిదల నుండి కానుకుంట మీదుగా నూతనకల్ వరకు రహదారి నిర్మాణ పనులను అతి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. నూతన అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేయాలని.. ప్రభుత్వంతో చర్చించి నిధులు కేటాయిస్తానని తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కర్దనూరు, ఘనాపూర్, వెలిమెల, కొల్లూరు, తెల్లాపూర్, ఉస్మాన్ నగర్ పరిధిలో 6 కోట్ల 80 లక్షల రూపాయలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు వచ్చే వారంలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో విలీనమైన గ్రామాలలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించవద్దని.. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అమీన్ పూర్ జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, అమీన్ పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, పటాన్ చెరు ఎమ్మార్వో రంగారావు, పటాన్ చెరు ఎంపీడీవో యాదగిరి, గుమ్మడిదల ఎంపీడీవో ఉమాదేవి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ విజయ లక్ష్మి, డీఈలు హరీష్, శ్రీనివాస్, ఏఈ మౌనిక, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు ముందే ఈ బెదిరింపులేంది?

- నవీన్ యాదవ్పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ బెదిరింపు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. నవీన్ యాదవ్ గల్లీ కూడా దాటనియ్యను అంటున్నారని.. జూబ్లీహిల్స్ ఎమైనా మీ అయ్యా జాగీరా? అని నవీన్ యాదవ్ను ఆర్ఎస్పీ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. నేను తలచుకుంటే జూబ్లీ హిల్స్ దాటనియ్యను అని నవీన్ అంటుండ్రని.. నేను ఓపెన్గా అడుగుతున్నా.. జూబ్లీహిల్స్ మరి పోలీసులు ఎక్కడ పోయారని ఆయన ప్రశ్నించారు. బేదిరిస్తే? సుమోటో కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ఆయన నిలదీశారు. వార్నింగ్లు ఇస్తున్న నవీన్ యాదవ్పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కొందరు పోలీసులు నవీన్ యాదవ్కు సపోర్టు చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఇదిలాఉం టే, ఎన్నికల కు ముందుగానే, అసెంబ్లీకి పోకముందే ఇంత రౌడీయిజం చేస్తున్నారని, వీళ్ల పహిల్వాన్లు బస్తీల్లోకి వచ్చి అరాచకం చేస్తారని దుయ్యబట్టారు. ఇక్కడ సీసీ కెమెరాలు పెట్టండని, గుండాయిజం పెరుగుతుందని ఓ మహిళ ఆందోళన వ్యక్తం చేసిందని ప్రవీణ్ హితవు పలికారు. కేసీఆర్ అధికారంలో నుంచి పోయినప్పటి నుంచి బస్తీల్లో గుండాయిజం పెరిగిందని ఆమె చెప్పారు.

## వైకుంఠ దామానికి దారేది?

- పిచ్చి మొక్కలతో మూసుకుపోయిన దారి

**చర్ల, అక్టోబర్ 29 (మనం న్యూస్) :** చర్ల మేజర్ గ్రామ పంచాయతీ వైకుంఠ దామమం అద్వాన్నంగా మారింది. మృతదేహాలను దహన పరిచేందుకు ఏర్పాటు చేసిన ప్లాట్ ఫాంల వద్దకు వెల్లేందుకు గల ప్రదాన రహదారి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రహదారిని మూసి వేసాయి. దీనికితోడు దహన సంస్కారం కార్యక్రమం ముగిసిన అనంతరం స్నానం చేసేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపు, జల్లు స్నానాల వద్దకూడా చెత్త మొక్కలు పెరిగిపోవడంతో అటువైపు వెల్లే పరిస్దితి లేదు. దీంతో ప్రజలు వైకుంఠ దామంను వాడకుండా దాని పక్కనే ఉన్న ఖాళీ స్దలంలో ఖననం, దహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దహన ప్లాట్ ఫాంల వద్దకు వెల్లేపరిస్దితి లేకపోవడం, ఖాళీ స్దలంలో గ్రావెల్ తోలకాలు జరిపి భారీ గోతులు పెట్టడంతో ఉన్న కొద్ది ప్రదేశంలోనే మృత దేహాలకు దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది. దీంతో ఒకరి మృతదేహం పక్కన మరొకది పెట్టాల్సిన దుస్దితి ఏర్పడింది. అదికారులు ఇప్పటికయినా వైకుంఠ దామం గేట్ల ముందు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి దానిని వినియోగం లోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# అన్నదాతలకు మొంథా దిగులు

- భారీ వర్షం హెచ్చరికలతో నిలిచిన వరి కోతలు
- మిరప రైతుల గుండెల్లో గుబులు
- గాలికి నేలకొరిగిన మిరప, వరి చేలు



**చర్ల, అక్టోబర్ 29 (మనం న్యూస్) :** అన్నదాతను మొంథా తుఫాను వణికిస్తోంది. భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో మిరప, వరి రైతులలో ఆందోళన వ్యక్తమవుతోంది. తాలిపేరు కుడి ఎడమ కాల్వల క్రింద విద్యుత్ మోటార్ల క్రింద సాగుచేసిన వరి చేలు కోతకు వచ్చాయి. 1010, 1001, 1064 సాదారణ రకం పిన్న వరిచేల కోతలు ప్రారంభమవ్వగా, 1262, బిపిటి 5204, 1271, 1318 సన్న రకం పెద్దవరి సాగుచేసిన రైతులు వరి కోసేందుకు సమాయత్త మవుతుండగా వతావరణ పరిస్దితుల కారణంగా కోతలను నిలిపివేసారు. తుఫాను కారణంగా గాలి వీస్తుండటంతో పలుచోట్ల వరి నేలవాలింది. దీంతో నేలవాలిన కంకులు తడిచి మొలకెత్తే ప్రమాదం ఉన్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చేలు బురదమయంగా మారడంతో కోతలకు టైర్ కోత యంత్రాలకు బదులుగా ట్రాక్ కోతయంత్రాలను వాడాల్సి ఉంటుంది. టైర్ యంత్రంకు ఒక ఎకరా కోత కోసేందుకు రూ. 2,500 కాగా ట్రాక్ మిషన్ కు 3,300 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయినప్పటికీ అదిక వర్షాలు కురియడంతో వరి చేలలో నీరు నిలిచి ఉంది. ఈలోగా తుఫాను కారణంగా మళ్లీ వర్షాలు కురుస్తుండటంతో వరి రైతులపై మరింత భారం పడనుంది. ఈ ఏడాది పత్తి రైతులు కుదేలయ్యారనే చెప్పాలి. మండల వ్యాపితంగా సుమారు 4 వేల ఎకరాలలో పత్తి సాగుచేయగా అదిక వర్షాల కారణంగా చేలు ఎర్రబారి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. గత ఏడాది ఎకరాకు 10 నుండి 12 క్వింటాల్ల దిగుబడి రాగా ఈ ఏడాది 3 నుండి 4 క్వింటాల్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉంది. ఉన్న పత్తి కూడా అన్నదాతలకు దక్కే అవకాశాలు లేకుండా పోయాయి. తుఫాను కారణంగా గాలి వీచడంతో పత్తి చేలు నేలవాలాయి. పత్తి తడచి పోవడంతో రంగుమారి రేటు తగ్గే ప్రమాదం ఉంది. మిరప రైతులదీ ఇదే పరిస్దితి. అదిక వర్షాల కారణంగా ఈ ఏడాది మొక్కేతలు ఆలస్యమయ్యాయి. ఎన్నో వ్యయప్రయలకోర్చి వేసిన మిరప చేలు అదిక వర్షాల కారణంగా పలుమార్లు దెబ్బతిన్నాయి. వర్షపు నీరు నిలవడంతో మొక్కలు చనిపోయారు. ఫలితంగా మరోసారి మొక్కలు వేయాల్సి వచ్చింది. పదేపదే చనిపోయిన మొక్కల స్దానంలో తిరిగి మొక్కలు వేయాల్సి రావడంతో నారు కొరత ఏర్పడింది. దీనికితోడు గాలి కారణంగా కాపుకాసిన మొక్కలు నేల వాలాయి. ఈ నేపథ్యంలో తుఫాను కారణంగా భారీ వర్షాలు పడితే మరింత నష్టపోతామని రైతులు దిగులు చెందుతున్నారు. గత మూడేల్లుగా వాతావరణ ప్రతికూల పరిస్దితుల కారణంగా తీవ్రంగా నష్టపోయిన మిరప రైతులు ఈ ఏడాది ఆరంభం నుండే ప్రతికూల పరిస్దితులను ఎదుర్కొంటున్నారు. కాగా తుఫాను కారణంగా వృక్షాలు నేలకూలి విద్యుత్ లైన్లు తెగిపడితే తమకు సమాచారం ఇవ్వాలని విద్యుత్ అదికారులు ప్రజలకు విజ్ఞప్తి చేసారు. తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ముదరాజు తుఫాను పరిస్దితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఎటువంటి అత్యవసర పరిస్దితి వచ్చినా, ఇండ్లు ద్వంసమయినా వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు.



## బీజపూర్‌లో 51 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల, అక్టోబర్ 29 (మనం న్యూస్) :** చత్తీస్ ఘడ్ లో మావోయిస్టు లొంగుబాటు కార్యక్రమం కొనసాగుతోంది. తాజాగా 51 మంది వివిధ క్యాడర్ లకు చెందిన మావోయిస్టులు జిల్లా ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదుట లొంగిపోయారు. ఛత్తీష్ఘడ్ పునరావాస విధానం లో భాగంగా జరిగాయి. లొంగిపోయిన వారిలో తొమ్మిది మంది మహిళలు కాగా 42 మంది పురుషులు ఉన్నారు వీరందరిపై మొత్తం 66 లక్షల రివార్డు ఉంది. లొంగిపోయిన వారిలో పి ఎల్ జి ఏ బెటాలియన్ కంపెనీ నెంబర్ వన్, టూ, ఫైవ్ కంపెనీకు చెందిన ఏసీఎం ఒకరు, ఫ్లాటూన్, ఏరియా కమిటీ సభ్యులు ఏడుగురు, ముగ్గురు ఎల్ వో ఎస్, మిలిషియా ఫ్లాటూన్ కమాండర్ ఒకరు, 14 మంది మిలీషియా ఫ్లాటూన్ సభ్యులు, ఆర్పిసి జనతన్ సర్కార్, డికేఎంఎస్, సిఎన్ఎం 20 మంది అద్యక్షులు, ఉపాద్యక్షులు, సభ్యులు ఉన్నారు. 2025 సంవత్సరంలో బీజపూర్ జిల్లాలో 461 మంది లొంగిపోయారని, 138 మంది ఎన్ కౌంటర్లలో మృతిచెందారని, 485 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పి తెలిపారు. 2024 జనవరి నుండి నేటి వరకు బీజపూర్ జిల్లాలో 650 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవగా 196 మంది మృతిచెందారని, 986 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. లొంగిపోయిన వారిలో రూ. 8 లక్షల రివార్డు కలిగిన పిపిసిఎం బుద్రాం పోతం అలియాస్ రంజిత్, రూ. 8 లక్షల రివార్డు కలిగిన బెటాలియన్ నెంబర్ వన్ సభ్యుడు మంకి కోవాసి, రూ. 8 లక్షల రివార్డు కలిగిన కంపెనీ టు సభ్యుడు హూంగి సోది, రూ. 8 లక్షల రివార్డు కలిగిన కంపెనీ టు సభ్యుడు రవీంద్ర పూనెం, రూ. 8 లక్షల రివార్డు కలిగిన పిఎల్జిఏ సభ్యుడు దేవే కర్తం, రూ. 5 లక్షల రివార్డు కలిగిన పిపిసిఎం మంగూ ఓయం, రూ. రెండు లక్షల రివార్డు కలిగిన పార్టీ సభ్యుడు అస్మతి ఓయం, రూ. రెండు లక్షల రివార్డు కలిగిన పార్టీ సభ్యుడు లక్షణ్ కోడా, గుడ్డి లేఖం, ఆర్పిసి డికేఎంఎస్ అద్యక్షుడు మంగ్రు వడ్డే, ఆర్ పి సి మిలీషియా సభ్యుడు అయితు పూనెం ఉన్నారు.

## వర్షాలకు వరదనీట మునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వరద, వర్ష ప్రభావిత ప్రాంతాలలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు
- అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్ లో 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు
- కొణిజర్ల మండలం తుమ్మలపల్లి ప్రధాన రహదారి వద్ద పగిడేరు వాగు వరద ప్రవాహన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, అక్టోబర్ 29(మనం న్యూస్):** జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తు వరదనీట మునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు కొణిజర్ల మండలం పడిగేరు వాగు తుమ్మలపల్లి రహదారిలో ఉధృతితో ప్రవహిస్తున్న వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనాల రాకపోకలు, ప్రజలు బ్రిడ్జ్ దాటకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, రోడ్డు ఇరువైపులా బారికేట్ లు, ట్రాక్టర్ లను అడ్డుపెట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సంసిద్ధతతో, స్థానికంగా ఉంటూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ వరద అంచనా వేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సహాయానికి కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్లు టోల్ ఫ్రీ నెంబర్ 1077, వాట్సాప్ సెల్ నెంబర్ 9063211298 లను వర్షం, వరద ప్రభావిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున చెరువులు, వాగులు ఆలుగులు పారే అవకాశం ఉందని, ప్రజలు స్వీయ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు పైకి ప్రజలు అనవసరంగా రావద్దని అన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరులు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉదృతంగా ప్రవహించే వాగులు చెరువుల సమీపంలోని రోడ్లు, వంతెనలపై రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని, దీనికి సంబంధించి తహసీల్దార్లు, ఎంపిడిఓలు, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎట్టి పరిస్థితులను సైతం తట్టుకునేలా అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఖమ్మం అర్డీవో నరసింహరావు, కొణిజర్ల తహసీల్దార్ అరుణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లకు భారీ జరిమానా

- ఆళ్లపల్లి రేంజ్ అధికారి కిరణ్ కుమార్

**ఆళ్లపల్లి అక్టోబర్ 29 (మనం న్యూస్):** ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారికి అయినా ఆటవి చట్టల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆళ్లపల్లి రేంజ్ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. ఈనెల 8న ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసిన 8 ట్రాక్టర్ లు, ట్రాలీలకు బుధవారం చట్టపరమైన ప్రక్రియ ప్రకారం ప్రతి ట్రాక్టర్ పై 44.145 రూ చొప్పున మొత్తం 3,53,160 జరిమానా విదించడం జరిగిందని తెలిపారు. ఆ జరిమానా మొత్తాన్ని చెల్లించిన అనంతరం ఆ టాక్టర్లను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారుల అనుమతులు లేకుండా ఇసుక, మరి ఎ ఇతర ఆటవి ఉత్పత్తులనైనా అక్రమ రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా వన్యప్రాణి సంరక్షణ, ఆటవి ఉత్పత్తుల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరమని ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

## సొసైటీ ద్వారా 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



- సొసైటీ అధ్యక్షులు కొత్వాల

**పాల్వంచ, అక్టోబర్ 29(మనం న్యూస్):** పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా మండల పరిధిలో 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ మద్దతు ధరకు రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయనున్నామని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, వ్యవసాయ శాఖ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. మండల పరిధి రెడ్డిగూడెం(ప్రభాత్ నగర్), కారేగట్టు, సోముల గూడెం, నాగారం, మున్సిపాలిటీ పరిధి పేటచెరువు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. ఈ సంవత్సరం వరి ధాన్యం సాధారణ రకం రూ 2,369లు, ఏ గ్రేడ్ రకం రూ 2,389లుగా ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించిందని అన్నారు. సన్నరకం దాన్యానికి క్వింటాల్ కు రూ 500ల బోనస్ ఇవ్వనున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు.

### సొసైటీ కార్యదర్శి లక్ష్మీనారాయణ(శ్రీను)బదిలీ

పాల్వంచ సొసైటీలో కార్యదర్శి (సీఈవో) గా పనిచేస్తున్న జి లక్ష్మీనారాయణ (శ్రీను) బూర్గంపాడు సొసైటీ కి బదిలీ అయ్యారు. పాల్వంచ నూతన కార్యదర్శిగా బత్తిన వెంకటప్రసాద్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొత్వాలతో పాటు పాలకవర్గ సభ్యులు, సిబ్బంది లక్ష్మీనారాయణ ను శాలువా, బోకేలతో సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామమోహనరావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, సామా జనార్ధన రెడ్డి, జరభన సీతారాం బాబు, భూక్య కిషన్, ఎర్రంశెట్టి మధుసూదన్ రావు, కార్యదర్శులు బివి ప్రసాద్, లక్ష్మీనారాయణ, ఏఈఓ అణురిక, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన బాలుర వసతి గృహమును ఆకస్మిక తనిఖీ

- అంబేద్కర్ సెంటర్లో బస్టాండ్ స్థల పరిశీలన
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, అక్టోబర్ 29(మనం న్యూస్):** మణుగూరు మండలం అశోక్ నగర్ లో గల గిరిజన బాలుర వసతి గృహమును ఆకస్మికంగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. విద్యార్థులకు అమలు చేస్తున్న భోజన మెనూ గురించి ఆరా తీశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు, సౌకర్యాల గురించి స్వయంగా విద్యార్థులతో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, కావాల్సిన ఇతర మౌళిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఆహారాన్ని పరిశీలించారు. స్వయంగా తరగతి గదులకి, విశ్రాంతి గదులను, వంటశాల,స్టోర్ రూములకు వెళ్లి పరిశీలించారు. వసతి గృహాల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను ధ్రువీకరించి, ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు కల్పించే వసతి సౌకర్యాలను హాస్టల్ సిబ్బంది తెలిపారు. విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాస్మెటిక్ చార్జెస్ పెంచడం జరిగింది అని తెలుపుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉన్నతమైన విద్య, పౌష్టిక ఆహారం, వసతులు విషయంలో రాజీ పడకుండా నిధులను మంజూరు చేస్తుందని విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకొని ఉన్నతమైన స్థానాలను అవరోహించాలి అని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

### అంబేద్కర్ సెంటర్లో బస్టాండ్ స్థల పరిశీలన

మణుగూరు మండలం అంబేద్కర్ సెంటర్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్టాండ్ ఏర్పాటు చేయాలి అని మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ తో బస్టాండ్ స్థల పరిశీలన చేసి అనంతరం సాధారణ ప్రజలతో మమేకమై వారితో కూర్చుని టీ తాగారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మండలం ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోలకు రివార్డు నగదు అందజేత



- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 30 (మనంప్రతినిధి):** నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో పని చేస్తూ ఇటీవల కాలంలో జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన ముగ్గురు సభ్యులకు ఈ రోజు 9 లక్షల 50 వేల రూపాయల నగదును చెక్కుల రూపంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలో చెక్కుల రూపంలో రివార్డు నగదులను అందజేశారు.

### రివార్డు నగదు పొందిన సభ్యుల వివరాలు

చతీస్గడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాకు చెందిన రామ్ సింగ్ కొడే (40)కు 5 లక్షల రూపాయలు, చతీష్గడ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, ముచ్చికి సోందాల్ (30)3 లక్షల 75 వేల రూపాయల , చతీష్గడ్ రాష్ట్రం, సుక్మా జిల్లాకు చెందిన సోడి భీమే(30)కు 75 వేల రూపాయల చెక్కులను ఎస్పీ అందచేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందని తెలియజేసారు.కాలం చెల్లిన సిద్ధాంతాలతో స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ నాయకులు అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకుని వారి చేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయించారని తెలిపారు. లొంగిపోయిన నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన మిగిలిన నాయకులు మరియు సభ్యులు ఆయుధాలను వీడి ప్రజాస్వామ్యబద్దంగా ప్రజల హక్కుల తరుపున పోరాడాలని కోరారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునేవారు తమ బంధుమిత్రుల ద్వారా గానీ, స్థానిక పోలీస్ అధికారుల ద్వారా గానీ లేదా స్వయంగా జిల్లా ఎస్పీ గారి ఎదుట గాని లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు.లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా పోలీస్ శాఖ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్ మరియు ఆర్ఐ ఆపరేషన్స్ రవి లు పాల్గొన్నారు.



## శిథిలావస్థకు చేరిన బస్టాండ్ బిల్డింగ్ స్థానంలో కొత్త భవనం నిర్మించాలి

- బస్ స్టాండ్ వద్ద సీపీఎం ధర్నా నాయకుల అరెస్ట్
- సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు

**కొత్తగూడెం, అక్టోబర్ 29(మనం న్యూస్):** శిథిలావస్థకు చేరిన పాత బస్టాండు స్థానంలో కొత్త బస్టాండ్ భవనాన్ని నిర్మించాలని సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న బస్టాండ్ శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందనీ, దీనివలన బస్టాండ్ లో పనిచేసే సిబ్బంది మరియు ప్రయాణికులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనీ ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తె భవనం కురుస్తుందనీ,పై కప్పు పెచ్చులు ఊడిపోతున్నాయని,గోడలు బీటలు వారుతున్నాయని అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.శిథిలావస్థకు చేరిన పాత భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు.కొత్తగూడెం నుండి గ్రామాలకు బస్ సౌకర్యాలు లేవని,గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.బస్టాండ్ ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం వలన దొంగల బెడద ఎక్కువైపోయిందనీ దీనివలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.బస్టాండ్ అభివృద్ధి కొరకు సింగరేణి సంస్థ కేటాయించిన పద్నాలుగు కోట్ల రూపాయలు ఎందుకు ఖర్చు పెట్టలేదని ప్రశ్నించారు.బస్టాండ్ అభివృద్ధి కొరకు కేటాయించిన నిధులు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని, జిల్లా కేంద్ర బస్ స్టాండ్ గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం ట్రాఫిక్ ఇంచార్జ్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు ధర్నా వద్దకు వచ్చి నాయకులను అరెస్ట్ చేసి ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ కి తరలించారు.సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేస్తుంటే అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు నందిపాటి రమేష్ నాయకులు వై వెంకటేశ్వరరావు జి రాజారావు అభిమన్యు జలాల్ సతీష్ సలీం రాములు సంధ్య రఘు శ్రీధర్ పాల్గొన్నారు

# మహిళా కమిషన్ చైర్మన్ అడ్రస్ ఎక్కడ...?

సొంత ఇలా కాలాలో ఇంత ఘటన జరిగిన హాజరుకాని మహిళా కమిషన్ చైర్మన్..!!

ఘటన స్థలానికి సందర్శించని కలెక్టర్...!

అధికార యంత్రాంగం పనితీరు ఇదేనా...?

ఆడపిల్లలపై ఇంత అఘాయిత్యం జరుగుతున్న ఎమ్మెల్యేలకు మంత్రులకు చీమకుట్టినట్టు కూడా లేదా...?

పాఠశాలను సందర్శించ లేకపోవడంలో ఆంతర్యం ఏంటి...?

ఉప ఎన్నికపై ఉన్న మక్కువ ఆడపిల్లలకు రక్షణ కల్పించడంలో లేదా...?

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు అంటే అంత చులకన

ప్రతిపక్షాలు విషయం తెలుసుకుందామంటే పోలీస్ బందోబస్తుతో అడ్డుకోవడం సభాబేనా

డీఈఓ ను కూడా సస్పెండ్ ఎందుకు చేయడం లేదు



కరీంనగర్ అక్టోబర్ 29(మనం బ్యూరో): పేద మధ్యతరగతి కుటుంబీకులే ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులుగా వెళుతున్న తరుణంలో వారిపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆదమచిపోతున్న ప్రభుత్వ యంత్రాంగం ఒక వైపు నాయకులు మరోవైపు ప్రజా ప్రతినిధులు అధికారులు మైకులమట్టుకే మాటలకే పరిమితం కావడంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినిలపై ఇంత అఘాయిత్యాలు జరుగుతున్నాయి. పేద విద్యార్థులపై ఎందుకు ఈ చులకన అంటూ ప్రజానీకం వైపు దుమ్మెత్తి పోస్తున్న పరిస్థితి పై ''మనం''ప్రత్యేక కథనం.. వివరాల్లోకి వెళితే కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో దారుణమైన ఘటన చోటు చేసుకున్న దుస్థితిపై రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది.. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఒక అటెండర్ విద్యార్థినులపై లైంగిక వేధింపులు కాకుండా మూత్రశాలల్లో సీసీ కెమెరాలు అమర్చి వికత చేష్టలు చేస్తున్న దుస్థితి బయటికి పొక్కడం రాష్ట్రంలో యావత్ మహిళ లోకం తలదించుకునే పరిస్థితి దాపురించింది. ఇంత ఉదాంతం జరుగుతున్న అటెండర్ పై చర్య తీసుకోలేని ప్రధానోపాధ్యాయురాలు పై స్థాయి ఉద్యోగస్తులు ఎందుకు నిమ్మకుండిపోయారో అర్థం కాని పరిస్థితి. ఇది అంతా ఒకవైపు అయితే ఇంత ఉదాంతం జరిగినప్పటికిని సాక్షాత్తు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ తన గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరం లో సంఘటన జరిగినప్పటికీ ఇప్పటివరకు సందర్శించకపోగా కనీసం కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఒక మహిళ అయి ఉండి కూడా సంఘటన స్థలానికి సందర్శించ లేకపోయిందని పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.. పేపర్ల మట్టుకే సస్పెన్షన్ ఆర్డర్లు పోలీస్ కేసులు చర్యలు తీసుకుంటున్నామంటూ లేఖల ద్వారా ప్రెస్ నోట్ ల ద్వారా చర్యలు చేపడుతున్నప్పటికీ సంఘటన స్థలానికి ఎందుకు సందర్శించలేకపోతున్నారన్నదే ఆశ్చర్యం కలిగిస్తుంది. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ స్థానికురాలై ఉండి ఎక్కడో కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అన్యాయం జరుగుతే ఊరుకునే పరిస్థితి లేదంటూ టీవీలలో పేపర్లలో ప్రచారాలకే పరిమితమైన మహిళా కమిషన్ చైర్మన్ నేడు నీ ఇలాకాలోని మీ ఇంటికి మూడు కిలోమీటర్ల దూరంలోనే ప్రభుత్వ పాఠశాల తోటి మహిళా విద్యార్థులకు ఇంత అన్యాయం జరిగితే విద్యార్థులకు భరోసా కల్పించేందుకే కనీసం సందర్శించేందుకైనా సమయం లేకపోయిందా అంటూ విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే జిల్లా కలెక్టర్ ఒక మహిళగా జిల్లా వ్యాప్తంగా ఎన్నో అంగన్వాడి పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థులతో పాఠాలు చెబుతూ ఆటపాటలతో చేతుల మైకులతో ఎన్నో ఆకర్షింప బడినటువంటి ఒక మహిళా కలెక్టర్ ఇంత అగాయిత్యం జరిగిన పాఠశాలను సందర్శించకపోవడం బాధాకరం.. ఇది ఇలా ఉంటే ఇకపోతే మంత్రులుగా ఎమ్మెల్యేలుగా చెప్పుకుంటూ పోతున్నటువంటి నాయకులు ఇంత అఘాయిత్యం జరిగితే పాఠశాలలో చదివిస్తున్నటువంటి పేద తల్లిదండ్రులను పలకరించి భరోసా కల్పించి వలసిన బాధ్యత మీకు లేదా అంటూ ప్రశ్నిస్తున్న ప్రజలు.... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల మీకు అంత ప్రాముఖ్యమైతే మధ్య పేద తరగతి మీద కుటుంబాలైన విద్యార్థులకు రాష్ట్రంలో ఇంత అవమానం జరిగితే మీకు జ్ఞానోదయం కావడం లేదా అంటూ జనం ఆడిపోసుకుంటుంది.. మరోవైపు ఇంత అఘాయిత్యానికి పాల్పడిన అటెండర్ తో పాటు అధికార సిబ్బంది పై పూర్తి విచారణ చేపట్టాలని ప్రతిపక్షాలు సంఘటన స్థలానికి వెళితే పోలీసులతో అడ్డుకుంటున్నారంటూ ప్రతిపక్ష నాయకులు కూడా ఆగ్రహావేశాల గురికావడం ఒక వంతుకు బాధాకరం. రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రభుత్వ పాఠశాలలో ఇంత అఘాయిత్యాలు జరుగుతున్నప్పటికీ గోప్యంగా ఉంచడం ఒకవైపు అయితే బయటకు వచ్చిన తర్వాత హుటాహుటిన అరెస్టుల పర్వాలు సస్పెన్షన్లు జరగడం తాత్కాలిక చర్యగానే కనిపిస్తుంది. కానీ మానవత దక్పథంతో మహిళా కమిషన్ చైర్మన్ కానీ మహిళా కలెక్టర్ కానీ మంత్రులు ఎమ్మెల్యేలు కానీ ప్రభుత్వంలో పని చేస్తూ ప్రభుత్వ పాఠశాలను సందర్శించకపోవడం బాధాకరం అంటున్నారు.... 2000 సంవత్సరంలో కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో ఓ ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులతో కూడుకున్న బస్సు బావిలో పడిన సందర్భంలో ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విషయం తెలుసుకున్న వ్యవధిలోనే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మానవతా దక్పథంతో బాధిత కుటుంబాలను పరామర్శించి ఆదుకున్న పరిస్థితి గుర్తు చేయవలసి వస్తుంది... కనీసం ఆ మానవత్వం ఈ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకు అధికార యంత్రాంగానికి కనిపించకపోవడంపై విచారం వ్యక్తం చేస్తున్నారు... ఏదేమైనప్పటికిని పత్రికలలో టీవీలలో ఉన్నత స్థాయి వర్గాల్లో గొప్ప అని కనిపించే ప్రజాప్రతినిధుల అధికారుల వ్యవస్థ ఇలాంటి దుర్ఘటనలు జరిగిన సంఘటన స్థలానికి వెళ్లి భరోసా కల్పిస్తే బాగుంటుందనీ గ్రామాల ప్రజలు అనుకుంటున్నారు.



## ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి




- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

కామారెడ్డి, అక్టోబర్ 29 ( మనంప్రతినిధి): ఉద్యాన , పట్టుపరిశ్రమ శాఖ హిందూస్తాన్ యూనిలివర్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యం లో వ్యవసాయ ,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన సదస్సు ను బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీసీ ఆదేశాల మేరకు ప్రతి వ్యవసాయ ప్రాథమిక సంఘానికి 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం ఇవ్వడం జరిగిందని, ఆయిల్ పామ్ పంట సాగు, నాటడం, చీడపీడల నివారణ చర్యలు , మార్కెటింగ్ గురించి ప్రతీ ఒక్క అంశం పై అవగాహన కలిగి ఉండాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అన్నారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయ వనరుగా మారుతుందని,దీనిని శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టాలని సూచించారు. అలాగే, ఈ రంగంలో ప్రభుత్వం, సహకార సంఘాలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ పంట యొక్క ఆర్థిక ప్రాధాన్యత, సాగు పద్ధతులు, నీటి వినియోగం, వాతావరణ అనుకూలత, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మార్కెట్ అవకాశాల పై సంబంధిత అధికారులు విశదీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా కోపరేటివ్ అధికారి రామ్మోహన్, పాక్స్ కార్యదర్శులు, వ్యవసాయ మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన, ఉద్యాన విస్తరణ అధికారులు, ఆయిల్ పామ్ ప్రతినిధులు, డ్రిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల దురాశ.. పేదవాడికి శాపం




- కమిషన్ కోసం పేదవారి ప్రాణాలతో చెలగాటం
- అర్హత లేని వారితో గుండె పరీక్షలు

జగిత్యాల, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల అవినీతి, కమిషన్ వ్యాపారం ప్రజల్లో తీవ్ర ఆగ్రహం రేపుతోంది. పేదవారి ప్రాణాలను కాపాడాల్సిన గవర్నమెంట్ డాక్టర్లు, కమిషన్ కోసం ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారని ఆరోపణలు కోకొల్లలుగా వెల్లువెత్తుతున్నా పరిస్థితి జిల్లా కేంద్రంలో నెలకొంది. స్థానికుల సమాచారం ప్రకారం, ప్రధాన ఆసుపత్రిలోని కొంతమంది వైద్యులు పేషెంట్లను ఉచిత సేవలు ఇవ్వకుండా, బయట ఎలాంటి క్వాలిఫికేషన్ లేని వ్యక్తులు నడుపుతున్నా స్కానింగ్ సెంటర్లకు పంపుతున్న వైనం నెలకొన్నది.

### దీనికి నిదర్శనం...

తాజాగా బయటపడిన ఆధారాల ప్రకారం, జగిత్యాల సివిల్ హాస్పిటల్ నుండి పేషెంట్కి రెఫర్డ్ బై సివిల్ హాస్పిటల్ అని ఉన్న రిపోర్ట్ ఆధారంగా అర్హత లేని కార్డియో ప్రైవేట్ సెంటర్కి పంపినట్లు స్పష్టంగా చూపిస్తున్నదే నిదర్శనం. ఆ కార్డియాక్ సెంటర్ రిపోర్టో డాక్టర్ పేరుకి ఎలాంటి మెడికల్ క్వాలిఫికేషన్, డిగ్రీ లేదా రిజిస్ట్రేషన్ నంబర్ లేదు. ఇది అత్యంత ఆందోళనకరమైన అంశం అని ఆందోళన చెందుతున్న పేషెంట్లు..దీనితో పాటు మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే -జగిత్యాల జిల్లాలో రియల్ కార్డియాలజిస్టులు ఇద్దరే ఉన్నారు అయినా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వారి వద్దకు పంపకుండా,అర్హత లేని ఫేక్ డాక్టర్ దగ్గరికి పేషెంట్లను కమిషన్ కోసం కక్కుర్తి పడి పంపుతున్నారని సమాచారం కుతలై కూస్తున్న పరిస్థితి నెలకొంది.ఈ వ్యవహారం ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్,1956 ప్రకారం క్రిమినల్ నేరం. అర్హత లేని వ్యక్తి వైద్య పరీక్షలు చేయడం, అలాగే ప్రభుత్వ వైద్యులు వారిని ప్రోత్సహించడం చట్టపరంగా తీవ్రమైన నేరం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ప్రజలు సామాజిక వ్యక్తలు ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, హెల్త్ డిపార్ట్మెంట్ తక్షణ విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోళ్ల సమస్యల పరిష్కారానికై కాల్ సెంటర్



- కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల అక్టోబర్ 29(మనం ప్రతినిధి): వరి ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో ధాన్యం కొనుగోళ్ల లో ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 18004258187 ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రైతులు సంప్రదించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, సివిల్ సప్లై అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు మరియు సంబంధింత అధికారులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్సై భార్గవ్ గౌడ్



- గాయపడిన వ్యక్తికి జీవదాతగా మారిన ఎస్ఐ
- క్షతగాత్రుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి ప్రాణం కాపాడిన ప్రాణదాత.
- అమరవీరుల స్ఫూర్తితో మానవత్వం చాటుకున్న భార్గవ్ గౌడ్.

ఎల్లారెడ్డి, అక్టోబర్ 29 ( మనం న్యూస్ ): మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన నాగిరెడ్డిపేట ఎస్ఐ భార్గవ్ గౌడ్ ఆదర్శంగా నిలిచారు. ఎల్లారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి గేటు సమీపంలో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహన దారుడు ప్రమాదవశాత్తు కిందపడి, తలకు తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావంతో నిస్సహాయంగా పడి ఉన్న వ్యక్తిని గమనించిన ఎస్ఐ భార్గవ్ గౌడ్, క్షణం కూడా ఆలస్యం చేయకుండా తాను ప్రయాణిస్తున్న పోలీస్ ప్రభుత్వ వాహనాన్ని ఆపి, స్థానికుల సహకారంతో బాధితుడిని స్వయంగా తానే వాహనంలో ఎక్కించుకుని హుటాహుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స అందించడంతో బాధితుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అదే రోజు ఉదయం పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవ కళ్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎస్సు భార్గవ్ గౌడ్ పాల్గొని స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం తిరిగి నాగిరెడ్డిపేట మండలానికి వెళ్తున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుందన్నారు. ఎస్ఐ భార్గవ్ గౌడ్ చూపిన మానవతా ధోరణి, సేవా స్ఫూర్తి ప్రజల ప్రశంసలు పొందుతోంది. రక్తదానం ద్వారా జీవదానం చేసిన ఆయన, మరొకరి ప్రాణం కాపాడి నిజమైన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ప్రజలు ఆయన చేసిన ఈ మానవతా చర్యను అభినందిస్తూ ఇలాంటి అధికారులు పోలీస్ విభాగానికి గర్వకారణం అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

### ద్విచక్ర వాహనదారులు జాగ్రత్త! హెల్మెట్ మీ ప్రాణ రక్షకుడు.

ఈ సందర్భంగా ఎస్ఐ భార్గవ్ గౌడ్ ప్రజలకు సందేశమిచ్చారు. హెల్మెట్ లేకపోవడం వల్లే ఆ వ్యక్తి తలకి తీవ్ర గాయం, రక్తస్రావం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ప్రాణ రక్షణలో అది ప్రథమ కవచమని ప్రజలకు ఆయన సూచించారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్స్‌పై కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం



- బకాయిలు విడుదలకై బీఆర్ఎస్వీ మెరుపు ధర్నా

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఫీజు రియంబర్స్‌మెంట్స్ బకాయిలు విడుదలకై బీఆర్ఎస్వీ మెరుపు ధర్నా చెపట్టింది. ఈ మేరకు వారు కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టరేట్ ముకుంద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఒక్క పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ల వద్ద బిఆర్ఎస్వీ కార్యకర్తలు విద్యార్థులు ధర్న చెపట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బకాయి 8వేల కోట్ల ఫీజు రియంబర్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కమీషన్ల కోసం కాంట్రాక్టు వాళ్ళకు బిల్లులను విడుదల చేసింది?.. కానీ, 20లక్షల పైచిలుకు చదువుతున్న విద్యార్థులకు మాత్రం ఫీజు రియంబర్స్ బిల్లులు మాత్రం విడుదల చేయడం లేదని బీఆర్ఎస్వీ నేతలు ఆరోపించారు. బిల్లులు రానీ కారణంగా విద్యార్థులు మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉన్నత చదువులు కోసం వెళ్ళడానికి కాలేజీ యజమాన్యాలు విద్యార్థులను ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్ ఇస్తం అని చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆస్తులను తాకట్టు పెట్టి సర్టిఫికేట్స్ తీసుకునే పరిస్థితి ఈ రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. చరిత్రలో మొదటిసారి కాలేజీ యజమాన్యాలు ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాకపోతే రాబోయే రోజుల్లో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థిని కదిలించి సచివాలయన్ని ముట్టడి చేస్తాం అని హెచ్చరించారు. ఫీజు రియంబర్స్‌మెంట్స్ విడుదల చేసే వరకు మా పోరాటం ఆగదు అని చెప్పారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్వీ రాష్ట్ర నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సంబంధించి ఎటువంటి అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. బుధవారం కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామం జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఎం. తిరుపతి విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. వారధి సొసైటీ ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా కమాన్ పూర్ మండలం రోంపికుంట గ్రామానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న ఎం.తిరుపతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల పై విచారణ చేసిన కలెక్టర్, అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో వెంటనే సంబంధిత ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సేవలను టర్మినేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని, ఈ పథకం అమలులో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా అత్యంత కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు

- రాష్ట్ర మంత్రి వాకిట శ్రీహరి
- మొదటి విడత లో 2లక్షల 50వేల చేప పిల్లలు కోయిల్ సాగర్ ప్రాజెక్టులో విడుదల



మహబూబ్ నగర్, 29అక్టోబర్,( మనం బ్యూరో): చేపలు పెంపకం ద్వారా మత్స్యకారుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర మత్స్య, పాడి, పశు సంవర్ధక యువజన సర్వీసులు క్రీడలు శాఖ మంత్రివాకిటిశ్రీహరితెలిపారు.బుధవారం మహబూబ్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మండలం బొల్లారం గ్రామంలో కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ లో 12 లక్షల రూ.ల విలువ గల 7 లక్షల 77 వేల చేప పిల్లలకు గాను మొదటి విడత 2 లక్షల 50 వేల చేప పిల్లలను వంద శాతం సబ్సిడీతో మంత్రి వాకిటి శ్రీహరి,స్థానిక దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి,జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మత్స్య శాఖ డి.డి.ఖదీర్ అహ్మద్,మత్స్య శాఖ ఏ .డి. రాధా రోహిణి,మత్స్య సహకార సంఘాల అధ్యక్షులులతో కలిసి వదిలారు.ఈ సందర్భంగా కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సంపద అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం 123 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మక్తల్,నారాయణ పేట,దేవరకద్ర నియోజకవర్గాలను అబివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.దేవరకద్ర నియోజకవర్గం ను మొదట అభివృద్ధి కి మక్తల్ నియోజకవర్గం తో పాటు ప్రాధాన్యత నివ్వనున్నట్లు తెలిపారు.గత పాలకులు 10 సంవత్సరం లలో చేప పిల్లల ఉత్పత్తి పై దృష్టి పెట్టలేదని అన్నారు.రాష్ట్ర క్యాబినెట్ లో మొట్ట మొదటి సారి ముదిరాజ్ నైన తనకు మంత్రి పదవి ఇచ్చారని అన్నారు.తాను క్యాబినెట్ మంత్రి అయిన తర్వాత మత్స్య శాఖకు ఆర కొర గా కేటాయించిన బడ్జెట్ పెంచాలని అడిగిన వెంటనే 123 కోట్ల రూ.లు చేపల ఉత్పత్తి కి కేటాయించారని,రాష్ట్ర ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు.చెరువుల్లో చేపలు వేయడం తో పాటు చేపల సంఖ్య,చేపల రకాలు,సైజు,మత్స్య సహకార సంఘం అధ్యక్షులు,డైరెక్టర్ లు,అధికారి పేర్లు,ఫోన్ నెంబర్లతో బోర్డు ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేవరకద్ర శాసన శాసనసభ్యులు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయక గెలిచిన రెండు సంవత్సరాలలో సుమారు 500 కోట్ల రూపాయల వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. గత పాలకుల హయాంలో విధ్వంసం అయిన రాష్ట్రంలో విద్యా, ఉద్యోగాలు, ఆర్థికాభివృద్ధకి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఇచ్చిన హామీలకు కట్టుబడి పని చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్లులోపు విద్యుత్ తో పాటు పేదలకు సన్నబియ్యం, రైతులకు రుణమాఫీ, రైతుబరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# భారత్-ఆస్ట్రేలియా తొలి టీ20 వర్షార్పణం

ఐదు టీ20 సిరీస్ లో భాగంగా టీమ్ఇండియా, ఆస్ట్రేలియా మధ్య బుధవారం కాన్ బెర్రా వేదికగా తొలి మ్యాచ్ వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దైంది. కేవలం 9.4 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. మొదట టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆట నిలిచి పోయే సమయానికి భారత్ 1 వికెట్ కోల్పోయి 97 పరుగులు చేసింది. మొదట బ్యాటింగ్ కు దిగిన భారత్ ఆది నుంచి దూకుడుగా ఆడే ప్రయత్నం చేసింది. ఓపెనర్ గా వచ్చిన అభిషేక్ శర్మ తనకు దక్కిన ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. నాథన్ ఎల్లిస్ బౌలింగ్ లో (3.5) అతడు ఫీల్డర్ మీదుగా ఫోర్ కొట్టే ప్రయత్నంలో భాగంగా బంతిని గాల్లోకి లేపాడు. దాన్ని టిమ్ డేవిడ్ ఒడిసి పట్టుకున్నాడు. దీంతో అభిషేక్ 19 పరుగులకు (14 బంతుల్లో, 4 ఫోర్లు) పెవిలియన్ కు చేరాడు. దీంతో టీమ్ఇండియా తన తొలి వికెట్ ను 35 పరుగుల వద్ద కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, గిల్ తో కలిసి టీమ్ఇండియాను ముందుకు నడిపించాడు.

ఈ క్రమంలో 5 ఓవర్లు ముగిసిన తర్వాత వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. తర్వాత కాసేపటికి వాన ఆగిపోవడంతో మ్యాచ్ ప్రారంభమైంది. అయితే ఆటను 18 ఓవర్లకు కుదించారు. మ్యాచ్ తిరిగి ప్రారంభమైన తర్వాత కాసేపటికి.. సూర్యకుమార్ 18 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. జేవియర్ బ్రేట్ లెట్ బౌలింగ్ లో (7.3) అతడు ఇచ్చిన క్యాచ్ ను జోష్ ఫిలిప్ పట్టుకోలేకపోయాడు. అనంతరం మరింత జాగ్రత్తగా ఆడిన.. గిల్, సూర్యకుమార్ యాదవ్ రెండో వికెట్ కు 32 బంతుల్లోనే అర్ధశతక భాగస్వామ్యం నమోదు చేశారు. భారత బ్యాటర్లు ఇక గేర్లు మార్చి వేగంగా పరుగులు చేయాలని చూస్తున్న తరుణంలోనే 9.4 ఓవర్ల వద్ద వరుణుడు ఆటకు మరోసారి ఆటంకం కలిగించాడు. అప్పటికి టీమ్ఇండియా స్కోర్ 97/1గా ఉంది. రెండోసారి మ్యాచ్ ఆగడానికి ముందు నాథన్ ఎల్లిస్ బౌలింగ్ లో (9.3) సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన సిక్స్ బాదాడు. ఇది అతడికి టీ20ల్లో 150వ సిక్స్. అతడు 86 ఇన్నింగ్స్ ల్లో, 1649 బంతులు ఎదుర్కొని ఈ ఘనతను సాధించాడు. తర్వాత ఆటను కొనసాగించే



పరిస్థితులు లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్ ను అర్ధాంతరంగా ముగించారు. మ్యాచ్ ఆగే సమయానికి శుభ్ మన్ గిల్ (37*), సూర్యకుమార్ యాదవ్ (39*) నాటౌట్ గా నిలిచారు. రెండో టీ20 మ్యాచ్ మెల్ బోర్న్ వేదికగా.. శుక్రవారం (అక్టోబర్ 31) జరగనుంది.

## దిగజారిన గిల్ ర్యాంకు.. వన్డేల్లో నంబర్ 1 బ్యాటర్గా రోహిత్ శర్మ

ఆస్ట్రేలియాతో ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడిన రోహిత్ శర్మ అదరగొట్టాడు. మూడు వన్డేల సిరీస్ లో ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ చేసిన అతడు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సొంతం చేసుకున్నాడు. ఆ సిరీస్లో రోహిత్ ప్రదర్శనకు ఐసీసీ ర్యాంకుల్లో ఫలితం కనిపించింది. వన్డేల్లో టాప్ ర్యాంకర్ గా నిలిచాడు.



ఇప్పటివరకు అక్కడ ఉన్న కెప్టెన్ శుభ్ మన్ గిల్ రెండు స్థానాలు కిందికి దిగజారి మూడో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 781 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అఫ్గానిస్థాన్ ప్లేయర్ ఇబ్రహీం జద్రాన్ (764) రెండో స్థానంలో ఉండగా.. శుభ్ మన్ గిల్ (745), బాబర్ అజామ్ (739), విరాట్ కోహ్లీ (725) ఆ తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్ తో మూడో వన్డేలో హాఫ్ సెంచరీ చేసినప్పటికీ విరాట్ ఒక స్థానం పడిపోయాడు. అంతకుముందు రెండు మ్యాచుల్లోనూ డకౌట్ కావడమే దీనికి కారణమని క్రికెట్ విశ్లేషకుల అంచనా. శ్రేయస్ అయ్యర్ (700) టాప్ -10లో కొనసాగుతున్నాడు. ఇక ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (589) ఏకంగా 23 స్థానాలను మెరుగుపర్చుకొని 25వ ర్యాంక్ ను అందుకొన్నాడు.

### బౌలింగ్ విభాగంలో...

బౌలింగ్ విభాగంలో టీమ్ఇండియా తరఫున కేవలం ఒక్కరు మాత్రమే ఉండటం గమనార్హం. అదీనూ కుల్ దీప్ యాదవ్ (634) ఒక ప్లేస్ ను కోల్పోయి ఏడో ర్యాంకులో నిలిచాడు. ఆసీస్ పేసర్ జోష్ హేజిల్ వుడ్ (628) రెండు స్థానాలు పైకి ఎగబాకి 8వ ర్యాంకులో ఉన్నాడు. అఫ్గాన్ ఆటగాడు రషీద్ ఖాన్ (710) బౌలింగ్ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా (215) మాత్రమే ఉన్నాడు. అతడు ఆసీస్ తో వన్డే సిరీస్ లో ఆడని సంగతి తెలిసిందే. అక్షర్ పటేల్ (208) రెండు స్థానాలను మెరుగుపర్చుకొని 12వ ర్యాంకులో నిలిచాడు. ఇందులోనూ అఫ్గాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్ దే (334) టాప్ ర్యాంకర్.

# 'కంగారూ'ను జయిస్తేనే ఫైనల్‌కు..



మహిళల ప్రపంచ కప్ ఆఖరి దశకు చేరుకుంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన టీమ్ఇండియా.. ఆశించిన మేరకు ప్రదర్శన చేయకపోయినా కాస్త అదృష్టం తోడవడంతో నాలుగో స్థానంలో నిలిచి సెమీస్ కు అర్హత సాధించింది. వర్షం అంతరాయంతో టోర్నీలో ఇతర జట్లకు సంబంధించిన చాలా మ్యాచ్ లు రద్దు కాగా.. భారత్ ఏడు పాయింట్లతో నాకౌట్ దశకు క్వాలిఫై అయింది. కానీ, ఇక్కడితో సంబరపడొద్దు. అసలు సిసలు పరీక్ష ముందుంది. ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ చేరినా కప్పు కలను సాకారం చేసుకోలేకపోయిన టీమ్ఇండియా.. మూడోసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లాలంటే ముందుగా 'కంగారూ'ను జయించాలి. అక్టోబర్ 30న జరిగే రెండో సెమీ ఫైనల్ లో ఆస్ట్రేలియాను హర్మన్ ప్రీత్ సేన అమీ తుమీ తేల్చుకోనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియా ను ఓడించడం భారత్ కు అంత తేలిక కాదు. ఇప్పటికే లీగ్ దశలో కంగారూలతో జరిగిన మ్యాచ్ లో భారత్ 330 పరుగులు చేసినా లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఎల్లిస్ పెర్రీ, ఆష్లీన్ గార్డ్నర్, ఫోబ్ లిచ్ ఫీల్డ్, బెత్ మూనీలతో ఆ జట్టు బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా ఉంది. వీరంతా ఒంటిచేత్తో మ్యాచ్ ను మలుపుతిప్పగల సత్తా ఉన్నవాళ్లే. సూపర్ ఫామ్ లో ఉన్న ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ భారత్ తో సెమీస్ మ్యాచ్ కు అందుబాటులో ఉండకపోవచ్చు. ఇది భారత్ కు ఉపశమనాన్ని ఇచ్చే అంశం. బౌలింగ్ లో ప్రధానంగా అలానా కింగ్, అన్నాబెల్ సదర్లాండ్ తో భారత్ కు ముప్పుంది. సోఫీ మోలినెక్స్, ఆష్లీన్ గార్డ్ నర్ కూడా బంతితో రాణిస్తే టీమ్ఇండియాకు ఇబ్బందులు తప్పవు. సెమీస్2 కు ముందు ఫామ్ లో ఉన్న ప్రతీక రావల్ గాయంతో టోర్నీకి దూరమవడం భారత్ కు ప్రతికూలంగా మారింది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, హర్మన్ ప్రీత్ సింగ్, దీప్తి శర్మ, రిచా ఘోష్ లతో పేపర్ మీద టీమ్ఇండియా బ్యాటింగ్ విభాగం బలంగా కనిపిస్తున్నా వీరు ఏ మేరకు రాణిస్తారనే దానిపైనే భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. క్రాంతి గౌడ్, శ్రీచరణి, దీప్తి, రేణుకా సింగ్ బంతితో మెరిస్తే ఆసీస్ కు షాకిచ్చి ఫైనల్ కు దూసుకెళ్లడం ఖాయం!

మహిళల క్రికెట్లో ఇప్పటిదాకా 12 వన్డే ప్రపంచకప్ లు జరగ్గా.. భారత్ నాలుగుసార్లు సెమీస్ కు చేరింది. ప్రస్తుతం జరుగుతోన్న 13వ ఎడిషన్ లో భారత్ మరోసారి నాకౌట్ దశకు అర్హత సాధించగలిగింది. 1997లో ఆస్ట్రేలియా, 2005లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. 2005లో కివీస్ ని 40 పరుగుల తేడాతో మట్టికరిపించిన మిథాలి రాజ్ సేన.. తుది పోరులో ఆస్ట్రేలియా జోరు ముందు నిలవలేక రన్నరప్ తో సరిపెట్టుకుంది. 2017లో కప్పు గెలిచేందుకు భారత అమ్మాయిలకు మంచి అవకాశమే వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. సెమీస్ లో భీకర ఆస్ట్రేలియాను ఓడించిన భారత్.. ఫైనల్ లో ఇంగ్లాండ్ చేతిలో 9 పరుగుల తేడాతో ఓడి విశ్వవిజేతగా నిలిచే ఛాన్స్ ను మిస్ చేసుకుంది. ఇప్పుడు టైటిల్ కు మరో రెండు అడుగుల దూరంలో నిలిచిన టీమ్ఇండియా.. సెమీస్ లో 'ఆస్ట్రేలియా' గండాన్ని దాటితే.. ఫైనల్ లో ఇంగ్లాండ్ లేదా సౌతాఫ్రికాతో తలపడుతుంది.

## ఇండస్ట్రీ వదిలి వెళ్లిపోతా: రాజేంద్రప్రసాద్

'మాస్ జాతర' ఆడియన్స్ ను సర్ ప్రైజ్ చేయకపోతే తాను ఇండస్ట్రీ వదిలి వెళ్లిపోతానని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా హైదరాబాద్ లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఆ వేడుకలో రాజేంద్రప్రసాద్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. ''తెలుగు ప్రేక్షకులంటే నాకు ప్రాణం.



చాలాకాలం తర్వాత అద్భుతమైన మాస్ సినిమా రానుంది. అదే 'మాస్ జాతర'. అన్ని భావోద్వేగాలు ఉన్న చిత్రమిది. ఈ సినిమాలో ఏముంది అనేది ఇప్పుడు మీతో పంచుకోను. ఎందుకంటే మీరు దాన్ని థియేటర్ లోనే చూడాలి. ఈ సినిమా చూసి మీరు షాక్ అవకపోతే నేను సినిమా ఇండస్ట్రీ నుంచి వెళ్లిపోతాను. 'జులాయి', 'శ్రీమంతుడు', 'నాన్నకు ప్రేమతో'.. అంటూ అందరి హీరోలతోనూ పెద్ద హిట్ సినిమాలు చేశాను. ఇప్పుడు రవితేజతో ఈ చిత్రం చేశా. నాకోసం ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను రవితేజ రచయితతో అడిగిమరీ రాయించారు. ఇందులో నాకు అందరి కంటే శ్రీలీల పాత్ర నచ్చింది. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఈ చిత్రాన్ని మెచ్చుకుంటాయి'' అని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇక ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన కోలీవుడ్ హీరో సూర్యపై రాజేంద్రప్రసాద్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఎంతోమందిని చదివిస్తున్నారని, అది చాలా గొప్ప విషయమన్నారు. 48 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నానంటే అభిమానుల ప్రేమాభిమానాలతో పాటు గొప్ప రచయితలు కారణమన్నారు.

## చిరంజీవి సరసన మాళవికా!

చిరంజీవి సినిమా ప్రకటించారంటే ఆ ప్రాజెక్ట్ కు సంబంధించిన ఎన్నో వార్తలు నెట్టింట వైరల్ అవుతాయి. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఇంకా పట్టాలెక్కని ఈ చిత్రంపై సోషల్ మీడియాలో వార్తలు మొదలయ్యాయి. ఇందులో ఆయన సరసన మాళవికా మోహనన్ నటించనున్నారంటూ జోరుగా ప్రచారం సాగింది. తాజాగా వాటిపై మాళవిక స్వయంగా స్పందించారు. ఆ రూమర్స్ ను కొట్టిపారేశారు.

''బాబీ దర్శకత్వంలో రానున్న మెగా 158 (వర్కింగ్ టైటిల్) లో నేను నటించనున్నట్లు సోషల్ మీడియాలో వచ్చే వార్తలు అవాస్తవం. నా కెరీర్ లో ఒక్కసారైనా చిరంజీవి లాంటి అగ్ర కథానాయకుడితో నటించాలని కోరుకుంటున్నాను. ఆరోజు కోసం ఎదురుచూస్తున్నా. కానీ, ఈ ప్రాజెక్ట్ లో నేను భాగం కాదు'' అని స్పష్టతనిచ్చారు. దీంతో ఈ రూమర్స్ కు తెరపడింది.

ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకరవరప్రసాద్ గారు' రూపొందుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది విడుదల కానుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర' రానుంది. వీటితో పాటు శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో రెండు ప్రాజెక్ట్ లు లైనప్ లో ఉన్నాయి. ఇక మాళవిక 'ది రాజాసాబ్' తో పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## 'పచ్చబొట్టు' పాటతో పాటు ఆ సీన్లన్నీ డీలీట్ చేశాం : రాజమౌళి

బాహుబలి పార్ట్1, పార్ట్ 2 కలిసి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో రీరిలీజ్ కాబోతున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 31న ఈ చిత్రం థియేటర్స్ లో సందడి చేయబోతుంది. ఆరున్నర గంటల నిడివిని 3:45 గంటలకు కుదించి 'బాహుబలి: ది ఎపిక్'ని తీర్చిదిద్దారు. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. సినిమాలోని యాక్షన్స్ సీన్స్ అన్నింటిని కవర్ చేస్తూ ట్రైలర్ ని కట్ చేశారు. అయితే రెండు సినిమాల్లోని సగం సన్నివేశాలను తీసేస్తేనే రన్ టైమ్ 3.45 గంటలకు చేరింది. ఓ సినిమాకు ఇంత రన్ టైమ్ ఉండడం కూడా ఇదే తొలిసారి. కానీ అంతకు మించి సన్నివేశాలను డిలీట్ చేసే అవకాశం లేదని రాజమౌళి అంటున్నారు. అప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాలను లేపేశారట. అంతేకాదు సూపర్ హిట్ సాంగ్స్ ని కూడా డిలీట్ చేసినట్లు రాజమౌళి చెప్పారు.

తాజాగా ఆయన ప్రభాస్, రానాలతో కలిసి ఓ స్పెషల్ ఇంటర్వ్యూ చేశాడు. ఇందులో బాహుబలి చిత్రాల షూటింగ్ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే



బాహుబలి ది ఎపిక్ లో కనిపించని సన్నివేశాలు ఏంటో కూడా రాజమౌళి చెప్పారు. ప్రభాస్-తమన్నాల మధ్య వచ్చే ప్రేమ సన్నివేశాలను 'ది ఎపిక్'లో చూడలేమట. అవంతిక లవ్ స్టోరీ మొత్తాన్ని డిలీట్ చేసినట్లు రాజమౌళి చెప్పారు. అంతేకాదు పచ్చబొట్టేసిన, ఇరుక్కుపో, కన్నా నిదురించరా పాటలను కూడా తొలగించినట్లు రాజమౌళి పేర్కొన్నారు. యుద్ధానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను కూడా తొలగించామని రాజమౌళి అన్నారు. మొత్తంగా అవంతిక పాత్రకు సంబంధించిన సీన్లే ఎక్కువ డిలీట్ చేసినట్లు తెలుస్తోంది. పార్ట్ 1లో పచ్చబొట్టు పాటతో పాటు దానికి ముందు వచ్చే సీన్లు బాగా ఆకట్టుకున్నాయి.

## ఇండస్ట్రీకి మహేశ్ బాబు మేనకోడలు..

ఇండస్ట్రీకి మరో కొత్తందం పరిచయం కానుంది. టాలీవుడ్ లో చరిత్ర సృష్టించిన సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి ఒక హీరోయిన్ ప్రేక్షకులను అలరించనున్నారు. ఆమే.. మహేశ్ బాబు మేనకోడలు, మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్. ఎన్నో రోజులుగా ఆమె ఇండస్ట్రీకి రానున్నట్లు వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. నేడు జాన్వీ పుట్టినరోజు సందర్భంగా ఆమె రాకను అధికారికం చేస్తూ మంజుల ఫొటోలను విడుదల చేశారు. ప్రస్తుతం ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

కుమార్తె తెరంగేట్రంపై మంజుల ఆనందం వ్యక్తంచేస్తూ ఆమెను ఆదరించాలని కోరారు. జాన్వీ గతంలో 'మనసుకు నచ్చింది'లో బాలనటిగా అతిథి పాత్రలో కనిపించారు. ఆ సినిమాకు మంజుల దర్శకత్వం వహించగా మహేశ్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. 2018లో ఇది విడుదలైంది. ఇక తాజాగా ఆమె హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వనుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. జాన్వీ ఘట్టమనేని నటించనున్న ప్రాజెక్ట్ కు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.



## 'మహాకాళి' రక్తంతో తడిసిన చేయి..

'హనుమాన్' తర్వాత ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి వరుస ప్రాజెక్టులను ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి 'మహాకాళి'. ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ స్టోరీ , స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. దర్శకురాలు పూజ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఇందులో భాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్ర పోషిస్తున్నాడు. త్వరలోనే ఈ చిత్రం నుంచి మరో అప్ డేట్ రాబోతుంది. అక్టోబర్ 30న ఉదయం 10:08 గంటలకు 'మహాకాళి' నుంచి ఏదో పవర్ ఫుల్ అప్ డేట్ రిలీజ్ చేయనున్నట్లు టీమ్ ప్రకటించింది.

ఈ అనౌన్స్మెంట్ తో పాటు రిలీజ్ చేసిన పోస్టర్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ఇందులో రక్తంతో తడిసిన ఓ చేయి, దానికి నిండుగా బంగారు గాజులు ఉన్నాయి. నల్లటి నేలపై ఒక ఆయుధం పట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు చూపించారు. ఆ పోస్టర్ పై అంతం లేని వినాశన జ్వాల మేల్కొంది అనే క్యాప్షన్ ఇచ్చారు.

ఈ పోస్టర్ చూస్తుంటే.. సినిమాలోని కాళిమాతా లుక్ లా కనిపిస్తోంది. ఆమెను చాలా పవర్ ఫుల్ గా చూపించబోతున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతుంది. అయితే టైటిల్ రోల్ ఎవరు చేస్తున్నారనేది ఇంతవరకు రివీల్ చేయలేదు. రేపు ఇచ్చే అప్ డేట్ లో ఈ విషయం తెలియజేస్తారా? లేదా? అనేది తెలియాలంటే మరికొన్ని గంటలు ఆగాల్సిందే. కాగా, ఈ చిత్రంలో శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా నటించబోతున్నాడు. ఆయన ఫస్ట్ లుక్ ని కూడా రిలీజ్ చేశారు. ఇండియాలోనే తొలి లేడీ సూపర్ హీరో మూవీగా మహాకాళి రానుంది.



# లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మొంథా తుఫాన్ తో ప్రభావం భారీ వర్షాలు
- జిల్లాలో మూడు బృందాలతో నిరంతర పర్యవేక్షణ
- శిథిలావస్థ భవనాలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- రైతులకు ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు అందజేశాం
- అత్యవసరమైన సంప్రదించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- గ్రామ మండల పట్టణ స్థాయిలో అధికారుల పర్యవేక్షణ




**సూర్యాపేట అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** మొంథా తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న ఈ పద్యంలో ప్రజలను అప్రమత్తంగా ఉండెలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం .సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో కురుస్తున్న వర్షాలపై కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నందున నేడు జిల్లాలోని పాఠశాలకు సెలవు ప్రకటించ మని జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేయడం జరిగిందని అన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తే తాత్కాలికంగా వాహనాల రాకపోకలు ముసి వేసామని అన్నారు. అలాగే నదులు, చెరువులు, కాలువల వద్ద ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసు,రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణ చేస్తూ ప్రజలను అటువైపు వెళ్ళకుండా చూడడం జరుగుతుందని తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ సిబ్బందితో ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వారిని అప్రమత్తం చేయడం జరిగిందని గ్రామాలలో,పట్టణాలలో క్షేత్ర స్థాయి లో పర్యటించి శిదిలావస్థలో ఉన్న 3 ఇండ్లను గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని స్పష్టం చేసారు.మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు కార్య స్థానంలో ఉంటూ ఏలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.సోమవారం సాయంత్రం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వి సి ద్వారా తుఫాన్ లపై ముందస్తు జాగ్రత్తలపై సూచనలు చేసారని అదే రోజు సాయంత్రం అధికారులను ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అప్రమత్తం చేశామని మంగళ వారం అధికారులు అందరు క్షేత్ర స్థాయి లో పర్యటనలు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి ఉంచేలా ప్రజలను అప్రమత్తం చేసారని, రైతులు కూడా అధికారులకు ఎక్కడికి అక్కడ సహకరిస్తున్నారని కలెక్టర్ చెప్పుకొచ్చారు.జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల సహాయార్థం కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 6281492368 ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడ అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని ప్రజల నుండి ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి తక్షణమే సహాయక చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు సూర్యాపేట, కోదాడ,హుజూర్నగర్ లో మూడు అందుబాటులో ఉన్నాయని, ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం అందుబాటులో ఉందని అత్యవసర సమయంలో వెంటనే స్పందించుటకు జిల్లా అధికార యంత్రాంగం సిద్దంగా ఉందని కలెక్టర్ తెలియజేశారు.

# బీసీ రిజర్వేషన్ సాధన విజయవంతం చేయాలి




**సూర్యాపేట అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 9వ షెడ్యూల్లో చేర్పించాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నవంబర్ 1న హైదరాబాద్లో జరిగే సదస్సు విజయవంతం చేయాలని తెలంగాణ యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నారబోయిన కిరణ్ జన సమితి జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ....దశాబ్దాలపాటు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ .కేవలం భౌతిక సరిహద్దులకోసం మాత్రమొకాదు . ఆంధ్ర అధిపతి శక్తులను వెళ్లగొట్టి తెలంగాణ ఆధిపత్య శక్తులుకు అధికారం కట్టబెట్టడం కొరకు కాకుండా సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వ సాధన కొరకు సామాజిక ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణం కొరకు సంపద , విద్య ఉద్యోగ రాజకీయ అవకాశాలు అందరికీ అందించుటకోరకు అని కానీ తొలి తెలంగాణ టిఆర్ఎస్ ప్రభుత్వం ఆ వైపుగా ప్రయత్నాలు చేయకుండా బీసీలకు ఉన్న రిజర్వేషన్ తగ్గించిందని విమర్శించారు. భారత ప్రజాస్వామ్యం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం.కానీ చాలా ఏళ్లుగా మెజారిటీగా ఉన్న ప్రజలకు చట్టసభల్లో, పాలనలో ప్రాతినిధ్యమే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆ పరిస్థితిని చక్కదిద్ది చేయాల్సిన బాధ్యత పాలకుల మీద ఉన్నదిఅని. భారతదేశంలో ఉన్న నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ కొన్ని వర్గాల ప్రజలను విద్యా, ఆర్థిక రాజకీయాల నుండి దూరంగా ఉంచిందనీ అందుకనే కొందరు మాత్రమే ఈ రంగాల్లో ముందౌజ లోఉన్నారు కావున ఇప్పటివరకు దూరం నెట్టివేయబడ్డ శక్తులు ముందుకు రావడానికి కల్పించే ప్రత్యేక అవకాశమే రిజర్వేషన్లు ఇది భారత రాజ్యాంగం ద్వారా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన అవకాశం అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4) 16 ( 4) లు సామాజిక న్యాయసాధనకు రాజ్యాంగం కల్పించిన సాధనాలు అన్నారు. సామాజిక , నిర్మాణమే తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనలో ఒక మెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మేనిఫెస్టోలో పెట్టింది నిర్వహించి అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టింది.అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదించాయి. కానీ కానీ కేంద్ర ప్రభుత్వ కుయుక్తి రాజకీయాల్లో మరియు కోర్టుల న్యాయ పరీక్షలో ఇరుక్కుపోయింది మన రిజర్వేషన్ల బిల్లు. ఈ బిల్లుకు న్యాయపరమైన రక్షణ దొరకాలంటే రాజ్యాంగ సవరణ ద్వారా షెడ్యూల్ తొమ్మిదిలో చేరుస్తూ పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టి చట్టం చేయాల్సిన ఆవశ్యకత ఉంది .కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మొండి గా వ్యవహరిస్తూ బిల్లును ప్రవేశ పెట్టడం లేదు కానీ స్థానికంగా ఉన్న బిజెపి నాయకులు మాత్రం మేం బిల్లుని సమర్థిస్తున్నాం అని చెబుతున్నారు . ఈ ద్వంద వైఖరీ విడనాడి పార్లమెంట్లో తక్షణమే బిల్లు ప్రవేశపెట్టాల్సిన బాధ్యత ఆ పార్టీ పైనే ఉందిఅన్నారు. ఈ సమస్యకు పరిష్కారం రాజ్యాంగ ప్రక్రియ ద్వారా మాత్రమే జరుగుతుంది ఆ రాజకీయ రాజ్యాంగ ప్రక్రియను చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం లోని బిజెపి మీద ఉన్నదిఅన్నారు. సామాజిక తెలంగాణ నిర్మాణంలో ఈ రిజర్వేషన్లు ఒక అడుగు వేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి లీగల్సేల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ నాయక్ కార్యదర్శి భాష బోయిన వేణు రాజు పట్టణ మైనార్టీ సెల్ కన్వీనర్ ఫర్ యుద్దీన్ బీసీ సెల్ నాయక్ జెడ్మెల మునిష్ నాయుడు ప్రవీణ్ విష్ణు పవన్ పాల్గొన్నారు.



## తుఫాను ప్రభావంతో రాకపోకలు బంద్

**చింతలపాలెం, అక్టోబర్ 29 ( మనం న్యూస్):** మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, డొంకలు, మరియు కాలువలు పొంగి పొర్లుతుండడంతో గ్రామంలోని కొన్ని ప్రాంతాలు నీట మునిగిపోయి ప్రజలు రాకపోకలు సాగించుటకు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు మరియు ఊరిముందు ఉన్న ఎర్ర వాగు బ్రిడ్జి పై నుండి నీరు ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బ్రిడ్జిపై నుండి ఎవరు వెళ్లకుండా మేళ్లచెరువు ఎస్ఐ పరమేష్ పోలీసులను ఏర్పాటు చేసినారు ఈ యొక్క వరద తీవ్రతను పరిశీలించుటకు గాను కోదాడ రూరల్ సిఐ ప్రతాప లింగం మరియు చింతలపాలెం ఆర్ ఐ సోమయాజులు , గ్రామ కార్యదర్శి సైదులు పరిస్థితిని సమీక్షించారు

# భారీ తుఫాన్ ప్రజలు జాగ్రత్తగా ఉండండి

**తిరుమలగిరి అక్టోబర్ 29(మనం న్యూస్):** మొంథా తుఫాన్ వల్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల ప్రజల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని ఎస్సై వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటితో నిండిన రహదారులు,వాగులు దాటవద్దని, వరద నీళ్లు ఇంట్లోకి ప్రవేశించే అవకాశం ఉంటే ముందుగానే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లలను వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. కరెంట్ షాక్ వచ్చే ప్రమాదం ఉన్నందువలన విద్యుత్ పోల్స్ ను తాకరాదని, వాటి దగ్గరకు కూడా వెళ్ళవద్దని, ఇల్లు చుట్టుపక్కల నీరు నిలువ ఉండకుండా డ్రైనేజీలను శుభ్రం చేసుకోవాల్లని,భారీ వర్షాలు నేపథ్యంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందువలన చెట్ల కింద, ఖాళీ ప్రదేశాలలో నిలబడి ఉండరాదని తెలిపారు.

మండల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసువారి సూచనలను పాటిస్తూ భారీ వర్షాలకు సంబంధించి ఏమైనా అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే పోలీస్ వారికి సమాచారం తెలియజేయాలని సూచించారు.



# భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసి



**వలిగొండ, అక్టోబర్ 29(మనం న్యూస్):** మంగళవారం తెల్లవారుజాము నుండి కురుస్తున్న భారీ వర్షం కారణంగా మూసి ఉధృతంగా వహిస్తుంది వలిగొండ మండలం సంగెం భీమలింగం వద్ద బ్రిడ్జిపై నుండి భారీ వరద ప్రవహిస్తుంది హైదరాబాద్ నుండి వస్తున్న వరద పెద్ద ఎత్తున మూసిలో కలవడంతో పరవళ్ళు తొక్కుతుంది మూసి ఉధృతంగా పారుతుండడంతో బొల్లెపల్లి సంగం గ్రామాల మీదగా పోలీసులు పూర్తిగా రాకపోకలను నిలిపివేశారు ఎస్సై యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎవరు కూడా బయటికి రావద్దని కోరారు అదేవిధంగా పురాతన ఇండ్లలో కూడా ఎవరు ఉండకూడదని ఇంకా తడిసిన స్తంభాలను ఆనుకోవద్దని చేపల కోసం కూడా చెరువులలోకి ఎవరు వెళ్ళవద్దని అన్నారు ఇంకా మూసి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కోరారు

# జాతి సమైక్యతను చాటి చెప్పిన సర్దార్ వల్లభాయ్ పటేల్






**సూర్యాపేట, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ని పురస్కరించుకొని ప్రజలలో జాతీయ సమైక్యతను దేశభక్తిని పెంపొందించేందుకుగాను, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ ఎన్ఎస్ఎస్ సహకారంతో సర్దార్ 150 యూనిట్ మార్చ్ ను నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ సభ్యులు కేసరి దేవ్ సిన్హ జ్వాల తెలిపారు.సర్దార్ 150 యూనిటీ మార్చ్ కార్యక్రమం అమలులో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జిగా నియమితులైన ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నల్గొండ, సూర్యాపేట జిల్లాల అధికారుల తో కలిసి మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ....సర్దార్ 150 యూనిటీ మార్చ్ కార్యక్రమంలో భాగంగా జాతీయసమైక్యత,దేశభక్తి ని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర , జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.ఇందులో భాగంగా ఈనెల 31 నుండి నవంబర్ 25 వరకు జిల్లాలలో విడతలవారీగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, సర్దార్ 150 యూనిటీ మార్చ్ లో 3 రోజుల పాదయాత్రను జిల్లాస్థాయిలో నిర్వహించాలని, ప్రతి పాదయాత్ర 8 నుండి 10 కిలోమీటర్లు ఉండేలా చూడాలని, ఈ పాదయాత్రలో కనీసం 500 మంది యువత, విద్యార్థులు పాల్గొనేలా చూడాలని ఎంపీ అధికారులతో కోరారు. సర్దార్ 150 యూనిటీ మార్చ్ నిర్వహించడంలో భాగంగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అధికారులతో కోర్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని , ఇందులో విశ్రాంత ఐఏఎస్ అధికారులు, జిల్లా యువజన సర్వీస్ల అధికారి, ఇతర అధికారులు, ప్రతినిధులతో కో-ఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ విషయమై ప్రతివారం జాతీయ స్థాయి కోర్ కమిటీ సమీక్షలు నిర్వహిస్తున్నదని వెల్లడించారు.

సర్దార్150 యూనిటీ మార్చ్ కార్యక్రమాలలో భాగంగా జిల్లా స్థాయిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితానికి సంబంధించి ప్రజలకు,యువతకు తెలియజేయడం, వైద్య శిబిరాల నిర్వహణ ,యోగ క్యాంపులు, ఎగ్జిబిషన్లు, వర్క్ షాప్ ల నిర్వహణ ,కళాశాల,పాఠశాల విద్యార్థులకు డిబేట్,ఇతర కాంపిటీషన్ల నిర్వహణ, వీధి నాటకాలు, ప్రచారాలు, స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు.ఇందుకుగాను ఆయా జిల్లాల వారీగా రూట్ మ్యాప్ ను రూపొందించాలన్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో నవంబర్ 12, 13 తేదీలలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాల్సింది గా జిల్లా యంత్రాంగాన్ని కోరారు.ఇదే అంశంపై అదనపు కలెక్టర్ కే సీతారామారావు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... ఎంపీ, రాజ్యసభ సభ్యులు కేసరి దేవ్ సిన్హ జ్వాల ,కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో సర్దార్ 150 యూనిట్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదనపు ఎస్పీరవీందర్ రెడ్డి ,జిల్లా క్రీడల అధికారి వెంకట్ రెడ్డి,జిల్లా యూత్ అధికారి రాజేష్, జెడ్పి సీఈఓ అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా ఇంటర్ మీడియేట్ అధికారి భాను నాయక్, డి ఎం హెచ్ ఓ చంద్రశేఖర్,మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ఆర్డిఆర్ అస్తికలు నిమర్జనం




**సూర్యాపేట, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** మాజీమంత్రి కీర్తిశేషులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అస్థికలను గోదావరి నదిలో కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి నిమజ్జనం చేశారు.బుధవారం భద్రాచలం క్షేత్రంలోని గోదావరి నదిలో కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తో పాటు కుటుంబ సభ్యులు అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా గోదావరి నదిలో అస్థికలను నిమజ్జనం చేశారు.కార్యక్రమంలో దామోదర్ రెడ్డి సోదరులు గోపాల్ రెడ్డి క్రిష్ణా రెడ్డి .వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్. శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగారామకృష్ణ ఎన్నిక

**భద్రాచలం, అక్టోబర్ 29 (మనం న్యూస్):** పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యర్యంలో స్థానిక ఆర్య వైశ్య సత్రం నందు జరిగిన సమావేశంలో పట్టణ ఆర్య వైశ్య సంఘంనకు కొత్త గా కమిటీని నియమించుకోవడం జరిగినది. అధ్యక్షులుగా కొత్తా రామకృష్ణ , ప్రధాన కార్యదర్శి గా చెంచు సుబ్బారావు, కోశాధికారి గా యండూరి వీరభద్రం ని ఎన్నుకోవడం జరిగినది. అధ్యక్షలు రామకృష్ణ మాట్లాడుతూ ఈ నవంబర్ 16వ తేదీన కార్తిక మాసం సందర్భగా ఆర్య వైశ్య వన సమారాధన ఘనముగా నిర్వహిస్తాము అని తెలిపినారు.ఈ కార్యక్రమంలో యశోద రాంబాబు .ప్రభాకర్ గుప్తా,కంభంపాటి సురేష్,యశోద నగేష్,భండారు



కృష్ణయ్య, పద్మనాభుని ,వాసు,రేపాక రాంబాబు, ఆర్య వైశ్య సంఘం పెద్దలు,సభ్యులు పాల్గొన్నారు.



## చిన్నారులను ఆశీర్వదించిన వట్టె

**సూర్యాపేట, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** పేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట ఫంక్షన్ హాల్ లో జరిగిన మోదాల నాగరాజు యాదవ్ రేణుక గార్ల కుమార్తె కుమారుని నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం లో భాగంగా బుధవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టి జానయ్య యాదవ్ చిన్నారులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో కుంభం నాగరాజు, మీర్ అక్బర్,వల్లాల బుచ్చయ్య యాదవ్, పాల్గొన్నారు.

# బిఎన్ పోరాట ఫలితమే ఎస్సారెస్పీ రెండవ దశ




**సూర్యాపేట అక్టోబర్ 29 (మనం ప్రతినిధి):** మాజీ ఎంపీ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీమ్ రెడ్డి నరసింహారెడ్డి పోరాట ఫలితమే శ్రీరాంసాగర్ రెండవ దశ ముఖ్యమంత్రి ప్రకటనను వెనుకకు తీసుకొని వెంటనే బి.యన్.రెడ్డి పేరు నామకరణం చేయాలి. ఎం సి పి ఐ (యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి రాష్ట్ర ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కృష్ణ గోదావరి నది జలాల అను సంధానకర్త భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత సామాజిక న్యాయ రథసారథి విప్లవాల ఎర్ర సూర్యుడు కరివిరాల కొత్తగూడెం ఎర్రజెండా ముద్దుబిడ్డ శ్రీరాంసాగర్ రెండవ దశ సాధన సాధించిన పోరాటాల భీముడు ఎం సి పి ఐ (యు) పోలిటి బ్యూరో సభ్యులు అమర జీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి మాజీ పార్లమెంట్ సభ్యులు పేరును శ్రీరామ్ సాగర్ రెండవ దశ కాలువకు నామకరణం చేయాలని ఎం సి పి ఐ యు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ది:-29-10-2025 రోజున యంసిపిఐ(యు) సూర్యాపేట జిల్లా కమిటీ సమావేశం బుధవారం కామ్రేడ్ ఏపూరి సోమన్న అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ... బి.యన్ రెడ్డి సాయుధ పోరాటం నుండి మొదలుకొని రెండుసార్లు ఎమ్మెల్యేగా మూడుసార్లు ఎంపీగా 25 సంవత్సరాలు ప్రజా ప్రతినిధిగా ఎన్నికై చట్టసభలలో ప్రజల పక్షాన ప్రాతినిధ్యం వహించి తన యొక్క కంచు కంఠాన్ని అసెంబ్లీ పార్లమెంటులో వినిపించి ప్రజలకు సాగునీరు తాగునీరు అందించాలని స్పష్టం చేశారు.పరితపించి ప్రజా ఉద్యమాలను నిర్మించి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టించి కాల్వ కోసం బడ్జెట్ కేటాయింపు చేసి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి కాలువను సర్వే చేయించి అధికారులతో చర్చలు జరిపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 1996 మార్చి ఆరో తారీఖున ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మిర్యాలగూడ ఎంపీగా ఉన్న బి.యన్.రెడ్డి స్వయంగా దగ్గర ఉండి తుంగతుర్తి నియోజకవర్గ తిరుమలగిరి మండల ప్రగతి నగర్ పనిగిరి వద్ద స్వయంగా దగ్గర ఉండి కాలువకు శంకుస్థాపన చేయించిన వీరుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి ,1999 సంవత్సరము దామోదర్ రెడ్డి శిలాఫలకం వద్ద రక్త తర్పణం చేశారని వెంకన్న గుర్తు చేశారు ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రులతో నీటిపారుదల శాఖ మంత్రులు కడియం శ్రీహరి ,పొన్నాల లక్ష్మయ్య గార్లతో అనేకసార్లు చర్చలు జరిపి ఉత్తరాలు రాసి మైలారం స్టేజి వద్ద మండుటెండలు సదస్సులు రాస్తారోకోలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి గోదావరి నీరు చూసి తీరుతానని పరితపించి 2008 మే 9 వ తేదీన మరణించారని మే 16న సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన బి.ఎన్.రెడ్డి సంతాప సభలో ఆనాటి హోంశాఖ మంత్రి జానారెడ్డి మాజీ మంత్రి దామోదర్ రెడ్డి గారు ప్రభుత్వం తరపున ఎస్సారెస్పీ కాలువకి బి.యన్ రెడ్డి గారు పేరు పెడతామని ప్రకటించిన విషయం ప్రజలు మర్చిపోలేదని గాదగోని రవి గుర్తు చేశారు

గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో అనేకసార్లు ఉమ్మడి జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి కి తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్ కి కాలువకు భీమిరెడ్డి పేరు పెట్టాలని వినతిపత్రాలు ఇవ్వటం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు గారు బి.యన్.రెడ్డి వర్ధంతి సభలో హాజరై అసెంబ్లీలో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి శ్రీరామ్ సాగర్ రెండవ కాలువకు భీమిరెడ్డి పేరు పెట్టిస్తానని హామీ ఇచ్చారని వెంకన్న తెలిపారు

రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి దినకర్మలకు వచ్చిన ముఖ్యమంత్రి గారు తొందరపడి కాలువకు దామోదర్ రెడ్డి పేరు ప్రకటించారని పునర్ ఆలోచించి ఆ ప్రకటనను వెనక్కి తీసుకొని శ్రీరామ్ సాగర్ రెండవ దశ కాలువకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు నామకరణం చేయాలని ప్రభుత్వానికి గాదగోని రవి విజ్ఞప్తి చేశారు . అలాగె సూర్యాపేట జిల్లా కు బి యన్ పేరు పెట్టాలని, ట్యాంక్ బండ్ పై కామ్రేడ్ బి యన్ గారి విగ్రహం పెట్టాలని, హైదరాబాద్ లో బి యన్ స్మారక విజ్ఞాన కేంద్రం నిర్మాణం చేయాలని, తెలంగాణ కే వన్నె తెచ్చిన మహానుభావుడు కామ్రేడ్ బి యన్ పేరు భవిష్యత్ తరాలకు అందించటానికి, పాఠ్యాంశాల లో బి యన్ చరిత్ర చేర్చాలని అపుడు మాత్రమే ఈ ప్రభుత్వంలకు ఒక సార్థకత ఉంటుంది అని అన్నారు.

ఈ సమావేశం లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్స్ వల్లెపు ఉపెందర్ రెడ్డి,వరికుప్పల వెంకన్న, జిల్లా కార్యదర్శి యస్ కే నజీర్, జిల్లా నాయకులు నల్లూరి రమేష్, లింగం పల్లి రాజు, మారపాక ఉగ్రయ్య, బచ్చు కోటయ్య, లింగం పల్లి ఓంకార్, నర్సయ్య పాల్గొన్నారు.

# వర్షాల దృష్ట్యా ప్రజలు, రైతులు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- తుపాను ప్రభావంతో రైతులు నష్టపోకుండా చూడాలి
- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



హనుమకొండ, అక్టోబర్ 29 (మనం ప్రతినిధి): వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ చేసిన నేపథ్యంలో... క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి వరంగల్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ తో జిల్లా అధికారులతో మంత్రి మాట్లాడుతూ.. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల... రైతులకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయ, మార్కెటింగ్, రెవిన్యూ, డి ఆర్డీ ఓ సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉంటూ అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.పునరావస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసి ప్రజలకు తరలించేలా పూర్తి సన్నదతో ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లోని అన్ని చెరువులు నిండి ఉన్నందున, ఆయా లోతట్టు ప్రాంతాల్లో ముందస్తుగా పునరావస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా మండల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ముఖ్యంగా తాసిల్దారులు, ఆశా వర్కర్లు, అంగన్వాడి వర్కర్లు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జలమయమయ్య ప్రాంతాలలో నిర్వాసితులైన ప్రజలకు భోజనం, వృద్ధులకు పండ్లు, పిల్లలకు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేయాలన్నారు. చెరువులు నిండి వంకలన్నీ ఉధృతంగా ప్రవహించనున్న నేపథ్యంలో తాసిల్దార్లు, ఎంపీడీవోలు తమ మండల పరిధిలోని లు గ్రామాలు జల మాయమయ్యే ప్రాంతాల్లో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పర్యవేక్షిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద సంకేత బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా వరద ఉద్ధ ృతితో రోడ్లు తెగిపోయిన ఉధృతంగా ప్రవహించిన ఆయా ప్రాంతాల్లో ఆ గ్రామ ప్రజలు వెళ్లవద్దని బ్యారికలు ఇతర పరికరాలు ఏర్పాటు చేసి ప్రమాదాల బారిన పడకుండా చూడాలన్నారు.

వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ్యే అవకాశం ఉంటుందని, కావున రోడ్డు రవాణా విద్యుత్ సరఫరా లో అంతారం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ, విద్యుత్, రోడ్ల భవనాల శాఖ అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు

చెరువులు కుంటలు లోని నీటిమట్టలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేస్తూ క్లోరినేషన్ చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు వారి వారి పరిధిలోని చెరువులను నిత్యం పర్యవేక్షిస్తూ ఏదైనా అత్యవసర మరమ్మతులు ఉన్నచో యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పారిశుద్ధ్య ఆరోగ్య సమస్యల పరంగా మరింత క్లిష్టమైనవి అని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ముంపు సమస్యలపై శ్రద్ధ వహించాలన్నారు ఏమైనా అత్యవసర పరిస్థితులను తన దృష్టికి గాని జిల్లా కలెక్టర్ల దృష్టికి గాని తీసుకురావాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. అత్యవసర సహాయం కొరకు ప్రజలు వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టరేట్ 1800 425 3424, 9154225936, 1800 425 1115 గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 1800 425 1980, 9701999676 , విద్యుత్కు సంబంధించిన సమస్యలను పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 1800 425 0028 ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించాలని మంత్రి కొండా సురేఖ కోరారు.

# తుపాన్‌ను జాతీయ విపత్తుగా ప్రకటించి అన్ని విధాల ఆదుకోవాలి

## బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



పర్వతగిరి , అక్టోబర్ 29 ( మనం న్యూస్): మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా దంచి కొడుతున్న భారీ వర్షాలతో చేతికొచ్చిన పంటలు నేలపాలు కావడంతో రైతాంగానికి కోలుకోలేని అపారమైన నష్టం వాటిల్లిందని దీన్ని జాతీయ విపత్తుగాగుర్తించి పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి, రక్తాన్ని చెమటగా మార్చి రైతు కూలీలు పండించిన వరి నేల పాలు అయిందని, పత్తి తడిసి ముద్దయిందని, మొక్కజొన్న, కంది మొదలైన పంటలు సర్వనాశనమైనాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక విధాలుగా ఇబ్బందులకు గురై నష్టపోయిన సన్న, చిన్న కారు రైతులకు ఈ ప్రకృతి బీభత్సం సృష్టించిన నష్టం ఇంత అంతా కాదన్నారు. అనేక లోతట్టు ప్రాంతాలుజలమయమైనాయని పేదల ఇళ్లల్లోకి నీరు ప్రవేశించి ఇంట్లోని బట్టలతో సహా నిత్యవసర వస్తువులన్నీ తడిసి పాడైనాయని, అనేక ఇండ్లు దెబ్బతిన్నాయని, సర్వస్వం కోల్పోయిన వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులైన వ్యవసాయ కూలీలు చేతివృత్తుల వారు అసంఘటిత రంగ కార్మికులు పనులు కోల్పోయి ఇబ్బందుల పాలౌతున్నారన్నారు . ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన భారీ వర్షాలతో జరిగిన నష్టాల వివరాలను సేకరించి వారిని అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బాధిత కుటుంబాలకు తాత్కాలిక సహాయంగా 20వేల రూపాయలు , 50 కిలోల బియ్యం ఉచితంగా అందించాలని వెంకట్రాములు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# సైకిల్ రైడర్స్‌లో జోష్ నింపిన పోలీస్ కమిషనర్



హనుమకొండ, అక్టోబర్ 29(మనం ప్రతినిధి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని నిర్వహించిన సైకిల్ ర్యాలీలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తో పాటు, యువత, విద్యార్థులు,చిన్నారులు, వృద్దులు,పోలీసులు ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో వరంగల్ పోలీస్ కమిషనర్తో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ తో పాటు చాహత్ బాజ్ పాయి, ఎన్.డి.పి సి.ఎల్ సి యం డి వరుణ్ రెడ్డి, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ పాల్గొన్న ఈ ర్యాలీ కి అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్ పచ్చా జెండా ఊపి ఈ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి అంబేద్కర్ సెంటర్, ఆదాలత్ సెంటర్, హన్మకొండ కలెక్టర్ కార్యాలయం నుండి తిరిగి ఇదే మార్గం నుండి నక్కలగుట్ట మీదగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయమునకు చేరుకున్నారు. ఈ ర్యాలీ వరంగల్ పోలీస్ కమిషనర్ సైకిలింగ్ రైడర్స్తో కల్సి పోలీస్ అమర వీరులకు జోహర్లు నినాదాలు చేస్తు రైడర్స్ ను ఉత్సహపర్చారు. అనంతరం ఈ సైకిల్ ర్యాలీ పాల్గొన్న సైకిల్ రైడర్లకు పోలీస్ అధికారుల చేతుల మీదుగా సర్టిఫికేట్లను ప్రధానం చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు సైకిలింగ్ చేయడం ద్వారా మరింత ఆరోగ్యంగా వుండటంతో పాటు, రోజంతా ఉత్సహంగా తమ విధుల్లో రాణించవచ్చని, ప్రతి ఒక్కరు సైకిలింగ్ కోసం కొద్ది సమయాన్ని కేటాయించడం ద్వారా ఆరోగ్య సమస్యలు దూరం కావచ్చని, అలాగే పోలీస్ అమరవీరులను స్మరిస్తూ నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పోలీస్ అమరవీరుల కుటుంబాలతో పాటు, పోలీసుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, ఎన్.డి.పి సి.ఎల్ సి యం డి మాట్లాడుతూ నిత్యం సైకిలింగ్ చేయడం మన ఆరోగ్యాన్ని పరక్షించుకోవచ్చని,సైకిలింగ్ చేయడం రోజు వారి అలవాటుగా మార్చు కోవాలని తెలిపారు. ఈ ర్యాలీలో అదనపు డిసిపి లు, శ్రీనివాస్, ప్రభాకర్, బాలస్వామి, ఏ ఎస్పీ శుభం, ఏసిపిలు జితేందర్ రెడ్డి, నర్సింహా రావు, అనంతయ్య, నాగయ్య, సత్యనారాయణ, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఏ.జే పెడల్స్ యాజమాన్యం, ట్రైసిటి సైకిల్ రైడర్స్, పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నిట్ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.



# ఖిలావరంగల్లో తహసీల్దార్ పర్యటన

హనుమకొండ అక్టోబర్ 29 ( మనం ప్రతినిధి): ఖిలావరంగల్ మండల తహసీల్దార్ ఇక్బాల్ కుండపోత వర్షంలో బుధవారం లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వరద ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమస్యలను స్వయంగా పరిశీలించి, ప్రజలతో మాట్లాడి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రజలకు ఏదైనా అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడే బయటకు రావాలని సూచించిన ఇక్బాల్, ప్రభుత్వం మరియు అధికారులు ప్రజలకు అండగా ఉన్నారని తెలిపారు. వాగులు, చెరువులు, లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తూ సిబ్బందికి తగిన సూచనలు అందించారు. ఈ పర్యటనలో ఆర్ఐ కీర్తన్, జూనియర్ అసిస్టెంట్లు వంశీ, శివ, జిపిఓ సుభాష్ పాల్గొని ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు.

# కన్న పేగు కొడుకు ప్రాణం కోసం కిడ్నీ ఇచ్చిన తల్లి

- చివరికి తల్లిని భార్య బిడ్డలను వదిలి వెళ్లిన బిడ్డ
- డిశ్చార్జి అయిన రోజే పరలోకాలకు తీసుక వెళ్లిన యముడు
- ఈ బాధ మరే తల్లిదండ్రులకీ రావద్దు
- పర్వతగిరి మండలం వడ్లకొండలో విషాద గాధ ఘటన..





పర్వతగిరి అక్టోబర్ 29 ( మనం న్యూస్ ): పర్వతగిరి మండలం, వడ్లకొండ గ్రామంలో చోటుచేసుకున్న ఓ హృదయ విదారక సంఘటన అందరినీ కంటతడి పెట్టించింది. తన ప్రాణ సంతానం బతకాలనే తపనతో తల్లి తన కిడ్నీని దానం చేసినా, చివరికి విధి వేరేలా వ్రాసింది. తల్లికి త్యాగం వృథా అయ్యింది. కొడుకు ప్రాణం కోల్పోయాడు.వడ్లకొండ గ్రామానికి చెందిన చింతకాయల జంపయ్య, సోమక్క దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో రెండవ కుమారుడు నాగరాజు గత కొన్నేళ్లుగా హైదరాబాద్లో చికెన్ షాప్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్ని నెలల క్రితం అనారోగ్యానికి గురవడంతో వైద్యులను సంప్రదించిన నాగరాజుకు రెండు కిడ్నీలు పనిచేయడం లేదని నిర్ధారణ అయ్యింది. డయాలసిస్ చికిత్స ప్రారంభించినా, ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో వైద్యులు కిడ్నీ మార్పిడి (ట్రాన్స్ప్లాంట్) మాత్రమే మార్గమని సూచించారు.కొడుకును కాపాడుకోవాలనే తపనతో తల్లి సోమక్క ముందుకు వచ్చి తన కిడ్నీని దానం చేయడానికి సిద్ధమైంది. అవసరమైన పరీక్షలు పూర్తయ్యాక వైద్యులు తల్లి కిడ్నీని కొడుకుకు మార్చి ట్రాన్స్ప్లాంట్ శస్త్రచికిత్స నిర్వహించారు. చికిత్స అనంతరం తల్లి, కొడుకులు ఇద్దరినీ డిశ్చార్జ్ చేశారు. అయితే దురదృష్టవశాత్తూ, డిశ్చార్జ్ అయిన రోజు రాత్రి నాగరాజు అకస్మాత్తుగా మృతి చెందాడు. ఈ విషాద వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు తాళుకోలేక రోదించారు. తల్లి తన శరీర భాగం ఇచ్చి కూడా బిడ్డను కాపాడుకోలేకపోవడం గ్రామమంతా దిగ్భ్రాంతికి గురిచేసింది.గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ, కొన్ని లక్షల రూపాయలు పోయినా పర్లేదు, కానీ నాగరాజు ప్రాణం పోయింది.తల్లి సోమక్క ఆరోగ్యం దెబ్బతింది. ఈ బాధ ఏ తల్లిదండ్రులకీ రావద్దు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.సోమక్క లాంటి తల్లులు ఈ లోకంలో మాతృ ప్రేమకు సజీవ నిదర్శనం. ఆమె త్యాగం వృథా కాలేదని, ఆ బాధ నుండి సమాజం నేర్చుకోవాలని, కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# జోరుగా కురిసిన వాన

## మాయదారి మొంథ తుఫాన్ మొత్తం ముంచింది...

**వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న పత్తి ధ్వంసం.. • ఆందోళనలో రైతాంగం**

హనుమకొండ అక్టోబర్ 29 (మనం ప్రతినిధి ) మాయదారి మొంథా తుఫాన్ వరంగల్ జిల్లాలో మొత్తం పంటలను ముంచేసింది. ఆరుగాల కష్టపడి నాటు వేసి విత్తనాలు వేసిన రైతాంగం పంట కోసే దశకు వస్తున్న నేపథ్యంలో మాయదారి తుఫాన్ తాకిడితో వరి పంట పూర్తిగా నేలమట్టం అయింది. పత్తి పంట పూర్తిగా మొలకెత్త సాగింది. మొక్కజొన్న సైతం తడిసి ముద్దయి మొలకెత్తుటకు సిద్ధంగా ఉంది. ఆదిలోనే హంసపాదు ఉన్నట్లు నగదు పంటలైన ఎర్ర బంగారం మిర్చి పంట సైతం ఈ తుఫాను తాకిడికి ఆకులు కూడా లేకుండా పంట మొదట్లోనే భూవర్పణం జరిగింది. మొదట్లో ఆంధ్రకు పరిమితమై తెలంగాణకు కొద్దిపాటి ప్రమాదం ఉందని సూచించిన వాతావరణ శాఖ బుధవారం వాతావరణ శాఖ మన వరంగల్ జిల్లాలో కూడా వర్ష ప్రభావం ఉంటుందని అధికారులు తెలపడంతో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నం చేశారు అయినప్పటికీ అధికారులు తెలిపిన దాని కంటే వర్షం ఎక్కువ గా కురావడంతో దిక్కుతోచల స్థితిలో రైతులు తమ పంటను కాపాడుకోవాలో తెలియక మనోవేదన గురై నాన్న తంటలు పడుతున్నారు మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కురసిన వర్షానికి ఆత్మకూరు మండలం కటాక్షపూర్ చెరువు మత్తడి పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి నడి కూడా మండలం కంటాత్మకూరు గ్రామంలోని వాగు పొంగి పోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి కురిసిన తీవ్ర వర్షాభావానికి . వాగులు వంకలు పొంగిపొర్లతో బాటసారులకు తీవ్రమైన ఆటంకం కలిగించింది. వరంగల్ జిల్లాకే తలమానికంగా ఉన్న పాకాల చెరువు మత్తడివాగు నర్సంపేట నుండి మహబూబాద్ జిల్లా డోర్నకల్ మీదుగా ప్రవహిస్తూ రహదారుల వెంట హై లెవెల వంతెనలపై నీటి నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది తుఫాన్ కారణంగా చేతికిచ్చిన పంటలు పూర్తి గా దెబ్బ తినడంతో రైతులు కోలుకులేమని ఆవేని వ్యక్తం చేస్తున్నారు ఈ తుఫాన్ కారణంగా దిగుబడులపై ప్రభావం పెద్ద ఎత్తున ఉంటుందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు ఈదురుగాలులు తోడవడంతో వరిపైరు తీవ్రంగా దెబ్బతింటుంది. ముంపునీరు దిగిపోయిన తర్వాత సత్వర యాజమాన్య పద్ధతులు పాటించినప్పటికీ తుపాను ప్రభావం దిగుబడులపై ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఎకరాకు కనీసం 5 నుంచి 8 బస్తాలు దిగుబడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ధాన్యం రంగుమారడం, తేమశాతం ఎక్కువగా ఉండ అవకాశాలున్నాయి. తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే అయితే మొలకలొచ్చే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు. వరంగల్ హనుమకొండ లో ఉదయం నుంచే కూలిన భారీ వర్షానికి పలు కాలనీలు వరద నీరు చేరి ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది వరద నీరు ఇండ్లలోకి చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు అధికారులు నిట మునిగిన కాలనీలను ప్రజలను అప్రమత్తం చేశారు ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి హనుమకొండ బస్టాండ్ లోకి మరద నీరు చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు మోకాళ్లతో వరకు నీరు చేరడంతో బస్సులు కదలలేక పెద్ద ఎత్తున టాపిక్ జామ్ ఏర్పడింది పోలీసు అధికారులు అప్రమతమై ట్రాఫిక్ ను క్లియర్ చేశారు పోలీస్ అధికారులు రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో రోడ్లపై నడిచేందుకు ప్రజల నాన్న ఇబ్బందులు పడ్డారు వారందరినీ మరదనిటిలో చిక్కుకోకుండా సురక్షితంగా గమ స్థానాలకు చేర్చారు

### తుఫాన్ ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్తం...

భారీ వర్షాల నేపథ్యంలో జన జీవనం స్తంభించిపోయింది. ఇళ్ల నుంచి ప్రజలకు బయలకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో రుస్తున్న భారీ వర్షాలకు నగరంతోపాటు పలు కాలనీలు నీట మునిగాయి. దీంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు త్యవసరం అయితే తప్పా బయటకు ఎవరూ రాకూడదని హెచ్చరికలు జారీ చేశారు. గ్రేటర్ 49వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని వెళ్లేందుకు బీటీ రోడ్లు లేకపోవడంతో మట్టి రోడపై వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ కాలనీలో సుమారు 30 ఇళ్లు ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు బురదమూలంగా జారిపడుతున్నారు. వర్షం పడితే -లనీ మొత్తం నీట మునుగుతోంది. దీంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, ప్రలు ఇబ్బందులు కలగకుం అధికారులు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతూనే ఉన్నారు. తుపాన్ ప్రజావంతో వర్షం అధికంగా కురుస్తుండటంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకు డా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు. కాలనీలో రోడ్డు అద్వాన్నంగా మారాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలా కుంటలను తలపిస్తున్నాయి. రోడ్డుకు -డుగడుగునా గుంతలమయం కావడంతో కాలనికి వెళ్ళాలంటే వాహనదారులు, ప్రజలకు జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితులో ప్రయాణం చేయాల్సి వస్తోందని -వేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు అదుపుతప్పి పలువురికి గాయాలు అయిన ఘటనలు కూడా నెలకొన్నాయి సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపునీరు, మ యగునీరు రోడ్డుపై పారుతోంది. దీతో దోములకు అవాసాలు మారి కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు.







# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్. నాగరాజు



పర్వతగిరి , అక్టోబర్ 29 ( మనం న్యూస్ ): మొంథ తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్. నాగరాజు సంబంధిత వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లతో ఫోన్ ద్వారా మాట్లాడి, అన్ని శాఖల అధికారులు తమ తమ ప్రధాన కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉండాలని సూచించారు.ఇటీవల ప్రారంభమైన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని, రైతులు మరియు సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కె ఆర్. నాగరాజు ఆదేశించారు..వర్ధన్నపేట నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో వరంగల్ జిహెచ్ఎంసి పరిధిలో వర్షాలు తీవ్రంగా కురుస్తుండటంతో ప్రజల భద్రతపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా తక్కువ ప్రాంతాలు, చెరువులు, వాగులు, డ్రెయిన్లు నిండిపోవడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. పిల్లలను నీటి ప్రదేశాలకు వెళ్లనీయకూడదు, అని ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు ప్రజలను హెచ్చరించారు..అలాగే రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, గ్రామపంచాయితీ , ఇరిగేషన్ విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, వర్షాల ప్రభావంతో ఎక్కడైనా చెట్లు లేదా విద్యుత్ స్తంభాలు కూలిపోతే వెంటనే స్పందించి పరిష్కరించాలి అని సూచించారు..ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. నేను స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నాను. మొత్తం మీద, వర్షాల సమయంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, అధికారులు పహారా వ్యవస్థను బలోపేతం చేయాలని మరియు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు స్పష్టంగా సూచించారు.

# మొంథా తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



పర్వతగిరి , అక్టోబర్ 29 ( మనం న్యూస్ ): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో వాతావరణ శాఖ జిల్లా కు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో... క్షేత్ర స్థాయి లో అధికారులు అప్రమత్తం గా ఉంటూ రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ ఆదేశించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మరియు స్పెషల్ ఆఫీసర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అన్ని గ్రామాల్లో పరిస్థితులను సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహణకు పలు సూచనలు చేశారు. 1.నీరు చేరే ప్రాంతాలు, వాగులు, చెరువులు దగ్గరికి వెళ్లకండి.2. విద్యుత్ తీగలు తెగి పడిన చోట దూరంగా ఉండండి - వెంటనే పంచాయతీ/లైన్మ్యాన్కు సమాచారం ఇవ్వండి.3. పాత ఇళ్ళు, గోడలు బలహీనంగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండండి. అవసరమైతే సురక్షిత స్థలానికి వెళ్లండి.4. పిల్లలను బయట ఆడుకునేందుకు అనుమతించవద్దు.5. బోర్లు, డ్రైనేజ్ మాన్హోల్స్ దగ్గరికి వెళ్లకండి - వాటర్ కరెంట్ ప్రమాదకరం.6. అవసరమైన మందులు, టార్చ్, మొబైల్ ఫోన్ చార్జ్ ఉంచుకోండి.7.ఎవరైనా గర్భిణీ స్త్రీలు డెలివరీ దగ్గరలో ఉంటే సంబంధిత ఆశా కార్యకర్తకు సమాచారం ఇవ్వండి 8. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా జీపీవో గార్లకు సమాచారం ఇవ్వండని ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ తెలిపారు.




# జూబ్లీహిల్స్ బైపోల్ స్పెషల్




# పొలిటికల్ స్లెడ్జింగ్

## ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు

ఏకాగ్రతను దెబ్బతీసేలా వ్యూహాలు
ఇలా చేసి గెలవాలని చూస్తున్నారా?
ఇది ప్రజాస్వామ్య విధాన ప్రక్రియనా?
జూబ్లీహిల్స్ బైపోల్స్‌లో వింత వ్యవహారం
సెంటిమెంట్‌తో పాటు స్లెడ్జింగ్‌పై
దృష్టి పెట్టారా?

సాధారణంగా స్లెడ్జింగ్ గురించి క్రీడల్లో.. ముఖ్యంగా క్రికెట్‌లో వింటుంటాం. ప్రత్యర్థి ఆటగాడిని ఉద్దేశపూర్వకంగా అవమానించడం లేదంటే మాటలతో హేళన చేయడం. ప్రత్యర్థి ఏకాగ్రతను బలహీనపరచడం.. తద్వారా వారి సామర్థ్యానికి అనుగుణంగా ప్రదర్శన చేయకుండా చేసేందుకు.. ఇంకా చెప్పాలంటే తప్పులకు పాల్పడేలా దృష్టి మళ్లించేలా చేసే ఉద్దేశ్యంగా చెప్పవచ్చు. సరిగ్గా ఇదే వ్యవహారం ఇప్పుడు రాజకీయాల్లో కనిపిస్తోంది. స్లెడ్జింగ్ రాజకీయాల్లోకి ప్రవేశించింది. అది కూడా అడ్డూ అదుపు లేకుండా వ్యక్తిగత దూషణలకు చేరుకుంది. ఈ విధానాన్ని బీఆర్ఎస్ వాడుకుంటోంది? అనే విమర్శలు వస్తున్నాయి. జూబ్లీహిల్స్ బైపోల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు.. సోషల్ మీడియాలో కొనసాగుతున్న స్లెడ్జింగ్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతోంది.

భాగ్యనగరం బ్యూరో, మనం న్యూస్: రాజ్యాంగం కల్పించిన హక్కులకు అనుగుణంగా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. గెలుపుపై తనవంతు ప్రయత్నాలు చేసుకునే హక్కు ఉంటుంది. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల వ్యవహారాలను వారి హక్కులకు భంగం కలగకుండా విమర్శలు చేసుకునే వీలుంటుంది. కానీ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ అభ్యర్థిని టార్గెట్ చేస్తూ స్లెడ్జింగ్‌కు పాల్పడుతుండటం తీవ్ర దుమారం రేపుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ఈ స్థాయిలో ఎందుకు వ్యవహరిస్తోంది? తెలంగాణ ప్రాంత ప్రజల హక్కుల కోసం పోరాడి రాష్ట్రం సాధించడంలో కీలక భూమిక పోషించిన పార్టీ ఇంతలా ఓ ఉప ఎన్నిక గెలుపుకోసం చేస్తున్న స్లెడ్జింగ్... నిజానికి ఆ పార్టీపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని పెంచుతుందా? తగ్గిస్తుందా? అనే విషయాన్ని బీఆర్ఎస్ నేతలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమయ్యింది. సిట్టింగ్ స్థానం దక్కించుకునేందుకు సహజంగానే దివంగత నేతపై ప్రజల్లో సెంటిమెంట్ ఉంటుంది. అయితే సెంటిమెంట్ అంతగా పనిచేయదని గుర్తించి .. కోణం మార్చారా? స్లెడ్జింగ్‌తో ప్రత్యర్థిపై ముప్పేట దాడికి పాల్పడితే ఓటర్లు మద్దతుగా నిలుస్తారనే ఆశాభావంతో ఉన్నారా? అనేది కూడా అంతుచిక్కడం లేదు. నిజానికి రాష్ట్రంలో బీసీ నినాదం ప్రధాన అంశంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఓ బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రత్యర్థిని ఇంతలా టార్గెట్ చేస్తుండటాన్ని ఓటర్లు గమనిస్తున్నారని.. బీఆర్ఎస్ అధినేతలు గుర్తించలేకపోతున్నారా? మేధావులు ఉన్న ఆ పార్టీలో ఇటువంటి విధానం ఎంచుకోవడం కూడా ఒక తప్పిదంగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# న్యాయపరమైన చర్యలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

## నవీన్ యాదవ్‌పై దుష్ప్రచారాన్ని ఖండించిన టీపీసీసీ లీగల్ సెల్

జూబ్లీహిల్స్,మనంన్యూస్: జూబ్లిహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్ట అభ్యర్థి నవీన్ యాదవ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారం, అసత్య పోస్టులు, నిరాధార ఆరోపణలను టీపీసీసీ లీగల్ సెల్ విభాగం న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు.బుధవారం మర్యాదపూర్వకంగా నవీన్ యాదవ్ను కలిసిన సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన ప్రజాదరణను ఓర్వలేక కొందరు అసత్యాలను వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు.ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నవారు ఆ పోస్టులను ఫార్వర్డ్ చేసిన వ్యక్తులు సహా అందరిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.ముఖ్యంగా డిఫమేషన్, డ్యామేజెస్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ గారు మాట్లాడుతూ ప్రజా నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం చట్టవిరుద్ధమని,ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని తప్పించుకోనివ్వమని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మోమిన్, సుధీర్, చౌహన్ తో పాటు ఇతర ప్రముఖ అడ్వకేట్లు పాల్గొని నవీన్ యాదవ్కు పూర్తి మద్దతు ప్రకటించారు.




# ర్యాండమైజేషన్

సిటీబ్యూరో, మనం న్యూస్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ఏర్పాట్లలో భాగంగా బుధవారం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన జనరల్ ఆబ్జర్వర్ రంజిత్ కుమార్, పోలీస్ ఆబ్జర్వర్ ఓం ప్రకాశ్ త్రిపాఠీ, వ్యయ పరిశీలకుడు సంజీవ్ కుమార్‌లాల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల ఏజెంట్లు సమక్షంలో ఈసీఐ మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, బల్దియా బాస్ కర్ణన్ తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఈ రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను నిష్పక్షపాతంగా కేటాయించడం జరుగుతుంది.

# ప్రజాపాలనలో

# అన్ని వర్గాల వారికి సమన్యాయం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

జూబ్లీహిల్స్,మనంన్యూస్:కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని తాండూరు ఎమ్మెల్యే,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో వెంగళరావునగర్ డివిజన్ లోని యాదగిరినగర్ ఇంచార్జి బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు.డివిజన్ లోని 144వ బూత్ కు చెందిన సుమారు వంద మంది బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందన్నారు.మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు.అంతేకాకుండా పేదలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.ఇందిరమ్మ ఇళ్లు పథకంతో ఎంతో మంది పేదల సొంతింటి కలను ఇప్పటికే సాకారం చేసిందని పేర్కొన్నారు.ప్రజాపాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల వారు కాంగ్రెస్ లో చేరడం అభినందనీయం అన్నారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీని గెలిపించడానికి కృషి చేయాలని కాంగ్రెస్ లో చేరిన వారిని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోపాల్,మనోజ్ తదితరులున్నారు.






# మైక్రో అబ్జర్వర్స్ కీలకం

సిటీబ్యూరో, మనం న్యూస్: పోలింగ్ కేంద్రంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, బల్దియా బాస్ ఆర్వీ కర్ణన్ అన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకూ ప్రతీ అంశాన్ని వారు పరిశీలించి సాధారణ పరిశీలకులకు నివేదిక పంపాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక విధుల్లో పాల్గొనే 120 మందికి పైగా సూక్ష్మ పరిశీలకులకు ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్‌తో కలిసి కర్ణన్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సూక్ష్మ పరిశీలకులు సాధారణ పరిశీలకుల నియంత్రణలో పనిచేస్తారన్నారు. పోలింగ్ కేంద్రాలలో వీరు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. మాక్ పోలింగ్ నిర్వహణ, పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలని.. నిబంధనలు మేరకు ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే సాధారణ పరిశీలకుల దృష్టికి వెంటనే తీసుకురావాలని.. పోలింగ్ రోజున పరిశీలించిన అంశాలను వారికి ఇచ్చిన ఫార్మాట్లో పూరించి అబ్జర్వర్‌కు అందించాల్సి ఉంటుందన్నారు.

# రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదు

## అమిత్ షా కీలక వ్యాఖ్యలు



పాట్నా, అక్టోబర్ 29 : రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటారని వ్యాఖ్యానించారు. బిహార్లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, ఆర్జేడీపై ఆయన వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన కుమారుడు తేజస్వీయాదవ్ను ముఖ్యమంత్రిని చేయాలనుకుంటున్నారని, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని పీఎంను చేయాలనుకుంటున్నారని అమిత్ షా విమర్శించారు. కానీ ఆ రెండు స్థానాలు ఖాళీగా లేవంటూ మహాగఠ్బంధన్ పార్టీలను ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ (కకౌఛీజీ) బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్కు భారతరత్న ఇచ్చి.. రాష్ట్ర ప్రతిష్ఠను పెంచారని ఈ ఎన్నికల ప్రచారం సందర్భంగా అమిత్షా వ్యాఖ్యానించారు. అలాగే పహల్గాం దాడి గురించి ప్రస్తావించారు. ''ఆ ఉగ్రదాడి జరిగిన వెంటనే మోదీ ఆపరేషన్ సిందూర్కు ఆదేశాలు ఇచ్చారు'' అని గుర్తుచేశారు. బీహార్లో అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఎన్డీయే, ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్బంధన్ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. విపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ అని ఇప్పటికే ప్రకటన రాగా.. ఎన్డీయే ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం స్పష్టత లేదు. దానిపైనే విపక్షాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. దాంతో తాము నీతీశ్ నాయకత్వంలో బిహార్ ఎన్నికలకు వెళ్తామని ఇటీవల మోదీ ప్రకటించారు. ఆయనే సీఎంగా కొనసాగుతారని తాజాగా అమిత్ షా స్పష్టంచేయడంతో ఎన్డీయే సీఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై ఉన్న సందిగ్ధత వీడిపోయింది.



# ప్రజలతో మమేకం అవ్వడానికి వర్షం అడ్డంకి కాదు

- బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్

జూబ్లీహిల్స్,మనంన్యూస్: ప్రజలతో మమేకం అవ్వడానికి వర్షం తమకు అడ్డంకి కాదని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ అన్నారు.బుధవారం నియోజకవర్గం వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తున్నా కూడా ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రజలకు చేరువయ్యేందుకు వర్షం ఒక సాకు కాకూడదని నిరూపించారు. ప్రచారంలో భాగంగా శ్రీనగర్ కాలనీ డివిజన్ వడ్డెర బస్తీ,సుభాష్ నగర్ ప్రాంతాల్లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిలతో కలిసి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.కాలనీవాసులు సునీత గోపీనాథ్ కు సాదరంగా స్వాగతం పలికారు. మాగంటి గోపీనాథ్ తో తమకున్న ఆత్మీయతను పంచుకున్నారు.తమ మద్దతు ఉంటుందని భరోసానిచ్చారు.ఈ సందర్భంగా మాగంటి సునీత మాట్లాడుతూ ప్రజలతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వారి చెంతకు చేరేలా చేస్తోందన్నారు.తమ ఆదరాభిమానాలు కేవలం రాజకీయాలకు పరిమితం కాదన్నారు.మాగంటి గోపీనాథ్ ఆశయాలను కొనసాగించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి,బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ భార్య అయేషా,స్థానిక బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.